అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 03-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 34 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

మన అమ్మాయిలు యువ చాంపియన్స్




ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్ సొంతం

ఫైనల్లో సత్తా చాటిన భద్రాచలం అమ్మాయి త్రిష

రూ.5 కోట్లు నజరానా ప్రకటించిన బీసీసీఐ

14లో





రాందేవ్ బాబాకు కేరళ హైకోర్టు షాక్

నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ

పతంజలి ఎండీ బాలకృష్ణకు కూడా..

తప్పుడు ప్రచారాల వివాదంలో కీలక పరిణామం

వివరాలు 13లో



ట్రేడ్ వార్ ?

అమెరికాపై కెనడా, మెక్సికో ప్రతీకార చర్యలు

టారీఫ్‌లు విధించేందుకు రెండు దేశాలు సిద్ధం

వెల్లడించిన ఇరుదేశాల అధినేతలు

సుంకాలపై ట్రంప్ నిర్ణయంతో వేడెక్కిన వాణిజ్యం

వివరాలు 13లో

నాలుగు కోట్ల మందికే బడ్జెట్ ప్రయోజనాలు

140 కోట్ల మంది భారతీయుల సంగతేమిటి?

జీఎస్టీని హేతుబద్ధీకరించాలనే ఆర్థికవేత్తల సూచనను పెడచెవిన పెట్టిన కేంద్రం





కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోసారి గ్రామీణ ప్రజలకు మొండిచేయి చూపించింది. వేతన జీవులకు మాత్రమే కొంత ఊరట కల్పించి చేతులు దులుపుకుంది. అదికూడా వారి వినిమయం పెరిగి కార్పొరేట్లకు లబ్ది చేకూరుస్తుందన్న భావనతోనే! పైగా ఆదాయపన్ను మినహాయింపుల కారణంగా ప్రభుత్వ ఖజానాపై లక్ష కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందంటూ మొసలి కన్నీరు కార్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే మీ వార్షిక జీతం రూ.12 లక్షలు అయితే అందులో రూ.80 వేలు ఆదా చేయగలరు. ఏడాదికి కోటి రూపాయలు ఆర్జిస్తుంటే ఐదు లక్షల రూపాయలు వెనకేసుకోగలరు. ఇదీ బడ్జెట్ అంకెల గారడీ.

ప్రధాన సమస్యలకు పరిష్కారాలేవి?

కీలక రంగాలకు కోతలు

గత కేటాయింపులనూ పూర్తిగా ఖర్చు చేయని ప్రభుత్వం

ఉపాధి కల్పనా రంగాలపై చిన్నచూపు

3లో..

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే వినియోగ విప్లవం రావాలని కొందరి అభిప్రాయం. దేశంలో సుమారు ఎనిమిది కోట్ల మంది ఆదాయపన్ను రిటర్న్‌లు దాఖలు చేస్తుంటారు. వారిలోనూ సగం మందివి జీరో-ట్యాక్స్ రిటర్న్‌లే. కాబట్టి వినియోగ విప్లవం అనేది కేవలం నాలుగు కోట్ల మందికి మాత్రమే పరిమితం. అయితే దేశ జనాభా 140 కోట్లు. మరి మిగిలిన వారి సంగతేమిటి?. మన దేశంలో ప్రయివేటు వినియోగ వ్యయం సుమారు రూ.200 లక్షల కోట్లు. కాబట్టి ఈ పన్ను ఉద్దీపనలు మొత్తం విలువలో కేవలం 0.5 శాతం మాత్రమే.

జీఎస్టీ రేట్లను తగ్గిస్తే...

ఏదో కంటి తుడుపు చర్యగా పన్ను మినహాయింపులు ప్రకటించడానికి బదులు ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీఎస్టీ రేట్లను తగ్గించి ఉంటే ప్రజల కొనుగోలు సామర్థ్యం కచ్చితంగా పెరిగి ఉండేది. కేవలం నాలుగు కోట్ల మంది పన్ను చెల్లింపుదారుల కొనుగోలు శక్తే కాదు....మొత్తం 140 కోట్ల భారతీయుల కొనుగోలు శక్తి కూడా పెరిగేది. కానీ ప్రభుత్వం ఇక్కడ ఓ తిరకాసు పెడుతోంది. జీఎస్టీ రేటు అనేది కేంద్ర బడ్జెట్‌లో నిర్ణయించేది కాదని, దానిని జీఎస్టీ మండలి నిర్ణయిస్తుందని చెబుతోంది. నిజం చెప్పాలంటే అది ఓ కుంటిసాకు మాత్రమే.

రక్తాన్ని పీలుస్తున్న వ్యవస్థ

కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాలకు కలిపి జీఎస్టీ మండలిలో స్పష్టమైన ఆధిక్యత ఉంది. కాబట్టి జీఎస్టీని పెంచాలన్నా, తగ్గించాలన్నా నిర్ణయాధికారం పరోక్షంగా బీజేపీదే. ప్రస్తుతం జీఎస్టీ గరిష్ట రేటు 18 శాతం. లగ్జరీ రేటు 28 శాతం. గత ఎనిమిది సంవత్సరాలుగా వీటిలో ఎలాంటి మార్పులు చేయడం...

13లో

ఆదాయాలు పెరిగినప్పుడే..

'పన్ను రేట్లను తగ్గిస్తే ప్రజల వినియోగం పెరుగుతుంది. ప్రజలపై మరిన్ని పన్నులు విధించడానికి ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. అప్పుడు వాటిపై మళ్లీ మినహాయింపులు...ఇలా ఈ చక్రం తిరుగుతూనే ఉంటుంది' అని ఓ ఆర్థికవేత్త వ్యాఖ్యానించారు. అయితే ఆదాయాలు పెరిగినప్పుడే ఇవన్నీ సాధ్యపడతాయన్న వాస్తవాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. 'రెవెన్యూ తటస్థ' జీఎస్టీ రేటు 6.2-15.3 శాతం మధ్య ఉండాలని అనేక అధ్యయనాలు సూచించాయి. గరిష్ట రేటును 18 శాతం నుండి 15 శాతానికి, లగ్జరీ రేటును 28 శాతం నుండి 22 శాతానికి తగ్గిస్తే ప్రభుత్వం కోల్పోయే ఆదాయం ఏమీ ఉండదు. కానీ జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరిం చడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సీనియర్ న్యాయవాది (ట్యాక్స్) అరవింద్ దతార్ చెప్పారు.



తిరోగమన బడ్జెట్

దేశ అభివృద్ధికి శాపం

కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలకు వ్యతిరేకం

సామాజిక తరగతులకు అన్యాయం

వేగంగా సరళీకృత ఆర్థిక విధానాల అమలు

ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా 10న హైదరాబాద్‌లో ధర్నా

తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ తిరోగమనంగా ఉందనీ, అది దేశ అభివృద్ధికి శాపంగా ఉండనుందని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోరాట వేదిక నాయకులు పాలడుగు భాస్కర్ సమన్వయంతో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ప్రజల జీవితాలకు, శ్రామికుల బతుకుదెరువుకు శాపంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల10న హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. బడాబాబుల బొజ్జలను మరింతగా నింపేలా, మధ్యతరగతి ఉద్యోగులను మభ్యపెట్టేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. ప్రమాదకరమైన విధానాలు అమలు జరిపేందుకు మరింత ప్రోత్సాహంగా ఉన్న ఈ బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇంత మొండిగా బరితెగించి ప్రజావ్యతిరేక విధానాలను అమలు జరుపుతున్న నేపథ్యంలో శ్రామికులు, ఇతర ప్రజానీకం ఐక్యంగా పోరాటాలు నిర్వహించటం తప్ప మరో మార్గం లేదన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విధానాల ఫలితంగానే దేశం తిరోగమిస్తున్నదని బడ్జెట్ కంటే ముందురోజు ...

13లో

కేంద్ర బడ్జెట్‌పై వెల్లువెత్తిన నిరసనలు

బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం

కార్పొరేట్లకు ఊడిగం చేసేలా కేంద్ర బడ్జెట్

సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసనలు

5లో..

కేంద్రంపై యుద్ధమే

కిషన్‌రెడ్డి, సంజయ్ పదవులకు రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై బీజేపీ వివక్ష
- బడ్జెట్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్రాల సమగ్రతను దెబ్బతీస్తోంది
- పార్టీలకతీతంగా కలిసి రండి
- నేడు దిష్టిబొమ్మల దగ్ధానికి పిలుపు

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ధర్నాలో మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీపై యుద్ధం ప్రకటించారు. రాష్ట్రానికి ఒక పైసా తీసుకురాని కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్రాల సమగ్రతను దెబ్బతీసి, ఆధిపత్యం చెలాయించాలనే కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై బీజేపీ వివక్ష చూపిస్తున్నదని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా తెలంగాణపై కేంద్రం వైఖరికి నిరసనగా ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి రాజకీయాలను పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులిచ్చే వరకు శాంతియుతంగా పోరాటం చేస్తామన్నారు. కేంద్ర మంత్రులకు రాష్ట్రాభివృద్ధి పట్టదా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఒంటరి పోరాటం చేస్తారని చెప్పారు. తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సమగ్రాభివృద్ధికి ...

13లో



లెక్క తేలింది..

రాష్ట్రంలో బీసీలే అధికం

4న క్యాబినెట్ ముందుకు

అదేరోజు అసెంబ్లీకి సమర్పణ

కులగణన నివేదికపై ప్రత్యేక చర్చ : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదారాబాద్

రాష్ట్రంలో కులగణన లెక్క తేలింది. ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై రూపొందించిన నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేశారు. మంత్రివర్గ ఉప సంఘం సమావేశమై నివేదికపై చర్చించిన అనంతరం మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని చెప్పారు. రాహుల్‌గాంధీ కోరిక మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామని వివరించారు. మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి జనగణన జరుగుతున్నదన్నారు. అసలైన పేదలను గుర్తించేందుకు వీలుపడే కులగణన మాత్రం ఇంతవరకు జరగలేదని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని చెప్పారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణ కోసం కులగణన చేపట్టామని అన్నారు. సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్రంలోని 96.9 శాతం మంది అంటే 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొని తమ వివరాలను తెలియజేశారని మంత్రి ...

13లో

4న ప్రత్యేక అసెంబ్లీ

అదే రోజు క్యాబినెట్

కులగణనపై ప్రత్యేక చర్చ

13లో..

రాష్ట్రపతి ప్రసంగంపై వ్యాఖ్యలు

సోనియా, రాహుల్, ప్రియాంకలపై క్రిమినల్ కేసు నమోదు



ముజఫర్‌పూర్ : రాష్ట్రపతి ప్రసంగంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలపై ముజఫర్‌పూర్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ (సీజేఎం) కోర్టులో ఫిర్యాదు నమోదైంది. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం పార్లమెంటు వెలుపల.. ఆమె ప్రసంగం బాగోలేదని చెప్పడం సరికాదనీ, కాంగ్రెస్ నేతలు ద్రౌపది ముర్మును అవమానించేందుకు ప్రయత్నించారని సదరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లహ్లేద్‌పూర్ పటాహి నివాసి ముజఫ్ఫాపూర్‌కి చెందిన ప్రముఖ న్యాయవాది సుధీర్ కుమార్ ఝా కోర్టులో ఫిర్యాదు చేశారు. భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్) 2023లోని 352, 351(2) (3) 79, 151 61(2) కింద వీరిపై కేసు నమోదైంది. ఆరోపణలు రుజువైతే.. నిందితులకు రెండు నుంచి ఏడేండ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉన్నదని సుధీర్ తెలిపారు. కాగా, ఈ పిటిషన్‌ను ఈనెల 10న కోర్టు విచారించనుంది. కాగా, జనవరి 31వ తేదీన పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మొదటగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. రాష్ట్రపతి...

13లో

విశాఖ స్టీల్‌ను కేంద్రమే నడపాలి

స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు

- సమగ్ర భూ పంపిణీ ద్వారానే పేదరిక నిర్మూలన
- సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలో ఏకగ్రీవ తీర్మానాలు

సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

విశాఖ స్టీల్ ప్లాంటును కేంద్రమే నిర్వహించాలని, ప్రయివేటీకరించొద్దని, సొంత గనులు కేటాయించాలని సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 27వ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గత ఎన్నికల ముందు టీడీపీ, జనసేన నాయకులు ఈ మేరకు వాగ్దానాలు చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకా పుట్టని ఆర్సెల్లార్ మిట్టల్‌కు గనులు ఇవ్వాలని కోరారేగానీ, విశాఖ స్టీలుకు ఇవ్వాలని కోరలేదని తీర్మానంలో పేర్కొన్నారు. నెల్లూరులోని సీతారాం ఏచూరి నగర్ (అనిల్ గార్డెన్స్)లో జరుగుతున్న మహాసభ రెండో రోజు పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించింది. కడపలో స్టీల్ ప్లాంటు, పేదలందరికీ సమగ్ర భూ పంపిణీ, కార్మికులకు కనీస వేతనాలు, రెగ్యులరైజేషన్, సంక్షేమ పథకాలు అమలు వంటివి వాటిలో ఉన్నాయి. పట్టణాల్లో ఆస్తి పన్ను పెంపు ఆపాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రయివేటీకరణ ఆపాలని, దళితులపై దాడులు అరికట్టాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



మహాసభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

కార్పొరేట్లతో కుమ్మక్కై విశాఖ స్టీల్ ప్లాంటును దెబ్బతీస్తున్న కేంద్రం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లతో కుమ్మక్కై భూములను, గనులను, భారీ పరిశ్రమల సంపదను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నాయని, ఇటువంటి ప్రయివేటీకరణ ప్రయత్నాలు ఆపాలని మహాసభ డిమాండ్ చేసింది. స్టీల్ ప్లాంటు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ జిల్లాకు చెందిన కెఎం.శ్రీనివాస్ తీర్మానం ప్రవేశపెట్టగా తిరుపతి జిల్లాకు చెందిన నాగరాజు ...

3లో

కూతుళ్లను రక్షించలేకపోతున్నాం

అయోధ్యలో దళిత మహిళ దారుణ హత్యపై ఎస్పీ ఎంపీ భావోద్వేగం

మీడియా ముందు బోరున విలపించిన అవధేశ్ ప్రసాద్

3లో..

నేడు లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు నివేదిక

సమర్పించనున్న జేపీసీ

వివరాలు 3లో



డబ్ల్యూటీఓలో తేల్చుకుంటాం !

- ట్రంప్ టారీఫ్‌లపై చైనా నిరసన
- హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడి

బీజింగ్ : చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10శాతం అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ తీసుకున్న చర్యలను చైనా తీవ్రంగా ఖండించింది. తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలు పరిరక్షించుకునేందుకు ...

13లో



ఏం చేద్దాం?

కేంద్రం తీరుపై రాష్ట్రం సమాలోచన

బడ్జెట్ పద్దుల్లో మార్పులు చేర్పులు

సంక్షోభంలో సంక్షేమం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రం తీరును రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అనేకసార్లు ఢిల్లీ వెళ్లి, శాఖల వారీగా కేంద్రమంత్రుల్ని కలిసి, కావల్సిన నిధుల గురించి లేఖలు ఇచ్చినా, కేంద్ర బడ్జెట్‌లో ఎక్కడా వాటి ప్రస్తావనే లేకపోవడాన్ని రాష్ట్ర ...

3లో

గుజరాత్‌లో ఘోరం

- బస్సు లోయలో పడి ఐదుగురు మృతి



గాంధీనగర్ : గుజరాత్‌లో ఘోరం జరిగింది. ఒక లగ్జరీ బస్సు లోయలో పడి ఐదుగురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. ఆదివారం తెల్లవారుజామున 4 నుంచి 4.15 గంటల మధ్య సమయంలో గుజరాత్‌లోని డాంగ్ జిల్లా సపుతారా సమీపంలో బస్సు 130 అడుగు లోతైన లోయలో పడిపోయింది. దీంతో బస్సులోని 48 ప్రయాణికుల్ని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఐదురగురు ప్రయాణికులు మృతి చెందారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు అదుపుతప్పి గుజరాత్‌లోని కొండమీద పట్టణమైన సపుతారాకి రెండున్నర కిలోమీటర్ల దూరంలో లోయలో పడిందని దాంగ్ డీఎస్పీ పాటిల్ మీడియాకు వెల్లడించారు. ఇంకా ఈ ఘటనపై సమాచారం తెలియాల్సి ఉందని ఆయన అన్నారు.

భారత్‌కు గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గ్యోంగ్



న్యూఢిల్లీ : కరుడుగట్టిన నేరగాడు, గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గ్యోంగ్‌ను ఎట్టకేలకు భారత్‌కు రప్పిస్తున్నారు. ఫిలిప్పీన్స్ నుంచి బ్యాంకాక్ మీదుగా గ్యోంగ్‌ను ఢిల్లీకి తీసుకువస్తున్నట్టు సీబీఐ అధికారులు తెలిపారు. సీబీఐకు చెందిన గ్లోబల్ ఆపరేషన్స్ సెంటర్ నిరంతరాయంగా ప్రయత్నించి గ్యోంగ్‌ను భారత్‌కు రప్పించడంలో విజయవంతమైంది. హర్యానా స్పెషల్ టాస్క్‌ఫోర్స్, సీబీఐ సంయుక్త అభ్యర్థన మేరకు జోగిందర్ గ్యోంగ్‌ను భారత్‌కు అప్పగించాలని ఫిలిప్పీన్స్‌కు ఇంటర్‌పోల్ రెడ్ నోటీస్ జారీచేసింది. దాంతో ఫిలిప్పీన్స్ అధికారులు జోగిందర్ గ్యోంగ్ భారత పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని సీబీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గ్యోంగ్‌పై భారత్‌లో దోపిడీ, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్ తదితర కేసులు ఉన్నాయి. జోగిందర్ గ్యోంగ్ సోదరుడు సురీందర్ గ్యోంగ్ 2017లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. సోదరుడి మరణానికి ప్రతీకారంగా జోగిందర్ గ్యోంగ్ గ్యాంగ్‌స్టర్‌గా మారాడు. అనంతరం 2023లో నేపాల్ మీదుగా ఫిలిప్పీన్స్‌కు పారిపోయాడు. ఇంటెలిజెన్స్ సాయంతో గ్యోంగ్ ఫిలిప్పీన్స్‌లో ఉన్నట్టు తెలుసుకున్న సీబీఐ అధికారులు.. అక్కడి అధికారులతో మాట్లాడి భారత్‌కు రప్పిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గ్యోంగ్ హర్యానా రాష్ట్రం కైతాల్‌లోని గ్యోంగ్ గ్రామ నివాసి. అతడిని జోగా డాన్ అని కూడా అంటారు. అతనిపై హర్యానా, పంజాబ్, ఢిల్లీ, యూపీలో పలు తీవ్రమైన కేసులు ఉన్నాయి. ఒక్క కైతాల్‌లోనే జోగిందర్ గ్యోంగ్‌పై 17 కేసులు నమోదయ్యాయి.


వాషింగ్టన్‌కు నెతన్యాహు

- నేడు ట్రంప్‌తో భేటీ ?

జెరూసలేం : అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కావడానికి ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ఆదివారం వాషింగ్టన్‌కు బయలుదేరి వెళ్లారు. గాజాలో దాడుల విషయమై బైడెన్ ప్రభుత్వంతో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ సర్కారుతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు నెతన్యాహు ప్రయత్నిస్తున్నారు. సోమవారం వారిద్దరి మధ్య సమావేశం జరగవచ్చని భావిస్తున్నారు. ట్రంప్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటగా భేటీ కానున్న విదేశీ నేత నెతన్యాహు కానున్నారు. గాజాలో జరిగిన దాడుల్లో తాము తీసుకున్న నిర్ణయాలతో మధ్య ప్రాచ్యంలో పరిస్థితులు ఇప్పటికే మారాయని నెతన్యాహు వాషింగ్టన్‌కు వెళ్లడానికి ముందు విమానాశ్రయంలో వ్యాఖ్యానించారు. తాము తీసుకున్న నిర్ణయాలు, తమ సైనికులు చూపించిన సాహసాలతో మ్యాప్‌ను తిరగరాశామన్నారు. ట్రంప్‌తో సన్నిహితంగా పనిచేస్తే ఈ మ్యాప్‌ను మరింత మెరుగ్గా విస్తరిస్తామని ఆశిస్తున్నామని చెప్పారు. గాజాలో కాల్పుల విరమణ అమలు జరుగుతున్నవేళ, ఈ వారంలో రెండో దశ కాల్పుల విరమణ అమలుకు చర్చలు ప్రారంభమవుతాయని ఆశిస్తున్న తరుణంలో ఈ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకున్నది.

బీజేపీ డబ్బు ఉచ్చులో పడొద్దు

- ఢిల్లీ ఓటర్లకు ఆప్ చీఫ్ కేజ్రీవాల్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో బీజేపీ ప్రలోభాలకు తెరలేపినట్టు ఆప్ ఆరోపిస్తున్నది. ఓటర్లను నోట్లతో కొనే అనైతిక చర్యకు ఆ పార్టీ పాల్పడుతున్నట్టు తమకు ప్రజల నుంచి సమాచారం అందిందని చెప్తున్నది. ఇందులో భాగంగా బీజేపీ నేతలు ఓటుకు మూడు వేల రూపాయల చొప్పున పంచుతున్నారని తెలిపింది. దీనిపై ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలను అప్రమత్తం చేశారు. బీజేపీ నేతలు పన్నిన డబ్బు వలలో ఓటర్లు పడొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన ఈ అంశంపై మీడియాతో మాట్లాడుతూ.. "నాకు ఈరోజు మురికివాడల నివాసితులు (జుగ్గీలు)ల నుంచి చాలా ఫోన్ కాల్స్ వచ్చాయి. ఓట్ల కోసం బీజేపీ నేతలు ఇంటింటికీ వెళుతున్నారు. మూడు వేల రూపాయలు ఇస్తామని ప్రజలకు ఆశచూపుతున్నారు. ఎన్నికల సంఘం(ఈసీ) సహకారంతో ఇంటింటికీ ఓటు సౌకర్యం కల్పిస్తామని బీజేపీ నేతలు హామీనిస్తున్నారు. ఇది విని నేను షాక్ అయ్యాను. నేను మీ అన్నను. ఇది విని నాకు రాత్రి నిద్రపట్టలేదు. బీజేపీ ఉచ్చులో పడకండి. వారు కోరుకున్నట్టే మీరు వారికి ఓటు వేసి.. సిరా చూపించినా..వారు మీపై కేసు పెట్టి అరెస్ట్ చేస్తారు. బీజేపీకి మీరు ఓటు వేయకండి. బీజేపీ నేతలు మీకు ఉచితంగా డబ్బు ఇస్తే తీసుకోండి. కానీ వారికి ఓటు మాత్రం వేయకండి" అని ఆయన అన్నారు. ఒకవేళ రాష్ట్రంలో పొరపాటున బీజేపీ ప్రభుత్వం వస్తే మురికివాడల్ని తొలగిస్తుందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

నేడు బహిరంగ సభ

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ రాక



నెల్లూరు : సీపీఐ(ఎం) 27వ రాష్ట్ర మహాసభ సందర్భంగా సోమవారం భారీ ర్యాలీ, బహిరంగ సభ జరగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు ఆత్మకూరు బస్టాండ్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుంది. బోసుబొమ్మ, సుందరయ్య బొమ్మ, ఎసి సెంటర్, గాంధీబొమ్మ, మీదుగా ట్రంకురోడ్డు నుంచి విఆర్‌సి మైదానం చేరుకుంటుంది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎంఎ బేబి, బివి రాఘవులతోపాటు, ఆ పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ గఫూర్, డి . రమాదేవితోపాట ఆపార్టీ సీనియర్ నాయకులు పాల్గొననున్నారు.ప్రదర్శన అగ్రభాగాన నేతలు, 27వ రాష్ట్ర మహాసభలకు సూచకంగా 27 మహిళలు ఎర్రచీరలు, అరుణపతాకాలతో ర్యాలీలో పాల్గొననున్నారు. డప్పులు, కోలాట దళం, విచిత్ర వేషధారణలు, తెనాలి బ్యాండ్, డిజేలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

దోపిడీ, పీడన, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలి

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క
- హైదరాబాద్‌లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, జంట నగరాల మహాసభ
- అమరవీరులకు సంతాపం
- అనంతరం కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-హైదరాబాద్

దోపిడీ, పీడన, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కోటి బీసీసీఈ భవనంలో ఆదివారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, హైదరాబాద్ జంట నగరాల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ ప్రారంభానికి ముందు సాంస్కృతికోద్యమంలో, ప్రజా ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు రెండు నిమిషాలు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. అనంతరం అమరులకు జోహార్లు చెబుతూ పాటలు పాడారు. మహాసభ మొదటి సెషన్‌కు కామ్రేడ్ మల్సూర్, కామ్రేడ్ ప్రభాకర్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా వక్తలుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్), తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క, కట్టా భగవంత రెడ్డి (రాజనీతి శాస్త్రజ్ఞులు), ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్ రావు మాట్లాడారు. విమలక్క మాట్లాడుతూ... 1974లో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజీలో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ నేతత్వంలో అరుణోదయ ఆవిర్భవించి 50 ఏండ్లు పూర్తి చేసుకుందన్నారు. ఈ కాలంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదుడుకులు, నిత్య నిర్బంధాలను అధిగమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. నక్సల్ బరి, శ్రీకాకుళం, సిరిసిల్ల, జగిత్యాల, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో అరుణోదయ ఏర్పడిందన్నారు. మత ఛాందసవాదానికి, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని తెలిపారు. అలాగే సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య సంస్కృతికి, నేడు పెచ్చరిల్లుతున్న ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా బలమైన ప్రత్యామ్నాయ సంస్కృతిని ఎత్తిపడుతూ ముందుకు సాగాలన్నారు. అమరుల పోరాట స్మృతితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

కట్టా భగవత్ రెడ్డి మాట్లాడుతూ నూతన ప్రత్యామ్నాయ సంస్కృతిని మనం పెంపొందించాలని, ప్రజా సంస్కృతిని ముందుకు తీసుకుపోవాలని అన్నారు. మన ఆచారాలు, వ్యవహారాలు, కట్టుబాట్లు సంస్కృతిలో భాగమని తెలిపారు. దోపిడీ సంస్కృతిని, కుల, ఫాసిస్టు, భూస్వామ్య సంస్కృతులను వ్యతిరేకిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. మనకు తెలియకుండానే మన మీద సనాతన సంస్కృతి దాడి చేస్తోందని, దీనిపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దోపిడీ శక్తులు శ్రామికులను విభజిస్తారని, బలహీనపరుస్తారని వాటి పట్ల మనం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగాలని తెలిపారు. ప్రతిఘటన ఉద్యమ సంస్కృతిని ఒంటబట్టించుకుని, దోపిడీ, ఆధిపత్య అణచివేత, నియంతత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రొఫెసర్ జయదీర్ తిరుమల రావు మాట్లాడుతూ అభివద్ధి చెందుతున్న దేశాలు మత జాతీయవాదానికి ప్రభావితం అవుతున్నాయన్నారు. సమాజంలో నేడు ఆర్థిక దోపిడీ, సామాజిక, సాంస్కృతిక దోపిడీ జరుగుతోందని తెలిపారు. ప్రతి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పబ్బం గడుపుకుంటూ పోతుందని, అనునిత్యం సనాతన ధర్మం పేరిట దోపిడీ జరుగుతుందని అన్నారు. దీని వల్ల ప్రజా ప్రయోజనాలు నెరవేరడం లేదని తెలిపారు. భాష ద్వారా, సెంటిమెంట్ల ద్వారా, మన వత్తుల ద్వారా మనం విడగొట్టబడడం దారుణం అన్నారు. ప్రజల మధ్య వస్తున్న గ్యాప్‌లను చైతన్యంతో అధిగమించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ సంస్కృతిని కోరుకుంటున్న మనం, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. సకల శ్రామికుల ఐక్యతను నెలకొల్పాలన్నారు.

అనంతరం జంట నగరాల కమిటీని అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మల్సూర్ ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా రాకేష్, ఉపాధ్యక్షులుగా హఫీజ్, సంతోష, ప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కార్యదర్శులుగా సౌజన్య, అరుంధతి, సంగీత, కోశాధికారిగా చైతన్య, కార్యవర్గ సభ్యులుగా సిరివల్లి, తేజ, సిరి, గీతిక, నిషా, విజయ్ మొత్తం 15 మందితో జంట నగరాల కమిటీని ఏర్పాటు చేశారు. అంతకుముందు అమరులైన కళాకారులు నూతన్, పరుపు బండ గోపాల్, రిక్కల సహదేవరెడ్డి, నాగన్న, సంతోష్ లాంటి ఎంతోమందికి ఈ సందర్భంగా నివాళులర్పించారు.

గాజా జనాభాను తరలించే ట్రంప్ ఆలోచనను

అరబ్ దేశాలు తిరస్కరణ



గాజా నుండి పాలస్తీనియన్లను పొరుగున ఉన్న ఈజిప్ట్, జోర్డాన్‌లకు తరలించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సూచనను అరబ్ దేశాల బందం వ్యతిరేకించింది. ఇజ్రాయిల్, హమాస్ మధ్య పోరాటం కారణంగా గాజా శిధిల ప్రదేశంగా మారిందని, ఆ మొత్తాన్ని శుభ్రపరచడం ఉత్తమ పరిష్కారం అని ట్రంప్ గత వారం పేర్కొన్నారు. కొన్ని అరబ్ దేశాలతో కలిసి పనిచేసి, గాజాలోని 2.3 మిలియన్ల జనాభాకు వేరే ప్రదేశంలో గృహనిర్మాణం చేస్తామని ఆయన తెలిపారు. "అక్కడ వారు శాంతియుతంగా జీవించవచ్చని నేను భావిస్తున్నాను. ఈ తరలింపు తాత్కాలికం లేదా దీర్ఘకాలికం కావచ్చు" అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. శనివారం కైరోలో జరిగిన అగ్ర దౌత్యవేత్తల సమావేశం తర్వాత, ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, పాలస్తీనియన్ అథారిటీ, అరబ్ లీగ్ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ, ప్రత్యక్ష బహిష్కరణ లేదా బలవంతపు వలసల ద్వారా పాలస్తీనియన్లను స్థానభ్రంశం చేయటాన్ని గట్టిగా తిరస్కరించాయి అని పేర్కొన్నాయి. ఈ చర్యలు మధ్యప్రాచ్య స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయి. వీటితో సంఘర్షణ విస్తరించే ప్రమాదం ఉంది. ఇవి ప్రజలలో శాంతి, సహజీవన అవకాశాలను దెబ్బతీస్తాయి అని ప్రకటనలో పేర్కొంది.

ఇజ్రాయిల్, పాలస్తీనియన్ల మధ్య రెండు రాజ్యాలు ఏర్పడటమనే పరిష్కారం ఆధారంగా మధ్యప్రాచ్యంలో న్యాయమైన, సమగ్రమైన శాంతిని సాధించడానికి ట్రంప్‌తో కలిసి పనిచేయడానికి తాము ఎదురు చూస్తున్నామని అరబ్ దేశాలు తెలిపాయి. పాలస్తీనియన్లు అక్కడే ఉండేలా చూసుకోవడానికి గాజా కోసం సమగ్ర పునర్నిర్మాణ ప్రణాళికకు సహాయం చేయాలని వారు అంతర్జాతీయ సమాజాన్ని కూడా కోరారు. గత వారం, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫట్టా ఎల్-సిస్సీ పాలస్తీనియన్ల పునరావాసాన్ని ఎప్పటికీ అనుమతించలేము అని నొక్కి చెప్పారు.

జోర్డాన్ విదేశాంగ మంత్రి అయ్మాన్ సఫాది కూడా ఈ చర్యకు తన దేశం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఉద్రిక్తత పెరిగిన కొద్దికాలానికే, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పాలన ఈజిప్ట్ గాజా నుంచి పాలస్తీనియన్లను తీసుకోవాలని సూచించింది. కానీ అరబ్ దేశాలు ఆ ఆలోచనను తిరస్కరించాయి. గాజాలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజా డేటా ప్రకారం, గాజాపై 15 నెలల ఇజ్రాయిల్ దాడులలో సుమారు 47,500 మంది పాలస్తీనియన్లు మరణించారు. 1,11,500 మందికి పైగా గాయపడ్డారు. గాజా జనాభాలో 90 శాతం మంది పోరాటం కారణంగా నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్య సమితి గణాంకాలు సూచిస్తున్నాయి. హమాస్ సరిహద్దు దాటి చేసిన దాడికి ప్రతిస్పందనగా ఇజ్రాయిల్ గాజాలో తన సైనిక చర్యను ప్రారంభించింది. దీనిలో దాదాపు 1,200 మంది మరణించారు. 250 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య ప్రస్తుతం అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ జరుగుతోంది. ఖైదీల మార్పిడి కొనసాగుతోంది. ఇంకా గాజాలో 79 మంది బందీలుగా ఉన్నారని, వారిలో 35 మంది చనిపోయినట్టు భావిస్తున్నారు.

గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాల వారికివ్వాలి:

- కేంద్ర మంత్రి సురేష్ గోపి వివాదాస్పద వ్యాఖ్యలు
- సర్వత్రా వెల్లువెత్తిన విమర్శలు



న్యూఢిల్లీ: కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి, కేరళలోని త్రిస్సూర్ ఎంపీ సురేష్ గోపి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాల వారికి ఇవ్వాలని అన్నారు. సినిమాల నుంచి రాజకీయాల్లోకి చేరిన సురేష్ గోపి ఆదివారం ఢిల్లీలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో మాట్లాడుతూ.. గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాలు వారు పర్యవేక్షిస్తేనే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని చెప్పారు. "గిరిజన సమాజానికి చెందిన వ్యక్తి మాత్రమే ఆ వ్యవహారాల శాఖ మంత్రి అవుతున్నారు. ఇది మన దేశానికి శాపం. గిరిజన సమాజం వెలుపల నుంచి ఒకరిని వారి సంక్షేమం కోసం నియమించాలనేది నా కల. నా భావన. ఒక బ్రాహ్మణుడు లేదా మరొక ఉన్నత కులస్థుడు ఆ శాఖ బాధ్యతలు చేపట్టనివ్వండి. గణనీయమైన మార్పు ఉంటుంది" అని ఆయన అన్నారు. గిరిజన నాయకులకు ఉన్నత వర్గాల సంక్షేమ శాఖ ఇవ్వాలని సురేష్ గోపి సూచించారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో అలాంటి మార్పు జరగాలని అన్నారు. అలాగే గిరిజన వ్యవహారాల శాఖను నిర్వహించాలనే తన కోరికను కూడా ఆయన వ్యక్తం చేశారు. ఆ మంత్రిత్వ శాఖను తనకు కేటాయించాలని ప్రధాని మోడీని కోరినట్టుగా వెల్లడించారు. సురేష్ గోపి చేసిన ఈ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బహిరంగ ప్రకటన

ఈ ప్రకటన ద్వారా, కరీంనగర్ జిల్లా, చిగురుమామిడి మండలం, రెకొండ గ్రామంలో సర్వే నెం.84లోని శ్రీ సుస్థిర గ్రానైట్స్ కు సంబంధించిన కలర్ గ్రానైట్ గనికి పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం వారు ఇచ్చిన EIA ప్రకటన, 2006 మరియు దాని సవరణలకు అనుగుణంగా, రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అంచనా బృందం (SEIAA), తెలంగాణ ద్వారా 26.07.2023న EC23B001TG 121891 గుర్తింపు సంఖ్యతో జారీ చేయబడింది. ఈ పత్రాలని పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ వెబ్ సైట్ http://parivesh.nic.in నందు లభ్యమగును.

మరో విద్యార్థిని బలి

- హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య
- కోల్‌కతా ఆర్జీకర్ కాలేజీలో ఉద్రిక్తత
- మృతురాలి కుటుంబీకుల అనుమానాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో మరోసారి అలజడి రేగింది. దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారిన ట్రైనీ డాక్టర్‌పై దారుణ లైంగికదాడి, హత్య ఘటన మరువక ముందే.. మరో 20 ఏండ్ల వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన ఇప్పుడు కలకలం రేపింది. రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని.. తన హాస్టల్ క్వార్టర్ లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని కనిపించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై హాస్పిటల్ వద్ద విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు

కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య జరిగిన సంఘటనపై ఈ కాలేజ్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది జనవరి 20న ఈ కేసులో నేరస్తుడిగా సంజయ్ రాయ్ ను తేల్చిన కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ ఘటన మరువకముందే మరో వైద్య విద్యార్థిని తన రూమ్ లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చనిపోయిన విద్యార్థిని ఐవి ప్రసాద్‌గా గుర్తించిన పోలీసులు.. మృతురాలు ఆ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్టు తెలిపారు. ప్రసాద్ తన గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. శుక్రవారం ఆమె తల్లి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో అనుమానం వచ్చి వెంటనే హాస్పిటల్ క్వార్టర్స్ కి వచ్చి చూసింది. గది తలుపులు మూసి ఉండటంతో వెంటనే బద్దలు కొట్టి చూడగా సీలింగ్ కు ఉరివేసుకొని కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.

ఈ మరణంపై కుటుంబీకులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే బాధితురాలి గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు.

సీఎం అభినందనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతో టీమిండియా అమ్మాయిల జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు ఈ సందర్భంగా సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. మలేషియాలో సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి ఇండియా విశ్వ విజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అదరగొట్టే ఆటను ప్రదర్శించారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. త్రిష లాంటి క్రీడాకారులు మన రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. త్రిష మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యమున్న యువతీ యువకులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు.

నేడు లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు నివేదిక

సమర్పించనున్న జేపీసీ

న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 నివేదికను జాయింట్ పార్లమెం టరీ కమిటీ(జేపీసీ) నేడు(సోమవారం) లోక్‌సభకు సమర్పించనుంది. ఈ వక్ఫ్‌బిల్లును ఎన్డీఏ సభ్యులు ఏకపక్షంగా ఆమోదించుకున్నారని ప్రతిపక్ష ఎంపీలు ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కమిటీలో సభ్యుడైన కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. "ఈ కమిటీలో నేను కూడా సభ్యుడిగా ఉన్నాను. ఈ బిల్లును నేను వ్యతిరేకిస్తూ వివరణాత్మక నోట్‌ను కమిటీకి సమర్పించాను. ఆశ్చర్యకరంగా నేనిచ్చిన నోట్ లోని కొన్ని భాగాలు నాకు తెలియకుండానే సవరించారు" అని ఆయన సామా జిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.ఈ బిల్లుకు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన 44 సవరణల్ని జేపీసీ తిరస్కరించింది. ఈ కమిటీలో ఎన్డీఏ సభ్యులు ప్రతిపాదించిన 14 సవరణల్ని ఆమోదించింది. ఈ సవర ణలకు ఎన్డీఏ సభ్యులు 16 మంది మద్దతు తెలిపారు. ప్రతిపక్షానికి చెందిన 10 మంది వ్యతిరేకించారు.

కూతుళ్లను రక్షించలేకపోతున్నాం

అయోధ్యలో దళిత మహిళ దారుణ హత్యపై ఎస్పీ ఎంపీ భావోద్వేగం

మీడియా ముందు బోరున విలపించిన అవధేశ్ ప్రసాద్



లక్నో : యూపీలోని అయోధ్య జిల్లాలో ఒక దళిత మహిళ దారుణంగా లైంగికదాడికి, హత్యకు గురైంది. ఆ మహిళ కాళ్లు విరిచి, కంటి గుడ్లు పీకి, నగ్నంగా ఉన్న ఆమె మృతదేహాన్ని పోలీసులు కాలువలో శనివారం గుర్తించారు. ఈ దారుణంపై ఫైజాబాద్ ఎస్పీ ఎంపీ అవధేష్ ప్రసాద్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఘటనపై ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బోరున విలపించారు. "నన్ను ఢిల్లీకి వెళ్లనివ్వండి. ప్రధాని మోడీ ముందు ఈ విషయాన్ని లోక్‌సభలో లేవనెత్తుతా. న్యాయం జరుగకపోతే లోక్‌సభ సభ్యత్వానికి నేను రాజీనామా చేస్తా. కూతుళ్లను రక్షించడంలో మనం విఫలమవుతున్నాం. చరిత్ర మనల్ని ఎలా భావిస్తుంది? మన కూతురికి ఇది ఎలా జరిగింది? మర్యాద పురుషోత్తమ రామ.. తల్లి సీత, మీరు ఎక్కడ ఉన్నారు?" అంటూ ఏడ్చారు. దీంతో ఎంపీ అవధేష్ ప్రసాద్ పక్కనే ఉన్న నేతలు ఆయనను ఓదార్చేందుకు ప్రయత్నించారు. అయోధ్య జిల్లాకు చెందిన 22 ఏండ్ల దళిత మహిళ జనవరి 30న రాత్రి వేళ భజన కార్యక్రమానికి వెళ్లిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. కాళ్లు విరిచి, కంటి గుడ్లు పీకి, తాళ్లతో కట్టేసిన నగ్న మృతదేహాన్ని శనివారం కాలువలో గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ఆ మహిళపై లైంగికదాడికి పాల్పడి దారుణంగా హింసించి చంపినట్టు అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు, పోలీసులు ఆ మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత ఏం జరిగిందన్నది నిర్ధారిస్తామని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.



ప్రధాన సమస్యలకు పరిష్కారాలేవి?

గత కేటాయింపులనూ పూర్తిగా ఖర్చు చేయని ప్రభుత్వం

ఉపాధి కల్పనా రంగాలపై చిన్నచూపు





కీలక రంగాలకు కోతలు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌పై ఎన్నో ఆశలు చిగురించాయి. కానీ చివరికి అవి వాడిపోయాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ రెండు సమస్యలు డిమాండ్‌పై ప్రభావం చూపుతాయి. వృద్ధి మందగిస్తుంది. అసమానతలు పెరిగిపోతాయి.

'బయటి' సమస్యలు

దేశ ఆర్థిక వ్యవస్థకు లోపలి నుండే కాదు...బయటి నుండి కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికాను అగ్రస్థానంలో ఉంచేందుకు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై ఆంక్షలకు సిద్ధపడుతున్నారు. వీటిలో భారత్ కూడా ఉంది. మన దేశాన్ని ఆయన 'టారిఫ్ కింగ్' అంటూ ఎత్తిపొడిచారు. భారతీయ ఎగుమతులపై అధిక సుంకాలు విధిస్తానంటూ హెచ్చరించారు. చైనా, మిత్ర దేశాలను కూడా ఆయన వదలడం లేదు. ఈ అల్టిమేటంల కారణంగా సుంకాల 'యుద్ధం' జరిగే అవకాశం ఉంది. సరఫరా వ్యవస్థలో ఆటంకాలు, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి అస్థిర పరిస్థితుల నడుమ డాలరుతో పోలిస్తే రూపాయి విలువ పతనమవుతోంది. విదేశీ నిధులు తరలిపోతున్నాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నాయి. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటిపోతున్నాయి. వీటన్నింటి వల్ల దేశంలో ద్రవ్యోల్బణ ఒత్తిడులు ఏర్పడుతున్నాయి. అయితే ఇలాంటి బయటి పరిణామాలపై మనకు నియంత్రణ ఏమీ ఉండదు. కాబట్టి అంతర్గతంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.

ప్రకటనలే కాదు...కేటాయింపులూ ముఖ్యమే

బడ్జెట్‌లో ప్రకటనలు చేయగానే సరిపోదు. వాటికి మద్దతుగా గణనీయమైన కేటాయింపులు కూడా జరపాలి. అయితే బడ్జెట్‌లో అలా జరగలేదు. 2023-24తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలు, విద్య, గ్రామీణాభివృద్ధి, పట్టణ అభివృద్ధి రంగాలకు ఖర్చు తగ్గింది. 2023-24లో కూడా ఇదే జరిగింది. రాబోయే సంవత్సరంలో ఈ ధోరణి పునరావృతం కాబోదన్న గ్యారంటీ ఏమీ లేదు. గత బడ్జెట్లను ఎవరు గుర్తుంచుకుంటారు కనుక?

కేటాయింపులు ఘనం...వ్యయం స్వల్పం

సాధారణంగా బడ్జెట్లలో భారీ పథకాల ప్రకటనలు ఉంటాయి. కానీ వాటి లక్ష్యాలు చాలా వరకూ నెరవేరవు. ఉదాహరణకు పీఎం ఆవాస్ యోజన-అర్బన్‌ను తీసుకోండి. 2023-24లో రూ.21,684 కోట్లు ఖర్చు చేశారు. తదుపరి సంవత్సరం 2024-25లో 39 శాతం అదనంగా అంటే రూ.30,171 కోట్లు కేటాయించారు. చూడడానికి ఇది బాగానే కన్పించింది. కానీ ఖర్చు చేసింది మాత్రం రూ.13,670 కోట్లు మాత్రమే. ఇప్పుడు బడ్జెట్‌లో రూ.19,794 కోట్లు కేటాయించారు. అంటే 2023-24లో ఖర్చు చేసిన దాని కంటే తక్కువే. స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్‌దీ ఇదే కథ. జల్ జీవన్ మిషన్ అయితే ఘోరంగా విఫలమైంది. దేశంలో తాగునీటి సమస్య పరిష్కారం అయిందా అంటే లేదు. 2023-24లో రూ.69,992 కోట్లు ఖర్చు చేశారు. గత సంవత్సరం రూ.70,163 కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు చేసింది మాత్రం రూ.22,694 కోట్లే (కేటాయింపులో 32 శాతం). ఈ బడ్జెట్‌లో రూ.67,000 కోట్లు కేటాయించారు. ఇది రెండు సంవత్సరాల క్రితం చేసిన ఖర్చుకు సమానం. సమస్య అధికంగా ఉన్న చోట కేటాయింపులు స్వల్పంగా ఉన్నాయని దీనిని బట్టి అర్థమవుతోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెంచలేదు. కోవిడ్ తర్వాత గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ పథకానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ పని జరగలేదు.

'ఉపాధి' రంగాలకు కోతలు

విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉపాధి హామీ...ఇలా ఉపాధి కల్పనకు అవకాశం ఉన్న అన్ని పథకాలకూ బడ్జెట్‌లో కోతలు పెట్టారు. ఆర్థిక మంత్రి కేవలం సరఫరాలకు సంబంధించిన విధానాలనే అనుసరిస్తున్నారు. సంపన్నులు, కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తున్నారు. మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి మాత్రమే ఆదాయపన్ను రాయితీలు కల్పించారు తప్పించి వారిపై ప్రేమ ఉండి కాదు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే పన్ను మినహాయింపులు మూడు కోట్ల కంటే ఎక్కువ మందికి లబ్ది కలిగించవు. ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే రాబడిలో లక్ష కోట్లు కోల్పోతామని ఆర్థిక మంత్రి చెప్పుకొచ్చారు. అయితే అది అంతిమంగా సంఘటిత రంగానికి లబ్ది చేకూరుస్తుంది.

'ఉపాధికి' పెరగని బడ్జెట్



న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ.1,87,754 కోట్లు కేటాయించారు. సవరించిన అంచనాల (రూ.1,73,912 కోట్లు) కంటే ఇది కొంచెం అధికం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రయత్నాలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం... బడ్జెట్‌లో మాత్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.86,000 కోట్లు కేటాయించారు. 2025-26 బడ్జెట్‌లో కూడా కేటాయింపులు అంతే ఉన్నాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలుకు ఇప్పటి వరకూ రూ.88,798 కోట్లు ఖర్చయ్యాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనుల కోసం డిమాండ్ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో పథకానికి నిధులు పెంచకపోవడం కార్మికులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. '2023-24 ఆర్థిక సంవత్సరం మధ్యలో సవరణలేవీ చేయలేదు. కాబట్టి పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసమే చాలా వరకూ ఖర్చవుతుంది. కొత్త పనులు, వేతనాల చెల్లింపునకు నిధుల లభ్యత పరిమితంగానే ఉంటుంది. ఈ పరిణామం కార్మికులపై ప్రభావం చూపుతుంది' అని సామాజిక కార్యకర్త, లిబ్‌టెక్ ఇండియా సంస్థ సీనియర్ పరిశోధకుడు చక్రధర్ బుద్గా తెలిపారు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్‌కు బడ్జెట్‌లో రూ.19,005 కోట్లు కేటాయించారు. 2024-25లో సవరించిన బడ్జెట్ రూ.15,047 కోట్లతో పోలిస్తే ఇది కొంత అధికంగానే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలిస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం కీలక పథకాలకు అరకొర కేటాయింపులతో ఆ లక్ష్యాన్ని ఏ విధంగా సాధించగలదని పలువురు ప్రశ్నించారు.

మోసపూరిత ప్రకటన

అంగన్‌వాడీల సమాఖ్య మండిపాటు



న్యూఢిల్లీ : పోషణ్ 2.0 పథకానికి నిధుల కేటాయింపును పెంచుతున్నామంటూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రకటన మోసపూరితమని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అఖిల భారత సమాఖ్య (ఏఐఎఫ్‌ఏడబ్ల్యూహెచ్) మండిపడింది. '2023-24లో సాక్షం అంగన్‌వాడీ-పోషణ్ 2.0 పథకానికి రూ.21,809.64 కోట్లు ఖర్చు చేశారు. 2025-26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.రూ.21.960 కోట్లు కేటాయించారు. అంటే కేవలం రూ.150.36 కోట్ల పెరుగుదల మాత్రమే కన్పిస్తోంది. గత సంవత్సరపు బడ్జెట్ అంచనా రూ.21,200 కోట్లు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాస్తవానికి పథకానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి' అని సమాఖ్య ఒక ప్రకటనలో విమర్శించింది. లక్షలాది అంగన్‌వాడీ మహిళా వర్కర్లు, హెల్పర్ల గౌరవ వేతనాన్ని కూడా బడ్జెట్‌లో పెంచలేదని ఆ ప్రకటనలో సమాఖ్య అసంతృప్తి వ్యక్తం చేసింది. సామాజిక భద్రతా ప్రయోజనాలు కూడా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ఖర్చు నిబంధనలను 2017లో సవరించారు. దీనిని వాస్తవ పెరుగుదలగా లెక్కించినప్పటికీ పది కోట్ల మంది లబ్దిదారులకు బడ్జెట్‌లో పెంచిన పోషకాహార ఖర్చు ఒక్కో చిన్నారికి ఐదు పైసలు మాత్రమే. అది కూడా ఏడు సంవత్సరాల తర్వాత' అని ఎద్దేవా చేసింది. కార్మిక వ్యతిరేక బడ్జెట్‌పై సీఐటీయూ చేపట్టే నిరసనలో తామూ భాగస్వాములం అవుతామని ఏఐఎఫ్‌ఏడబ్ల్యూహెచ్ ఆ ప్రకటనలో తెలిపింది.

విశాఖ స్టీల్‌ను కేంద్రమే నడపాలి



(మొదటిపేజీ తరువాయి)

బలపరిచారు. దీన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రయివేటీకరణలో భాగంగానే విశాఖ స్టీలులో నూరు శాతం వాటాలు అమ్మాలని 2021 జనవరిలో కేంద్ర కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లతో కుమ్మక్కై కారు చౌకగా ఈ ప్లాంట్‌ను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని, ఇటువంటి ప్రయత్నాలు విరమించుకుని కేంద్రమే నిర్వహించాలని డిమాండ్ చేసింది. సాలీనా 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో దేశంలోనే నాణ్యమైన స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీల్‌ను అభివృద్ధి చేయాల్సిందిపోయి అమ్మాలని చూడడం సరికాదని పేర్కొంది. విశాఖ స్టీల్‌ను ప్రయివేటుపరం కాకుండా ఆపుతామని టీడీపీ, జనసేన పార్టీలు వాగ్దానం చేశాయని, ఎన్నికల్లో భారీ మెజార్టీతో నెగ్గిన తర్వాత సీఎం చంద్రబాబునాయుడు ఇంకా పుట్టని ఆర్సెల్లార్ మిట్టల్ స్టీలుకు సొంత గనులు కేటాయించాలని ప్రధానిని కోరారేగానీ, విశాఖ స్టీలుకు గనులు కోరకపోవడం దుర్మార్గమని తెలిపారు. జనవరి 8న విశాఖ వచ్చిన మోడీ... స్టీల్ ప్లాంటుపై మాట్లాడలేదని, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర అర్థమవుతోందని వివరించారు. యాజమాన్యం కార్మికులకు, అధికారులకు వీఆర్ఎస్ ప్రకటించిందని, నాలుగు వేల మంది కార్మికులను తొలగించేందుకు సన్నద్ధమైందని తీర్మానంలో పేర్కొన్నారు. ముడి ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ గంగవరం పోర్టు నుండి విశాఖ స్టీల్‌కు రాకుండా అదానీ పోర్టు యాజమాన్యం అనేకసార్లు అడ్డుపడుతూనే ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చినా కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయకపోవడాన్ని మహాసభ తీవ్రంగా ఖండించింది.

సెయిల్ ఆధ్వర్యంలో కడప స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 షెడ్యూలు 13లో కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నేటికీ శిలాఫలకాలకే పరిమితమైందని మహాసభ పేర్కొంది. కడప స్టీలు ఫ్యాక్టరీ నిర్మించాలని మరొక తీర్మానాన్ని ఆమోదించింది. రాయలసీమ డిక్లరేషన్ పేరిట బీజేపీ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కర్నూలులో ప్రకటించిందని గుర్తు చేసింది. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎట్టిమట్టిచంతల వద్ద, అనంతరం చంద్రబాబునాయుడు కంబాలదిన్నె వద్ద శంకుస్థాపనలు చేశారని పేర్కొంది. మూడోసారి జగన్ ముచ్చటగా కన్నెతీర్థం వద్ద శంకుస్థాపన చేశారని వివరించింది. సెయిల్ చైర్మెన్ తొలుత కడప ఫీజుబిలిటీ అని నివేదిక ఇచ్చారని, బీజేపీ ఒత్తిడితో మరలా నాన్ ఫీజుబిలిటీ అని రిపోర్టు ఇచ్చారని పేర్కొంది. కడప ఉక్కు ఫీజుబిలిటీపై జాయింట్ పార్లమెంటరీ పబ్లిక్ హియరింగ్ పెట్టాలని తీర్మానంలో తెలిపింది. ఫ్యాక్టరీకి కావాల్సిన ఇనుప ఖనిజం కడప, అన్నమయ్య, అనంతపురం, బళ్లారి జిల్లాల్లోనే ఉందని తీర్మానం తెలిపింది. వెంటనే కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని కోరింది.

కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి

రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) మహాసభ డిమాండ్ చేసింది. కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఆర్‌వి.నరసింహారావు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ప్రసాద్ బలపరిచారు. రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికులు పరిశ్రమలు, మిల్లులు, షాపులు, రవాణా, హాస్పిటల్స్, విద్యా సంస్థలు తదితర షెడ్యూలు ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. వేతన సవరణ బోర్డును వేసి మూడు దఫాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను పరిగణనలోకి తీసుకుని వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది.

అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు, ఉపాధి హామీ, సమగ్ర శిక్ష, కస్తూరిబా, వెల్ఫేర్, నేషనల్ హెల్త్ మిషన్, 108, 104 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఆయుష్, ఎన్‌టిఆర్ వైద్యసేవ, అర్బన్ హెల్త్ పథకాల్లో లక్షలాది మంది పనిచేస్తున్నారు. అన్ని క్యాడర్ల స్కీమ్ వర్కర్లను ప్రభుత్వోద్యోగులకు గుర్తించాలని, స్కీమ్ వర్కర్లకు డీఏ సౌకర్యం కల్పించాలని మహాసభ ఆ తీర్మానంలో కోరింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వేర్వేరు రంగాల్లో 50 వేలమంది పనిచేస్తున్నారు. వీరందరినీ పర్మినెంట్ చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. 12వ పే రివిజన్ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగ సంఘాలు కోరుతున్న విధంగా 30 శాతం మధ్యంతర భృతి కల్పించాలని, హమాలీ, ఆటో, లారీ కార్మికులకు సంక్షేమ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని కోరింది. భవన నిర్మాణ బోర్డులో నిలుపుదల చేసిన పథకాలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరింది.

సమగ్ర భూ పంపిణీ ద్వారానే పేదరిక నిర్మూలన

భూసంస్కరణలు అమలు జరిగి పేదల చేతికి భూమి వచ్చి నీటి సౌకర్యం లభించిన చోట పేదరిక నిర్మూలన జరిగిందని, ఆ విధంగా సమగ్ర భూ పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) మహాసభ తీర్మానించింది. ఈ తీర్మానాన్ని దడాల సుబ్బారావు ప్రవేశపెట్టగా అన్వేష్ బలపరిచారు. మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దున్నేవాడికే భూమి కావాలని వెట్టిచాకిరీ, కులమతాలు లేని సమాజం కావాలని, ఎర్రజెండా నాయకత్వంలో వీర తెలంగాణ విప్లవ సాయుధ పోరాటం ద్వారా నాలుగు వేల మంది ప్రాణాలు అర్పించి మూడు వేల గ్రామాల్లో పది లక్షల ఎకరాలు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది.

రాష్ట్రంలో లక్షలాది ఎకరాల బంజరు, మిగులు భూములు పేదలకు పంచామని చెబుతున్న భూముల్లో 15 లక్షల ఎకరాలు తిరిగి భూస్వాములు, పలుకుబడి కలిగినవారు అక్రమంగా, దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని మహాసభ పేర్కొంది. పోరాడిన వారిపై అధికార పార్టీలు నిర్బంధం ప్రయోగించి 1200 మందిపై కేసులు బనాయించారని, 120 మందిని జైలుకు పంపించారని తెలిపింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు కమిషన్ రాష్ట్రంలో భూమిలేని పేదలకు కనీసం ఎకరం చొప్పున పంచడానికి భూమి ఉందని చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. 2007లో జరిగిన భూ పోరాటం సందర్భంగా ముదిగొండ పోలీసు కాల్పుల్లో ప్రభుత్వం ఏడుగురిని పొట్టన బెట్టుకుంది. ఆ పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి కొంతమందికైనా భూములు పంచింది. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ చేయకపోగా, భూ చట్టాలన్నిటినీ నీరుగార్చి పేదల భూములను పెద్దలకు కట్టబెడుతున్నారని ఈ తీర్మానం తెలిపింది. మరోవైపు కార్పొరేట్ కంపెనీలు పరిశ్రమలు పెట్టకుండానే తీసుకున్న భూములను తాకట్టుపెట్టి రుణాలు తీసుకుని ఎగ్గొట్టి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని తీర్మానం వివరించింది. పోరాడితేనే భూమి దక్కుతుందని, పేదలను చైతన్యపరిచి భూమి కోసం పోరాడడానికి ప్రజలను సన్నద్ధం చేయాలని సీపీఐ(ఎం) మహాసభ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను అమలు చేసి భూమిలేని ప్రతి కుటుంబానికీ రెండు ఎకరాల భూమి, గ్రామాల్లో ఐదు, పట్టణాల్లో మూడు సెంట్ల నివాస స్థలం పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని తీర్మానించిది.

దళిత వివక్ష రూపుమాపేందుకు చర్యలు

దళితులపై దాడులు అరికట్టాలని, వివక్ష రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఆంద్ర మాల్యాద్రి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా లింగన్న బలపరిచారు. దళితులపై కొనసాగుతున్న అమానుష దాడులు, హత్యలను నివారించాలని, దుర్మార్గాలకు పాల్పడుతున్న కుల దురహంకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 41 ఎపిఆర్‌ఆర్‌పి కింద బెయిల్ ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులు, రాజ్యాంగం కల్పించిన హక్కులను పటిష్టంగా అమలు చేయాలని, సామాజిక న్యాయాన్ని కాపాడాలని ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.

స్థానిక సంస్థలకు అధికారాలు

స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇవ్వాలని మహాసభ మరో తీర్మానాన్ని ఆమోదించింది. దీనిని బి.గంగారావు ప్రవేశపెట్టగా జడ్‌పిటిసి సభ్యులు గంగరాజు బలపరిచారు. స్థానిక సంస్థల్లో ఉన్న కొద్దిపాటి వనరులను, అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని విమర్శించింది. బలవంతంగా ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలను రుద్దుతూ అమలు చేస్తూ, స్థానిక సంస్థలను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. వాటికి నిధులు ఇవ్వడంతోపాటు అధికారాలు కూడా ఇవ్వాలని మహాసభ కోరింది.

పట్టణాల్లో పన్ను పెంపు ఆపాలి

కేంద్ర ఆర్థిక సంఘం నిధులన్నీ ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు ముడిపెట్టి పన్నులు పెంచుతున్నారని, ఈ నిర్ణయాన్ని ఆపాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రయివేటీకరణ విడనాడాలని మరొక తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీన్ని డి.కాశీనాథ్ ప్రవేశపెట్టగా టి.రాముడు బలపరిచారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత కేంద్ర బీజేపీ పట్టణ సంస్కరణల అమలుకు రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం సిద్ధపడడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. పీపీపీ పేరుతో స్థానిక సంస్థల ఆస్తులను బడా సంస్థలకు ధారాదత్తం చేస్తోందని, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ తదితర అంతర్జాతీయ సంస్థల నుండి అప్పులు తీసుకోవాలని కేంద్రం ఒత్తిడి తెస్తోంది. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం మోడీకి లొంగిపోయి ప్రమాదకర విధానాలను అమలు చేసింది. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పన్నును రద్దు చేయకపోగా, అమృత్ పథకం సంస్కరణలు ద్వారా నీటి కుళాయిలకు మీటర్లు, నీటి చార్జీలు, భూగర్భ డ్రయినేజీ చార్జీల పెంపునకు ప్రయత్నిస్తోందని, నీటి పంపిణీ వ్యవస్థను ప్రయివేటుపరం చేసేందుకు పూనుకుంటోందని తీర్మానం పేర్కొంది. పన్ను భారాలు, యూజర్ చార్జీల విధింపు, మౌలిక సదుపాయాలు, పౌరసేవల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించాలని ఆ తీర్మానం విజ్ఞప్తి చేసింది.

ఏం చేద్దాం?

(మొదటిపేజీ తరువాయి)

మంత్రివర్గం తీవ్రంగా ఆక్షేపిస్తున్నది. ఈ దశలో రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపై ఆ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి ఎఫ్ఆర్‌బీఎమ్ పరిమితి నిర్ధారణ, వెసులుబాటు కోసం కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో విధిస్తున్న షరతులపై ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టారు. వాటి అమలు సాధ్యాసాధ్యాలు, ప్రజాస్పందనను అంచనా వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలుపైనే ఎక్కువ ఆశలు పెట్టుకున్నట్టు తెలుస్తుంది. ఈ పాలసీ మాత్రమే కేంద్రం షరతులకు లోబడి ఉన్నందున, నిధులు అధికమొత్తంలోనే వస్తాయని భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి స్కీం ద్వారా గృహిణుల ఖాతాల్లో నెలకు రూ.2,500 నగదు జమ, కౌలురైతులకు సంవత్సరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు వంటి హామీలు అమలు చేయాల్సి ఉంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే ఆదాయం కూడా ఈ ఏడాది తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్లపై ఆ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రం పట్ల కేంద్రం తీరు స్పష్టమైపోవడంతో, తమ ఆదాయాన్ని తామే సృష్టించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. దీనికోసం అన్ని శాఖల్లో ప్రజలపై ఆర్థికభారాలు పడకుండా, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను అన్వేషించాలని శనివారం జరిగిన మంత్రుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని సమాచారం. ఈ నెలలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నాటికి శాఖల వారీగా సవరించిన అంచనాలను ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అందచేయాలని సూచించారు. అదే సమయంలో బ్యూరోక్రాట్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. కేంద్రం వైఖరిని కచ్చితంగా ప్రజల్లో చర్చకు పెట్టాలని సీఎం భావిస్తున్నారు. బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులు ఉండికూడా రాష్ట్రానికి ఏం సాధించలేకపోయారనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేయాలని పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌కు దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. దానిలో భాగంగానే ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించింది. దీన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి, బీజేపీ పక్షపాత ధోరణి, ఆపార్టీ మతోన్మాద ప్రమాదాన్ని అర్థమయ్యేలా చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.



దుఃఖ సాగరం!

ప్రేమసాగరాల్లో ఓలలాడే ప్రేమికుల్ని చూస్తే
నాలో విస్మయం విరబూస్తోంది.
నే పూలడిగితే ముళ్ళదండని మెడకి తొడిగారు.

ఆనందపు అంచులకై చూపుల్ని ఎగదోసినప్పుడు,
నాకు దుఃఖపు దుమ్మురేణువులు దర్శనమిచ్చాయి.
నే వలపుగీతికలకై కాంక్షించినప్పుడు,

చల్లని నిట్టూర్పుల్లో ముక్కు చీదపట్టాను.
చుట్టూరా మనసులు నా గుండె గులాబీలని
దిగులు దివిటీలో తుంచాయి.

ఏ తోడూ లేకుండా పోయిందిప్పుడు.
ఓ క్షణం నిట్టూర్చి, తీవ్ర వేదనల్లోంచి విడివడ్డాను.
అయినా, పిచ్చోళ్ళ చెయ్యట్టుకునే
సమయం ఎవరికీ ఉండదు.
నా నీడని నేనే తరచూ అపరిచితంగా పరికిస్తాను.

మీరు దీన్నే జీవితమంటే నేనిలానే జీవిస్తాను.

ఒక్క మాటైనా మారు పలకకా,
నా కన్నీళ్ళనే తాగుతాను.
దుఃఖసంద్రాల్లో ఈదుతున్న నాకు,
పిల్లకాలువంటి ఈ దుఃఖానికే భయమేస్తుందా?

(మూలం : ప్యాసా (1957) చిత్రం నుండి సాహిర్ లుధియాన్వి అందించిన సాహిత్యం)

అనువాదం : **బాలాజీ పోతుల,**
8179283830

రాలిపోయే శిథిలానివే

లెక్కించలేనంత వేదనల
కుంపటి సెగలకు
ఎన్నెన్నో ఉద్వేగ
ఉప్పెనలై ఉప్పొంగేనో
ఎన్నెన్నో అశ్రు ధారలు.
పుడమి ఎదలో ఇంకిపోయనో

ఎన్నెన్నో శ్రమ వేదనలు
కాలగర్భంలో కలిసిపోయెను
కాల పరీక్షలో ఎదుర్కొన్న
మానసిక యుద్ధాలు ఎన్నో
ఒకడివై వచ్చి బంధాల
అనుబంధాల దారులను
కలుపుకుంటివో

పాయలు పాయలుగా
యెడబాసిన అనుబంధాలను
నెన్నింటినీ కలిపినావో
పురిటిగడ్డను వదిలి
జీవన సమరంలో
లెక్కించలేనన్ని
అడుగులేసితివో

గర్భగుడిని చీల్చుకుని
అనంతమైన విశ్వాన్ని
చూసుటకై కను తెరిచితివి
అజ్ఞానము చేత
విజ్ఞానము పొందక
మూర్ఖత్వముతో
చెవిన మాటలాల కించక
పెడదారులెన్ని పట్టినావో

విశ్వములో ధనికునుగా
రాజ్యమేలాలని
సర్వ జీవుల కాధారమైన
ప్రకృతిని చరబట్టి
అకాల వైపరీత్యాలకు కారకుడవై
విధ్వంసాలకు మూలమైనావో

అత్యాశ మకుటములు
ధరించుటకు గాను
ఎందరి శ్రమఫలాలను
దోచుకున్నావో

అహం నింపుకుని
అధికార దాహం
తీర్చుకొనుటకై
ఎందరెందరినో హింసించి
స్మశానానికి కడతేర్చినావో
ఎందరెందరో కష్టఫలాలను
అక్రమ సంపదకై
ఆరాటపడినావో

ప్రజాస్వామ్యంలో
రాచరికం బుద్ధిచే
అరాచకము ఏలుబడిలో
ధిక్కారపు ఖంటతములను
పెత్తన దురహంకారంచే
నులిపినావో

కామ క్రోధ మద మాత్సర్యముచే
కోరికల పుట్టను పెంచుకుని
పచ్చని భూ గ్రహంపై
చిచ్చుపెట్టి
చిరంజీవుడవనుకుంటివో

కోటాను కోట్ల చరిత్రను
తోడుకున్న ఒకప్పటి మంచిపనులే
నేటి సమాజానికి
మార్గ దిక్సూచిలని మరువకు

అస్తికలు, ఆస్తులు
భూమి సొంతమేనని గ్రహించు
బతకడం అంటే ఊపిరి పోయేదాక
పోషణ చేయడమే
మరో ఊపిరికి
మార్గదర్శకుడవ్వడమే

అనంత విశ్వంలో
ఎవరికి వారు మహా అనుకున్న
నీవొక లయవే
ఆనవాళ్లు లేని ధూళికణానివే
నేడు మెరుపు తారవైన

- యరకల యాదయ్య,
9866468979.


నదుల్లోకి కొత్త నీరు వచ్చి పాత నీరు పోయినట్లుగానే, కవిత్వంలో కొత్త కలాలు తమ గళాలెత్తి నినదించాయి. కవిత్వమై మనోమైదానాలపై ప్రవహించాయి. కొత్త వస్తువులను నిర్దేశించాయి. కొత్త భావాలను వాగ్దానం చేశాయి. మూస ఆలోచనల నుండి మూగ సైగల నుండి సరికొత్త భాషకు అంకురార్పణ చేశాయి. ఇదీ కవిత్వమేనా? అని సనాతన ఛాందసులు వెక్కిరించినా 'ఇదే కవిత్వమంటూ' డప్పుకొట్టి దండోరా వేశాయి. నిర్భీతి, నిజాయితీ ఎజెండాగా నిప్పులాంటి నిజాలను ఎలుగెత్తి చాటాయి. తరతరాల కైఫీయతుల నుండి, దస్తావేజుల నుండి, దోపిడీ నుండి సామాజిక సత్యాలను వెలికితీసి కవిత్వానికి దిశా నిర్దేశం చేశాయి. ఈ విధమైన ఎరుకతో వర్తమాన తెలుగు కవిత్వంలో వివిధ సామాజిక సమస్యలపై, సంఘటనలపై కలం కదిలించిన కవి డాక్టర్ కోయి కోటేశ్వరరావు.

అక్షర భాస్వరం కోయి కోటేశ్వరరావు 'నాగస్వరం'

చారిత్రాత్మకమైన సంకలనం 'కావడి కుండలు' వంటి అనేక పుస్తకాలకు సంపాదకత్వం వహించాడు. తెలుగు ఆచార్యుడై తరగతి గదిలో చైతన్యం రగిలించాడు. నడిచిన దారి కంటే నడవ వలసిన మార్గాన్ని నిర్దేశించాడు. అలుపెరుగని ఈ ప్రయాణంలో తననుతాను కవిగా ఆవిష్కరించు కున్నాడు. సామాజిక అసమానతలపై జాషువాలా ధిక్కార స్వరాన్ని వినిపించాడు. వస్తువైవిధ్యంతో మెరిసే బహుళ కవితల సమాహారం కోయి 'నాగస్వరం'.

ఈ నాగస్వరంతో కులం మత్తుతో హాలాహలం చిమ్మే విషనాగుల ఆట కట్టించవచ్చు. వాటి కోరలు పీకి నేర్పుగా బుట్టలో పెట్టనూవచ్చు. మన కోయి పలికించే నాగస్వరం అతడి అనుభవాల అంతరంగ స్వరం. కణకణ మండే భావాలను కాంతివంతం చేసే అక్షర భాస్వరం. ప్రాణాధికంగా ప్రేమించే కవిత్వ ప్రాణ వాయువుతో సమకాలీన సాహిత్యాన్ని కాంతివంతం చేసిన సుస్వరం ఈ 'నాగస్వరం'. చాలా వరకు వచన కవిత్వంలో కవిత్వం కనుమరుగై, వచనం రాజ్య మేలుతున్న తరుణంలో కోయి వంటి కవులు కవిత్వానికి సరికొత్త రంగు, రుచిని తీసుకు వచ్చారు. దళితోద్యమం వాహికగా సాగిన వీరి కవిత్వం పాయలు పాయలుగా చీలి, నదికి కొత్త నడక నేర్పింది. సరికొత్త గమనాన్ని, గమ్యాన్ని నిర్దేశించింది. **'వేదంలో ఏముందో తెలియదు గాని/ మా అయ్య స్వేదంలోనే సృష్టి జీవం వుంది/ రాతిని నాతిగా మార్చిన రామ పాదం కంటే/మట్టిని పరమాన్నంగా మార్చిన మా అయ్య పాదమే నాకు ఆరాధ్యం'** పాఠకులు రసస్ఫూర్తితో తలలూపే కవిత్వ పాదాలివి. అంతేకాదు అతడి గుండె నాదాలు కూడ. చాలామంది సీనియర్ కవుల్లో సైతం కన్పించని వస్తు నిర్మాణ దక్షత, కవితా శిల్ప నైపుణ్యం ఇతడిలో కనిపిస్తుంది. అందుకు వారి పద్యాత్మకమైన భాష, వచనాత్మకమైన కవిత్వంలో ఒదిగి రసాత్మకంగా మారింది. **"కల్లానికి ఆకలికి నడుమ ముసురుకున్న పెనుచీకటిలో/ ఆసామి భూస్వామి అవతారం ఎత్తితే/ మా అయ్య పొలంలోని ఎరువు గుట్టలా కరిగిపోయాడు"** ఈ వాక్యాలు చదివి మనమూ నిలువునా కరిగిపోతాం. పౌరాణిక ప్రతీకలను నిర్దేశిత భావానికి అనుగుణంగా మార్చుకోవడంలో ఈనాటి కవులు ఎంతో నేర్పును ప్రదర్శిస్తున్నారు. **"బలి చక్రవర్తినేరాన్ని గురించి కాదు/ వామనుడు చేసిన సవాలక్ష ఘోరాల్ని గురించి/ నిర్భయంగా పంచాయితీ పెట్టాలి"** అంటాడు కవి. ఇక్కడ కవి చిత్రించింది ఆధునిక వామనుడి ఆధిపత్య వాదాన్ని. ఇవాళ మనిషి ఆకాశ మంత ఎదిగిన వామనుడే కావచ్చు. కానీ దోపిడీతో దుర్మార్గంతో తడిగుడ్డలతో గొంతులుకోసే హింసో న్మాదంతో ప్రపంచాన్ని పాలిస్తున్నాడు. ఈరకమైన ఆధిపత్యాన్ని మట్టు పెట్టాలని కవి ప్రబోధం.


కవిత్వం ఎత్తుగడ, నిర్వహణ, ముగింపులో కోటేశ్వరరావు వినూత్న శైలికి శ్రీకారం చుట్టాడు. కవిత తొలిపాదంతోనే ఉత్కంఠ కల్గించే మంచి ఎత్తుగడతో ఉంటుంది, 'పత్తి పూవు' శీర్షికన అమ్మను గురించి రాసిన కవితలో **"ఊరందరికీ మా అయ్య బానిసైతే/ పాపం మా అమ్మ మా అయ్యక్కూడ బానిస"** అంటాడు. ఒకానొక కులదురహంకారం అయ్యను బానిసను చేస్తే, అది మరో రూపంలో అమ్మను కూడా బానిసగా మార్చింది. కవి ఇక్కడ కుల ప్రస్తావన తేలేదు. బానిస అనే చిన్న మాట ద్వారా నాటి సామాజిక దృశ్యాన్ని కండ్ల ముందు ఆవిష్కరించాడు. కవితలోని భావారోహణ, పద చిత్రణ, వస్తుదృశ్యీకరణ పాఠకుణ్ణి వేలు పట్టి నడిపించుకు పోతాయి. ఉత్తమ కవిత లక్షణం ఇదే. **'ఆడతనం అంటరానితనం నడుమ అమ్మ రోకలి బండ కింద చితికిన దోస బద్దలా రోదిస్తుంది'** అంటాడు. రోకలిబండ, దోసబద్ద పట్టణ కవులకు తెలియవు. పేదరికం విత్తును చీల్చుక వచ్చిన కోటేశ్వరరావుకు తెలుసు. కవిత్వంలో స్థానీయత భావాన్ని, భాషను కాంతి వంతం చేస్తుంది. మహాకవి



సమకాలీన ఉద్యమాలకు, సామాజిక సంఘటనలకు తక్షణం స్పందించిన కవుల్లో 'కోయి' కూడా ఒకరు. ముఖ్యంగా మాదిగ దండోరా, మాల మహానాడు ల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని నిర్మొహమాటంగా నిష్పాక్షికంగా కవిత్వీకరించిన సమతావాది కోటేశ్వరరావు. "మన మధ్య మిగిలింది పంచుకోవాల్సిన వాటాలే గాదు/ ఇద్దరం కలిసి పూడ్చుకోవాల్సిన గాయాల లోయలు కూడా ఉన్నాయి" అంటూనే అంతిమంగా సామాజిక న్యాయంవైపు నిలబడ్డాడు.

జాషువ రచనల్లో రసాత్మకతకు అదే కారణం! పూరి గుడిసె, ముదుక పంచె, గంజిబువ్వ, కుక్కిపడక ఇవన్నీ జాషువా పదాలు. గొడ్డు కారం, కళ్ళాపి, సొంటిముక్క, పున్నీళ్ళు, మాడు చెక్కలు, మసిబొగ్గు, నిప్పుల కుంపటి, వరదగుడి, గొడ్డుచాకిరి, కూటికుండ, వంటి గ్రామీణ పదబంధాలు 'కోయి' కవిత్వాన్ని కాంతివంతం చేశాయి. వస్తుతా దాత్మ్యంతో మనల్ని పలకరిస్తాయి. **"చిరిగి పోయిన అమ్మ రవికను చూసి గుడ్లగూబలన్నీ గుటకలు దిగమింగి నపుడు /ఆకాశాన్ని చించి అమ్మ ఒంటినిండా కప్పాలనిపిస్తుంది"** ఇక్కడ కవి ఊహ భూమ్యాకాశాలను కలుపుతుంది. ఆకాశాన్ని చించి అమ్మ ఒంటినిండా కప్పడం సరికొత్త భావుకత. ఇక్కడ కోయి **"నేలను నింగియున్ తాళములుగ చేసి, వేపున రేగి వాయించి యాడ"** అనే తిక్కన భావుకతకు దగ్గరగా కనిపిస్తాడు.

శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిభా వంతంగా 'కొత్త చెప్పులు' కవితలో కోయి అద్భుతంగా చిత్రించాడు. **"వడ్ల గింజలో ఇంకిపోయిన మా అయ్య ఒంటి సత్తువ/ కూటి కుండలో తుకతుక ఉడక్కపోతే ఊరికి కూడెట్టా దొరికేది?"** అంటాడు. శ్రమ దీపాలైన లోకంలోని అయ్యలందరికీ వర్తించే సజీవ పాదాలివి. సరికొత్త జీవన వేదాలివి. కోయి కవిత్వంలోని సరికొత్త అభివ్యక్తులు ఈతరం కవుల కలాలకు కొత్త ఊహల్ని తొడిగుతాయి. తాపీ పని చేసే తన తమ్ముణ్ణి గురించి చెబుతూ - **"తాపీ పెన్నుతో నగరం ఎదపై/మహా సౌధకావ్యాలను రచించే భవనఋషి మా తమ్ముడు"** అంటాడు. సమకాలీన ఉద్యమాలకు, సామాజిక సంఘటన లకు తక్షణం స్పందించిన కవుల్లో 'కోయి' కూడా ఒకరు. ముఖ్యంగా మాదిగ దండోరా, మాల మహానాడుల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని నిర్మొహ మాటంగా నిష్పాక్షికంగా కవిత్వీకరించిన సమతావాది కోటేశ్వర రావు. **"మన మధ్య మిగిలింది పంచుకోవాల్సిన వాటాలే గాదు/ ఇద్దరం కలిసి పూడ్చుకోవాల్సిన గాయాల లోయలు కూడా ఉన్నాయి"** అంటూనే అంతిమంగా సామాజిక న్యాయం వైపు నిలబడ్డాడు. అలాగే సామాజిక వాస్తవ దృశ్యాల్ని కళ్ళకు కట్టినట్లు చెప్పడం కోయి కలానికీ బాగా తెలుసు. **"శవాల మీద చిల్లరను మూటగట్టు కోవడం సులభం/ మూటగట్టిన శవాల్లోకి నిర్భయంగా తొంగి చూడటమే కష్టం"** అంటాడు మార్చురీ ఉద్యోగి సలీం గురించి రాస్తూ.. కుల దురహంకారపు దాడులకు బలైన నెత్తుటి గొంతులు పెట్టే పొలికేకను కవితాత్మకంగా చెప్పి, ఇకనైనా మనుషులుగా బతకమని నాగస్వరం కవిత్వంలో మనల్ని హెచ్చరిస్తాడు కవి. కోయి మనుషుల్ని ప్రేమిస్తాడు. సమాజాన్ని గౌరవిస్తాడు. ఎదుటి వాళ్ళ కష్టాలతో మమేకమై కన్నీళ్ళు తుడుస్తాడు. కనుకనే కోయి కవితల్లో పొడి మాటలుండవు. గుండెతడి మాటలుంటాయి. **"నా కవిత్వాన్ని మెదడుతో కాదు. ఆర్ధ్ర హృదయంతో పఠించాలం"**టాడు నవయుగకవి చక్రవర్తి జాషువా. కోయి కోటేశ్వరరావు కూడ దళిత కవితా దీపధారులైన జాషువా, భీమన్న, శిఖామణి, మద్దూరి, ఎండ్లూరి, కలేకూరి, పైడి తెరేష్ బాబుల మార్గంలో అక్షరసేద్యం చేస్తూ, దారికిరువైపులా కవిత్వ దీపాలను వెలిగించి కొత్త దారిలో సాగి పొమ్మంటాడు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల్నీ హక్కుల్నీ కంటికి రెప్పలా కాపాడాలని, ఈ కాలానికి అవసరమైన తాత్విక స్ఫూర్తిని కోయి తన కవిత్వం ద్వారా అందిస్తున్నాడు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనల వెలుగుల్లో శక్తివంతమైన కవిత్వాన్ని కోయి నాగస్వరం కవితా సంపుటిలో ఆవిష్కరించాడు. సామాజిక ప్రగతికి అవరోధంగా నిలిచిన కుల, మత, వర్గ సరిహద్దు రేఖల్ని చెరిపేసి, సర్వ మానవ సమతా రాగాన్ని సరికొత్త 'నాగస్వరం'గా కోయి వినిపించాడు. జీవన తాత్వికతను కళా తత్వంతో రంగరించి, వినూత్న వస్తు వైవిధ్యంతో కవిత్వంలో రసాత్మక కళకు నిర్వచనమై నిలిచిన కోయి కోటేశ్వరరావుకు ఆత్మీయ అభినందనలు.



డా. బీరం సుందరరావు
6303443302

అమ్మ లేని ఇల్లు

ఎప్పుడూ ఏదో ఒక చోట
ఒక చప్పుడు
చిన్న కదలిక ఉండేది,
ఇప్పుడు ఎంత వెదికినా
ఖాళీ కనబడుతోంది
కారణం...
అది అమ్మ లేని ఇల్లు!

ఇంట్లో ఒక దీపంలా
ఇంటికి ఒక ప్రాణంలా
ఒకే చోట ఉన్నా
గోడలను దాటుకుని వెలుగునిస్తుంది,
ఒక చిన్న పిలుపుతో
ఇంటి గుండెకు స్పందననిస్తుంది!

మంచాన మూలనపడ్డా
మూలమూలనా తానున్నానని
బతుకు మూలాలను గుర్తుచేస్తుంది,
నీకేం తెలియదు
ఊరుకో అన్నా
మాటలు నేర్పింది
నేనే కదా అని
మౌనంగా ఉండిపోతుంది!

పిల్లలకు ఆటబొమ్మలా
విసుగులేని యంత్రమై నడుస్తుంది,
వాళ్ళ చేష్టలతో
తనను తాను నిలబెట్టుకుంటుంది,
గుండె చెరువైనా
కన్నీటి అలల సవ్వడితో
మనసు తీరాలను తాకుతుంది!

అవసరం తీరాక
మనుషులైనా వస్తువులైపోతారని
తెలిసినా
ప్రతి వస్తువునూ జాగ్రత్త పరుస్తుంది,
తన ప్రాణం వెళ్లిపోతున్నా
తన వాళ్ళ ప్రాణం కోసం
పాకులాడుతుంది!

తన కాలి అడుగులతోనో
తన చేతి గుర్తులతోనో
నిండు కుండలా ఉండే
ఆ ఇల్లు
అమ్మలేని తనంతో నిండిపోయింది!

వెలుగు లేకుంటే
చీకటి కూడా భారంగా ఉంటుంది,
మనుషులు లేకుంటే
కాలం కూడా తనను తాను
లెక్కబెట్టుకుంటుంది,
కన్నీరు కూడా
ఆవిరైపోకుండా గడ్డకట్టుకుపోతుంది!

అమ్మ లేని ఇల్లు
ఊపిరి లేక దిక్కులేనిదయ్యింది,
హృదయాన్ని పారేసుకున్న దేహంలా
నిస్తేజమయ్యింది!

- పుట్టి గిరిధర్
9494962080


అతడి 'అలికిడి' సమాజంతో అల్లుకున్న భావోద్వేగాల సందడి

"కవి ఎప్పుడూ కంటి నిండ తృప్తిగా నిద్రపోడు. ఒకవేళ నిద్రపోతే అది శాశ్వత నిద్రే అవుతది" అని అనిపిస్తది అలికిడి పుస్తకంలోని కవిత్వాన్ని చదువుతున్నప్పుడు. 2024 చివరలో 'అలికిడి' కవితా సంపుటి ద్వారా సాహిత్య ప్రపంచంలో తన తొలి సంతకం చేసి, తనకొక చిరునామాను లిఖించుకున్నడు యువ కవి కార్తీక రాజు.

- గట్టు రాధిక మోహన్, 8790186340

భూమి తన చుట్టు తాను తిరుగుకుంట, సూర్యుని చుట్టు తిరుగుతుంటది కదా! కార్తీక రాజు ఒక భూమి లెక్క మారిపోయిండు. అతని మనసెప్పుడూ భ్రమిస్తూనే ఉంటది. సమాజం చుట్టు తిరుగుతనే ఉంటది. తన చుట్టు జరుగుతున్న సంఘటనలను అనేక పరిశీలనలతో.. అనేక కోణాల నుంచి దర్శించి, 'అలికిడి'గా ఒక మంచి సామాజిక కవిత్వాన్ని మనకు అందించిండు.

ఈ యువ కవి తను రాసింది కవిత్వమో, కాదో అంటడు. కవిత్వానికి రసాయన సమీకరణం లాగనో, గణిత సూత్రం లాగనో ఏదైనా ప్రత్యేక నిర్వచనముంటుందా? అని ప్రశ్నించుకున్నప్పుడు మరెన్నో ప్రశ్నలు పుడుతుంటయి. అంతకుమించి సమాధానాలు కూడా ఎదురు పడుతుంటయి. కవిత్వం రాయడంలో ఒక్కో కవికి ఒక్కో తీరు ఉంటది. ఏ తీరున రాసినా, అది ప్రజలు చదవగలిగే తీరులో ఉంటే సరిపోతది. కార్తీక రాజుది అటువంటి కవిత్వమే అని చెప్పగలను. సామాజిక కవిత్వం అనేది సమాజాన్ని చదివించేదిగా ఉన్నప్పుడే కవి సఫలమైనట్టని నా అభిప్రాయం. కార్తీక రాజు కవిత్వం సమాజాన్ని చదివించేదిగానూ ఉంది. **"కవి అనేవాడు నిరంతర అభ్యాసిగా ఉన్నప్పుడే సమాజానికి కావల్సిన అసలైన కవిత్వాన్ని రాయగల్గుతాడు"** అనే మాటలు కార్తీక రాజుకు కూడ వర్తిస్తాయని చెప్పొచ్చు.



ఇక అలికిడి సంపుటిని తెరిచి చూస్తే... ఇందులో ఉన్న మొత్తం 63 కవితలూ 2015 నుండి 2020 మధ్య రాసినవే. అంటే అలికిడి ఒక పంచవర్ష కాలం పాటు కార్తీక రాజు మనసు చూపెట్టిన ఆరాటం, ఆందోళన, ఆవేశం అని చెప్పవచ్చు. ఒక్కో కవిత ఒక్కో వస్తువును గట్టిగ పట్టుకొని కొసమెరుపు లాంటి ముగింపును చూపెడుతుంటది. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, అస్తిత్వమిచ్చిన కులవృత్తి, ఊళ్ళోని వాగు, ప్రకృతి, రైతులు, మహిళలు, వారసత్వ సంపద, మాతృభాష, కరోనా కాలపు గడ్డు పరిస్థితులు... ఇలా ఎన్నో అంశాల మీద రాసిన కవితలున్నాయి. ఈ పుస్తకం విభిన్న అంశాలతో గుచ్చిన ఒక మాలగా కనబడుతుంది.

ఇక కొన్ని కవితల్లోకి తొంగి చూద్దాం. 'నేనేవాదినంటే..' అనే కవితలో **"మానవశ్రేయోవాదిని/ సమాజ హితం కోరుతూ సాగే/ సాహిత్య కళాకారుణ్ణి"** అంటడు. నిజమే కదా! ఒక కవి ఎప్పుడూ ఒక వాదానికే పరిమితమై ఉండకూడదు. కవి సమాజ శ్రేయస్సు కోసం కండ్లు తెరిచి, కలలు కంటూ, తన భావోద్వేగాలను కవిత్వంగా మలిచి, తన గుండెలోని బరువును దించుకొని, అలుకగయ్యేటట్టు జేసుకుంటడు. మరొక కవిత 'ఋతుచక్రం - మానవ జీవితచక్రం'లో మానవుని శైశవ దశ నుంచి వృద్ధాప్య దశ వరకు ఆరు దశలుంటాయని చెప్పి, వాటిని ఆరు ఋతువులతో పోలుస్తూ సంబంధాన్ని సృష్టించడం వినూత్నంగా అనిపిస్తుంది. అలాగే అడుగంటిపోయిన కులవృత్తులను గుర్తు చేసుకుంట దానికి కారణమైన వ్యవస్థను 'చాకిరిబండ' కవితలో హెచ్చరిస్తాడు. అలాగే తను ఒక ఉపాధ్యాయునిగా పనిచేస్తుండటం వల్ల 'వాళ్ళ నడుమ' కవితలో **"నేనంటూ నేనులా బతికేది/ వాళ్ళ నడుమ మాత్రమే అనిపిస్తుంటుంది"** అంటూ విద్యార్థులు తన చుట్టూతా ఎగురుతూ కనబడే రంగురంగుల సీతాకోకచిలుకలని, తాను ఓ తేనె పువ్వునని చెప్పుకుంటడు. చివరలో అన్నీ అర్థం చేసుకునేంత వయసు వాళ్లది కాకపోయినప్పటికీ, వారివి ఇరుకు మనసులు, కరకు గుండెలైతే కాదని చెంపపెట్టులాంటి కొసమెరుపునిచ్చిండు.

'అతీత శక్తి' అనే కవితలో **"కవిత్వమంటే అంతే/ అది కదలికలోంచి పుట్టి/ కదలికను కలిగించే అతీతశక్తి!"** అని పేర్కొంటూనే, 'అంతులేని ఆరాటం' కవితలో **"రాసిన ప్రక్రియ కవిత్వమో, కాదో/ భావం శ్రేయోవాదమైనప్పుడు/ కొంతమంది నోట్లో నుండి/ రాళ్ళు పడ్డా, పూలు పడ్డా/ ఆగిపోకుండా సాగిపోతూనే ఉంటా!"** అని తన కవిత్వం మీద తన అభిప్రాయాన్ని ప్రకటించుకున్నడు. ఎంత పెద్ద కవైనా తను మొదటగా రాసిన కవిత్వం గురించి సాధారణంగా ఇలాగే చెప్పుకుంటారని తెలిసిన విషయమే. కానీ ఆ తర్వాత వచ్చే కవిత్వం ఎంతో పరిణితితో, లోతుగ, మెత్తగ, బొడ్డుమల్లె పువ్వంత అందంగా కనబడుతుంటది. అలికిడిలో కవి తను 2020 చివరి వరకు రాసిన కవిత్వాన్నే ప్రచురించాడు.

సాహిత్య ప్రపంచంలో నేనొక చిన్న అలికిడి చేస్తున్నానంటూనే, సమాజంతో అల్లుకున్న భావోద్వేగాలతో సందడి చేసాడు కార్తీక రాజు. తను భవిష్యత్తులో తన సాహిత్యంతో డైనమైట్ పేలినంతటి శబ్దాన్ని సృష్టించాలని కోరుకుంటూ, అతడికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

సాహితీ వార్తలు

9న మధుశ్రీ కథా గౌరవ సభ
ముగ్గురికి పురస్కారం

మధునాపంతుల వేంకటేశ్వర్లు (మధుశ్రీ) కథా గౌరవ సభ ఫిబ్రవరి 9న ఆదివారం ఉదయం 10:00 గం॥లకు కాకినాడ జిల్లా కాజులూరు మండలంలోని పల్లిపాలెంలోని మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో మధునాపంతుల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కథా రచనలో విశేష కృషి చేసిన ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు (తిరుపతి), ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీ దేవి (విజయవాడ), ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ కాళ్ళకూరి శైలజలకు కథా గౌరవ పురస్కారాలను అందివ్వనున్నారు. మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఫౌండేషన్ కార్యదర్శి ఎం.వి. చలపతి స్వాగతంతో పాటు, పరిచయ కర్తలుగా బీకేఎస్ రాజా (హైదరాబాద్), వసుధారాణి (విజయవాడ), డాక్టరు కె.రామచంద్రారెడ్డి (హైదరాబాద్) వ్యవహరించనున్నారు. వివరాలకు 9704186544 నంబరు నందు సంప్రదించవచ్చు.

ప్రత్యేక సంచికకు కథలు ఆహ్వానం

నవమల్లెతీగ సాహిత్య మాసపత్రిక ఆధ్వర్యంలో త్వరలో కథల ప్రత్యేక సంచికను తీసుకు రానున్నారు. ఇందుకోసం కథలను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి కలిగిన వారు మూడు లేదా నాలుగు పేజీలకు మించకుండా టైప్ చేసి, ఈ నెల 27 లోగా 6-16-4, టి.ఎఫ్-1, శుభశ్రీ టవర్స్, ఉయ్యూరు జమీందారు స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ-520 003 చిరునామాకు లేదా ఈమెయిల్ : malleteega@gmail.com పంపాలి. వివరాలకు 92464 15150 నంబరు నందు సంప్రదించవచ్చు.

6న 'ధరణి' ఆవిష్కరణ

వి. బాలరాజు రచించిన ధరణి రైతుల గోస పుస్తకావిష్కరణ తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న గురువారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ సభాధ్యక్షులుగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ యం.కోదండరాం రానున్నారు. వక్తలుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, మానవహక్కుల వేదిక నాయకులు యస్..జీవన్ కుమార్, రెవెన్యూ శాఖ మాజీ అధ్యక్షులు,పెన్షనర్స్ జేఏసీ చైర్మెన్ కె.లక్ష్మయ్య, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, రిటైర్డు జాయింట్ కలెక్టర్ సురేష్ పొద్దార్‌లు హాజరు కానున్నారు. వివరాలకు 94409 39160 నంబరు నందు సంప్రదించవచ్చు.

నా గల్మల కాలు వెట్టలేదు..

కంటి నిండా నిదురపోదామంటే
కష్టాలన్నీ దోమల్ల కుట్టి నిద్రలేపుతున్నవ్..
ఇక నెత్తికింది దిండేమో నీ కన్నీళ్ళ బరువు
ఇక నేను మోయలేన్నటుంది...
అరికాళ్ళ వణుకేమో నేను లేచి ఒక్క అడుగు కూడా
వేయనని మొండికేస్తుంటే....
ఆ గది గోడలు మాత్రం నన్ను బంధించానని వెకిలి
నవ్వులు నవ్వుతున్నయి..
సందు దొరికిందని "ఓటమి"
నా దుప్పట్లో దూరి నన్ను కౌగిలించుకుంటే...
"గెలుపు" మాత్రం దాని నీడ కూడా
కనిపించనంత దూరంలో ఉంది..
అది ఎవరి ఇంట్లో సేద తీరుతుందో కానీ..
ఒక్క పూట కూడా నా గల్మల కాలువెట్టలేదు..
దానికి లంచం ఇచ్చుకోలేని పేదరాలిని నేను..
మభ్య పెట్టి రమ్మనే అంత మాటకారిని కూడా కాకపోతిని..
తెల్లారితే దుఃఖం నా గది తలుపులు కొట్టి లేపితే..
నా చేతి గాజుల శబ్దం నాకు ధైర్యమిస్తే..
నా ఎంటికల శిక్కుల ముడి విప్పుకున్నట్టు నా కష్టాల
ముళ్లను విప్పుకుంట..
నా తెగువను ఆరు గజాల చీరల కట్టుకుంట..
గెలుపు నా ఇంటికి వచ్చే ఒక చుట్టమనుకొని..
కష్టాల్ని కన్నబిడ్డల్ల చూసుకుంట..
ఎందుకంటే నేను ఆడదాన్ని..
అందులో ఒక అమ్మను కాబట్టి..
మాకు లాలించడమే వచ్చు తప్ప..
ద్వేషించడం రాదే..
వాళ్ళు పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలైన..
మా కాళ్ళ కాడికచ్చిన కష్టాలైన..
కళ్ళకద్దుకుంటం..
కడుపుల పెట్టుకుంటం..

- తుమ్మల కల్పన రెడ్డి, 9640462142

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

కేంద్ర బడ్జెట్‌పై వెల్లువెత్తిన నిరసనలు

కార్పొరేట్లకు ఊడిగం చేసేలా బడ్జెట్

సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసనలు

బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం



నవ తెలంగాణ- విలేకరులు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందంటూ సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆదివారం నిరసనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్.. కార్పొరేట్‌శక్తులకు, సంపన్నులకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగా ఉందని సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులు అన్నారు. పేదలకు, రైతులకు, అసంఘటితరంగ కార్మికులకు, విద్యా, వైద్య రంగాలకు తీవ్రమైన నష్టం జరిగిందని ఆరోపించారు. యదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్షల కోట్ల బడ్జెట్‌లో గ్రామీణ పేదలకు, కార్మికులకు, కర్షకులకు, వ్యవసాయ కూలీలకు, మహిళలకు, వత్తిదారులకు, విద్యకు, వైద్యానికి, సంక్షేమానికి రాయితీలను తగ్గించి బడా కార్పొరేట్లకు రాయితీలను ఇచ్చిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని అన్నారు. అలాగే, స్థానిక ప్రిన్స్ చౌరస్తాలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వలిగొండ, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ మండలకేంద్రాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఆలేరు పట్టణంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో.. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. నిడమనూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. మర్రిగూడలో బడ్జెట్ ప్రతులను కాల్చి నిరసన తెలిపారు. నాంపల్లిలో నాంపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల, ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను ధ్వంసం చేసి నిరసన వ్యక్తం చేశారు.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ బడ్జెట్ అంకెలు పెంచడం తప్ప ఆచరణలో దళితుల అభివృద్ధికి చేసింది శూన్యమేనని చెప్పారు. బడ్జెట్‌లో దళితులకు జరిగిన అన్యాయంపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు. దళితుల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన దళితుల బడ్జెట్‌ను దళితేతరులకు ఖర్చుపెట్టిందన్నారు.

ఈ పదేండ్లలో కేంద్ర ప్రభుత్వం దళితుల కోసం కేటాయించిన బడ్జెట్, ఖర్చు చేసిన నిధులపై ప్రత్యేక శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బడ్జెట్.. కార్పొరేట్లకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రాములు అన్నారు. నాగర్‌కకర్నూల్ జిల్లా అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వ్యకాస ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేశారు.

ఖమ్మంలోని ఎన్ఎస్పీ క్యాంపు సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్ మాట్లాడుతూ.. వివిధ రంగాలకు నిధులు కేటాయించటంలో వైఫల్యం జరిగిందని ఆరోపించారు. బోనకల్, చింతకాని, ఎర్రుపాలెం, కారేపల్లి, ముదిగొండ, కూసుమంచి మండలాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇబ్రహీంపట్నం పట్టణంతోపాటు మండలంలోని దండుమైలారం, పోల్కంపల్లి గ్రామాల్లో బడ్జెట్ పత్రులను దహనం చేశారు. ఆపార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. మొయినాబాద్, గండిపేట, మంచాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలకేంద్రంలో నిరసన తెలిపారు. సంగారెడ్డిలోని న్యూ బస్టాండ్ వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ, వ్యకాస, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హనుమంతరావునగర్ స్థూపం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గార్ల మండలంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు.

ధ్యాన మందిరం అభివృద్ధికి కృషి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నేలకొండపల్లి

ప్రభుత్వం ద్వారా రూ.2.65 కోట్ల నిధులను త్వరలోనే మంజూరు చేయించి ధ్యాన మందిరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్ది ప్రపంచవ్యాప్త పర్యాటకులను ఆకర్షించేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తానని రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో రెండు రోజులుగా జరుగుతున్న భక్త రామదాసు జయంతి ఉత్సవాలకు ఆదివారం మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామదాసు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతేడాది రామదాసు జన్మస్థలం నేలకొండపల్లిలో జయంతి ఉత్సవాలను నిర్వాహకులు అత్యంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భావితరాలు సైతం రామదాసు చరిత్రను కీర్తించేలా ఇక్కడి ధ్యాన మందిరాన్ని అత్యంత గొప్పగా తీర్చిదిద్దేందుకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్త రామదాసు జ్ఞాపికను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బహూకరించారు. అనంతరం వివిధ కళాబృందాలు ఆలపించిన రామదాసు కీర్తనలు, గేయాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మువ్వ విజయ్‌బాబు, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మెన్ శాఖమూరి రమేష్, మాజీ ఎంపీపీ వజ్జా రమ్య, భక్త రామదాసు విద్యుత్ కళా పీఠం చైర్మెన్ సాదు రాధాకృష్ణమూర్తి, నెల్లూరి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభకు రూ.903 కోట్లు

- రాజ్యసభకు రూ.413 కోట్లు
- కేంద్ర బడ్జెట్-2025లో కేటాయింపులు

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో లోక్‌సభకు రూ.903కోట్లు కేటాయించారు. ఇది రాజ్యసభకు కేటాయించిన రూ.413 కోట్లతో పోలిస్తే.. రెండింతల కంటే ఎక్కువ కావటం గమనార్హం. మొత్తం రూ.903 కోట్లలో లోక్‌సభ సెక్రెటేరియట్‌కు రూ.558.81 కోట్లు కేటాయించినట్టు సంబంధిత వర్గాలు ఆదివారం వివరించాయి. వీటిలో సంసద్ టీవీ గ్రాంట్లు కూడా ఉన్నాయని తెలిపాయి. రూ.413 కోట్లు రాజ్యసభకు కేటాయించగా, రూ. 2.52 కోట్లు రాజ్యసభ సెక్రెటేరియట్‌లో చైర్మెన్, డిప్యూటీ చైర్మెన్‌ల జీతాలు, అలవెన్సుల కోసం కేటాయించబడ్డాయి. అలాగే, సెక్రెటేరియట్‌లోని ప్రతిపక్ష నేతల జీతాలు, అలవెన్సుల కోసం ప్రత్యేకంగా రూ.3 కోట్లు అలాట్ చేశారు. రాజ్యసభలోని 245 మంది సభ్యుల కోసం రూ.98.84 కోట్లు కేటాయించారని సదరు వర్గాలు వివరించాయి. "లోక్‌సభ బడ్జెట్‌లో స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల జీతాలు, అలవెన్సుల కోసం రూ.1.56 కోట్లు కేటాయించారు. లోక్‌సభలో సభ్యుల కోసం రూ.338.79 కోట్లు కేటాయించారు. అయితే ప్రతిపక్ష నేత కార్యాలయానికి ప్రత్యేక కేటాయింపులు లేవు" అని స్పష్టం చేశాయి. గత పదేండ్లుగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఎవరూ లేరు. లోక్‌సభలో 543 మంది సభ్యులున్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. వ్యక్తి మృతి

నవతెలంగాణ-జనగామ

ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందిన ఘటన జనగామ జిల్లా కేంద్రంలోని బ్రిడ్జిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా మద్దూరు మండలం దులిమిట్ట రెడ్యానాయక్‌తండాకు చెందిన ఆటో డ్రైవర్ ధరావత్ విజయ్‌కుమార్(36) తన ఆటోలో జనగామకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జనగామ రైల్వే బ్రిడ్జిపై ఆటోను ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు.

ప్రిజం పబ్బు కాల్పుల ఘటనలో పురోగతి

- మోస్ట్ వాంటెడ్ దొంగ ప్రభాకర్‌ను విచారించిన పోలీసులు
- నిందితుడిపై 80 కేసులు
- నిందితుడిని పట్టుకోవడంలో సైబరాబాద్ పోలీసుల కృషి అభినందనీయం : వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ వినీత్



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ప్రిజం పబ్బు కాల్పుల ఘటన కేసులో పోలీసులు నిందితుడు ప్రభాకర్‌ను ఆదివారం విచారించారు. మోస్ట్ వాంటెడ్ నిందితుడిని పట్టుకోవడంలో సైబరాబాద్ పోలీసుల కృషిని మాదాపూర్ డీసీపీ వినీత్ అభినందించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వినీత్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ అలియాస్ బయ్యప్‌రెడ్డి, బిట్టు 2013 నుంచి పలు నేరాల్లో నిందితునిగా ఉన్నాడు. పాలెం పోలీస్ స్టేషన్‌లో ఓ కేసులో సెంట్రల్ జైలుకు వెళ్ళాడు. అక్కడి నుంచి ప్రభాకర్ పారిపోయి ఇప్పటివరకు పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. గతంలో కొంతమంది వ్యక్తులతో కలిసి దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో పోలీసులకు దొరకడంతో ఆ గ్రూప్ నుంచి విడిపోయి ఒంటరిగా దొంగతనం చేయడం నేర్చుకున్నాడు. ప్రధానంగా విద్యాసంస్థలను టార్గెట్ చేసి.. వాటిల్లోకి ఎలా వెళ్ళాలి.. డబ్బులు ఎక్కడ ఉంచుతారు వంటి వాటిపై రెక్కీ నిర్వహించి, అనంతరం దొంగతనానికి పాల్పడేవాడు. జైల్లో ప్రభాకర్‌పై ఒక వ్యక్తి అనేక ఇబ్బందులకు గురి చేయడంతో అతనిపై కక్ష తీర్చుకునేందుకే తుపాకీ కొనుగోలు చేశాడు. ఇటీవల నార్సింగి, మొయినాబాద్ పరిధిలో రెండు దొంగతనాలు చేశాడు. మొయినాబాద్‌లో జరిగిన చోరీలో వేలిముద్రలు పరిశీలించగా.. ప్రభాకర్ వేలిముద్రలతో సరిపోయాయి. దాంతో నిందితుడిపై పోలీసులు నిఘా పెట్టారు. దొంగతనం చేసిన డబ్బుతో పబ్బులకు వెళ్తున్నట్టు గుర్తించారు. ఐటీ కారిడార్‌లోని పబ్‌ల సిబ్బంది, బౌన్సర్లకు నిందితుని ఫొటోలిచ్చి ఆయూకీ తెలిస్తే సమాచారమివ్వాలని సూచించారు.

ఈ క్రమంలో శనివారం రాత్రి 7.10 గంటలకు గచ్చిబౌలిలోని ప్రిజం పబ్‌కు వచ్చాడు. గుర్తించిన బౌన్సర్లు.. 7.30కు తెరుస్తామని అప్పటివరకూ ఎదురుచూడాలని చెప్పారు. మద్యం తాగి ఉన్న నిందితుడు ఫోన్ చార్జర్ అడగ్గా ఇచ్చారు. పక్కకు వెళ్లి చార్జింగ్ పెట్టుకునే సమయంలో బౌన్సర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సైబరాబాద్ పోలీసులు పబ్బుకి చేరుకుని నిందితుడిని పట్టుకునే క్రమంలో పోలీసులపైకి ప్రభాకర్ 2 రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి పాదం నుంచి తూటా దూసుకెళ్లడంతో గాయపడ్డాడు. వెంటనే అప్రమత్తమైన ఇతర పోలీసులు, బౌన్సర్ల సాయంతో నిందితుడు ప్రభాకర్‌ను పట్టుకున్నారు. ఆదివారం అతన్ని పోలీసులు విచారించారు. ఇన్వెస్టిగేషన్ చేస్తున్న సమయంలో నిందితుని ఇంట్లో మరో తుపాకీ దొరికింది. నిందితుడు బత్తుల ప్రభాకర్‌పై వివిధ రాష్ట్రాల్లో 80 కేసుల వరకు నమోదయ్యాయి. సుమారు రూ.2.5 కోట్ల వరకు విలువ నేరాలు చేశాడు. నిందితుని నుంచి 2 తుపాకీలు, 25 రౌండ్స్ బుల్లెట్స్, 451 లైవ్ రౌండ్స్ బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సైబరాబాద్ పోలీసులను డీసీపీ అభినందించారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు

- బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి
- బీసీ బంధు కింద రూ.20 లక్షలివ్వాలి : ఎంపీ ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- తమిళనాడులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయడం లేదు
- తమిళనాడు రాజ్యసభ సభ్యులు విల్సన్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంలో బీసీ జాక్ జిల్లా అధ్యక్షులు సుందర్ రాజ్ యాదవ్ అధ్యక్షతన 'బీసీల రాజకీయ యుద్ధభేరి' బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలు ఉద్యమ పంథా మార్చాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. జాట్‌లు చేసిన ఉద్యమంతో వారికి రిజర్వేషన్లు దక్కాయన్నారు. అగ్ర కులాల లెక్కలు లేకున్నా రిజర్వేషన్లు పెట్టి వారికి అమలు చేస్తుంటే కోర్టులు జోక్యం చేసుకోవడం లేదని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తుంటే నిలిపివేస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చైనా బీసీలకు రిజర్వేషన్లను పెంచాలని, లేదంటే సుప్రీంకోర్టు తన నిర్ణయాన్నైనా మార్చుకోవాలని కోరారు. ఐక్యంగా తెగించి పోరాడితే బీసీలకు రిజర్వేషన్లు పెరుగుతాయన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను పెంచకపోతే రాష్ట్రం రణరంగమవుతుందని హెచ్చరించారు. ఒకవైపు ఉద్యమం చేస్తూనే మరోవైపు పిల్లల్ని బాగా చదివించాలన్నారు. 75 ఏండ్లలో బీసీ ముఖ్యమంత్రి ఒక్కరూ కాలేదన్నారు.

తమిళనాడులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయడం లేదు : రాజ్యసభ సభ్యులు విల్సన్

తమిళనాడులో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమలు చేయడం లేదని రాజ్యసభ సభ్యులు విల్సన్ తెలిపారు. దేశంలో తమిళనాడులో మాత్రమే 69 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని తెలిపారు. 50 శాతం బీసీలకు, 18 శాతం ఎస్సీలకు, 1 శాతం ఎస్టీలకు రిజర్వేషన్లను అమలు చేస్తున్నామన్నారు. జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2, 3 శాతం జనాభా లేని కులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మనం మేల్కోవాలని, సమయం ఆసన్నమైందని, మీరంతా ఢిల్లీకి వచ్చి కేంద్రానికి హెచ్చరిక చేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కులగణనలో బీసీల లెక్క తేలినందున రాజ్యాధికారం కోసం బీసీలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. ఈ సభలో బీసీ మండల్ మనుమడు ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ మేధావుల ఫోరం కన్వీనర్, పూర్వ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, జమాతే ఇస్లామి తెలంగాణ అధ్యక్షులు ఎంకేఎం జాఫర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్రిష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరడిగినా.. అడగకున్నా తెలంగాణకు నిధులు

- ఆదాయ పన్ను మినహాయింపు రూ.12 లక్షలకు పెంపు మైల్‌స్టోన్ : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎవరడిగినా..అడగకున్నా కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు వస్తూనే ఉంటాయని రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ నొక్కి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో రూ.2 లక్షలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటే ఇప్పుడు మోడీ సర్కారు ఏకంగా రూ.12 లక్షలకు మినహాయింపు ఇవ్వడం పెద్ద మైల్‌స్టోన్ అని చెప్పారు. ఆర్థికంగా ఎంత బలోపేతంగా దేశం ఉంద నేందుకు ఇదే నిదర్శనమన్నారు. మధ్య తరగతి ప్రజలతో దేశ ఆర్థిక ప్రగతి సాధ్యమని భావించే ప్రధాని మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రాల హక్కులకు ప్రాధాన్యం కల్పిస్తూనే చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సామాన్యుడు కూడా నాణ్యమైన విద్య, వైద్యం అందుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దారన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని 29 శాతం నుంచి 11 శాతానికి తగ్గించారని గుర్తుచేశారు. ఇవన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కనిపించడం లేదన్నారు. నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు కాంగ్రెస్‌కు కంచుకోటలా మెదక్‌ను చెప్పుకున్నారుగానీ కనీసం రైలు మార్గం వేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ చొరవతో త్వరలోనే రైలు ప్రారంభం కాబోతున్నదని చెప్పారు. పదేండ్లలో తెలంగాణకు మేమేం చేశాం...కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏం చేశాయనే దానిపై చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు.

జుజూబీ మాటలు చెప్పను

జర్నలిస్టుల సాధకబాధకాలు తెలుసు

- ఖమ్మం రోల్ మోడల్‌గా ఉండేలా చూస్తా..
- ఎన్నికల కోడ్ ముగిశాక ప్రక్రియ ముందుకు
- కొందరు జర్నలిస్టులతో కమిటీ ఏర్పాటు
- జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై సానుకూలంగా మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-ఖమ్మం

జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇండ్ల స్థలాలపై రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరంగా చిక్కులు లేకుండా.. నిపుణుల సలహాతో ఖమ్మం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పంపిణీ రోల్ మోడల్‌గా ఉండేలా చేస్తామన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం తనను కలిసి వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులతో మంత్రి చర్చించారు. జుజూబి మాటలు చెప్పనని, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ పూర్తయ్యాక జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి తప్పకుండా నిర్ణయం తీసుకుందామన్నారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలున్నారని, వాళ్ల సాధక బాధకాలు తనకు తెలుసు కాబట్టి, ముందుగానే డబ్బులు కట్టించి.. కాలయాపన చేస్తూ మభ్యపెట్టే తీరు నాది కాదని స్పష్టం చేశారు. ఆకలితో అలమటించి, రూపాయి రూపాయి పోగేసుకునే ఏ ఒక్క జర్నలిస్టు డబ్బులు వృథా కావద్దని, ఆ దిశగానే తన ప్రయత్నం ఉంటుందని తెలిపారు. నిపుణుల సూచన మేరకు ముందుకెళ్దామన్నారు. ఏదో ఒక రకంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని స్పష్టం చేశారు.

కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటి వాటిని పట్టించుకోనని, కాని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్న చిత్తశుద్ధితో ఉన్నానని స్పష్టం చేశారు. కొంతమంది జర్నలిస్టు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేద్దామన్నారు. మంత్రిని కలిసిన వారిలో.. సీనియర్ జర్నలిస్టులు వీ6 బ్యూరో సయ్యద్ ఖదీర్, నవతెలంగాణ బ్యూరో కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దిశ బ్యూరో సాగర్ దువ్వ, టీవీ 9 బ్యూరో నారాయణ, టీవీ 5 బ్యూరో నాగేశ్వర్‌రావు, సీవీఆర్ టీవీ బ్యూరో ఆవుల శ్రీను, జనం సాక్షి బ్యూరో కూరాకుల గోపి, ఇండియాటుడే బ్యూరో సంజీవరావు, మహాటీవీ బ్యూరో రామకృష్ణ, 6టీవీ బ్యూరో అయ్యప్ప, పీటీఐ నాగేశ్వర్‌రావు, జనంసాక్షి స్టాఫర్ షేక్ సుభాన్, రాష్ట్రీయ సహారా మొహమ్మద్ ఇంతియాజ్, మున్సిఫ్ బ్యూరో రియాసతుల్లాహ్, అర్షద్, వీ5 కేవీ, నవతెలంగాణ రిపోర్టర్ గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దిశ రిపోర్టర్లు మూర్తి, అంజెద్ పాష, జీ న్యూస్ రవి, జనంసాక్షి కనకరాజు, సేన నరేష్, ఉప్పలయ్య, లక్ష్మణ్, కెమెరామెన్లు యాకూబ్ పాష, షేక్ ఫయాజ్, అర్షద్, యూసుఫ్, జాకీర్, రంగా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకర్ల ముసుగులో వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- మూడు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు



నవతెలంగాణ-మిర్యాలగూడ

నకిలీ విలేకర్ల ముసుగులో గుర్తింపులేని క్రైమ్ మిర్రర్ పేపర్(డిజిటల్ పేపర్) అంటూ ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు, మరొక ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన నకిలీ విలేకర్ల అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డిజిటల్ పేపర్ ఎడిటర్ అని చెప్పుకుంటున్న ఆనంద్‌కుమార్, తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులు నెల రోజులుగా డిజిటల్ పేపర్‌లో వీరగాథ అనే పేరుతో మిర్యాలగూడలోని ఓ సీఐ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఎటువంటి ఆధారాలు లేకుండా డిజిటల్ పేపర్‌లో రాసి అసత్య ప్రచారాలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ ఇబ్బందులకు గురిచేశారు. వీరి వేధింపులు తట్టుకోలేక సీఐ తీవ్ర మనస్తాపానికి గురై డిజిటల్ పేపర్‌కు సంబంధించిన ఆనంద్, పేరబోయిన ఆంజనేయులు, రఘును సంప్రదించగా రూ.5లక్షలు డిమాండ్ చేశారు. చివరగా రూ.2లక్షలు ఇస్తే తప్పుడు వార్తలు రాయమని చెప్పగా సీఐ తాను ఏ తప్పు చేయలేదంటూ డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. సీఐ కుటుంబం బాధపడుతుండటంతో సీఐ స్నేహితుడు ఈ విషయాన్ని చక్కబెట్టేందుకు క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ పేరబోయిన ఆంజనేయులుని ఓ ఇంటికి పిలిపించి బేరం ఆడిన తర్వాత రూ.1.10లక్షలను ముట్టచెప్పాడు. ఈ డబ్బులను వారు ముగ్గురు.. రూ.10వేలు ఆంజనేయులు, రూ.85వేలు ఆనంద్‌కుమార్, రఘు రూ.15వేలు తీసుకున్నారు. తిరిగి మళ్లీ డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడటంతో డబ్బులు తీసుకుంటున్న సీసీ కెమెరా ఫుటేజీ, ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడిన ఆడియో రికార్డింగ్‌తో సీఐ తన కుటుంబసభ్యులతో ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మాడ్గులపల్లి మండలం పాములపాడుకు చెందిన పేరబోయిన ఆంజనేయులు, మర్రిగూడెం వట్టిపల్లికి చెందిన తుప్పరి రఘును పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. రాసిన కథనాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపించలేకపోయారు. నాగార్జునసాగర్‌కు చెందిన ఓ ఫారెస్ట్ అధికారిని బెదిరించి రూ.50వేలను ఫోన్‌పే ద్వారా వసూలు చేసినట్టు సాగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నల్లగొండ డీఎంహెచ్‌వో ఆఫీసులో పనిచేస్తున్న ఒక ఉద్యోగిని బెదిరించి రూ.50వేలను ఫోన్ పే ద్వారా వసూలు చేశారని, ఈ విషయంలో నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. సదరు నిందితుల మీద మూడు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. కాగా ఈ బ్లాక్‌మెయిల్ దందాకు బలైన ఇంకా మరికొంతమంది పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. ఇద్దరు నిందితులను కోర్టులో రిమాండ్ చేసి, వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో టూటౌన్ సీఐ నాగార్జున తదితరులు ఉన్నారు.

సంపాదనంతా ఖర్చులకే

దేశంలో డ్రైవర్ల పొదుపు చాలా తక్కువ

- మోడీ సర్కారు విధానాల ఎఫెక్ట్
- కేంద్రానికి వ్యతిరేంగా ఉబర్ క్యాబ్ డ్రైవర్లు
- వారిపై పట్టణ ద్రవ్యోల్బణం అధికం
- వినియోగ స్థాయిలపై ప్రభావం
- ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు



న్యూఢిల్లీ: దేశంలో మోడీ సర్కారు ఆర్థిక విధానాలు అన్ని రంగాలనూ తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. కరోనా మహమ్మారితో బతకటమే కష్టమైన ఆటో, క్యాబ్ డ్రైవర్ల పైనా ఈ ఎఫెక్ట్ ఉన్నది. వాస్తవానికి 12 గంటలకు పైగా కష్టపడితే కానీ డ్రైవర్లకు డబ్బులు దొరకని పరిస్థితి ఉన్నది. దీంతో తమకు వచ్చే కొద్దిపాటి మొత్తంలో డ్రైవర్ల పొదుపు చాలా తక్కువగా ఉంటున్నది. ఒకప్పుడు ఈ రంగంలో వచ్చిన మార్పుల కారణంగా ఉబర్ ఆటో, రిక్షా డ్రైవర్లు మోడీకి అనుకూలంగా ఉండేవారు. ప్రస్తుతం కేంద్రం అనుసరిస్తున్న విధానాలు తమకు ప్రతికూలంగా మారటంతో ఉబర్ క్యాబ్ డ్రైవర్లు మోడీ సర్కారుకు వ్యతిరేకంగా మారారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నదని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.

గురుగ్రామ్‌లోని ఉబెర్ క్యాబ్ డ్రైవర్ సగటున నెలకు రూ.40,000-50,000 సంపాదిస్తాడని అంచనా. ఇది ఉబర్ ఆటో రిక్షా డ్రైవర్ విషయంలో దాదాపు రూ. 25,000-30,000 ఆర్జిస్తాడని సమాచారం. అయితే, ఈ స్థాయి ఆదాయంలో వారికున్న ఖర్చులను లెక్కలోకి తీసుకుంటే పొదుపులు చాలా తక్కువగా ఉంటామయని ఆర్థిక విశ్లేషకులు చెప్తున్నారు. ఇక నగరాల్లో ఉండటం కారణంగా ఖర్చులు అధికంగా ఉంటాయని అంటున్నారు. దీంతో వారు సంపాదించినదంతా ఆహారం కోసం ఖర్చులకే వెళ్తున్నదని వివరిస్తున్నారు. వారు చేసే ఖర్చుల్లో అద్దె, ఆరోగ్యం, దుస్తులు, వారు కొనుగోలు చేసే ఇతర అత్యవసర వస్తువులు, వారు పొందగలిగే చిన్నపాటి వినోదం కోసం ఉంటాయని చెప్తున్నారు. గురుగ్రామ్‌లో ఉబెర్ క్యాబ్, ఆటో రిక్షా డ్రైవర్‌ల మధ్య మరో కీలక వ్యత్యాసం ఉన్నది. ఆటో డ్రైవర్ల కంటే క్యాబ్ డ్రైవర్లు పట్టణ ద్రవ్యోల్బణం వల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. అధికారిక రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను ఖచ్చితమైనదిగా పరిగణలోకి తీసుకుంటే క్యాబ్ డ్రైవర్ల వంటి వ్యక్తుల వాస్తవ వినియోగ స్థాయిలు తగ్గిపోతున్నాయి. అంతకముందు ఏడాదితో పోల్చితే నెలకు రూ. 20,000-25,000 ఖర్చు చేసిన కుటుంబాల వినియోగ స్థాయిలు 2023-24లో 13 శాతం పెరగటం గమనార్హం.



యువతకు కేంద్రం మోసం : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ విమర్శించారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లిలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ యువజన, విద్యార్థి వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. "బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు నిర్దిష్టమైన చర్యలు ప్రతిపాదించ లేదు. చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాయితీలు ప్రకటించలేదు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి, మిగతా రాష్ట్రాలకు మొండి చేయి చూపించింది" అని వారు విమర్శించారు. బడ్జెట్ ను సవరించి ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దామెర్ల హాష్మిబాబు, ఎండి జావిద్, జిల్లా నాయకులు క్రాంతి, రాజయ్య, దేవేందర్, జావిద్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ 5న రాష్ట్ర వ్యాప్త నిరసనలు

- హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన
- కార్మిక సంఘాలు, ఎస్కేఎం పిలుపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు రాయితీలిచ్చి సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్టు జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, వ్యవసాయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చాలు పిలుపునిచ్చాయి. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మికుల సంయుక్త సమావేశం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల ఐదో తేదీన అంబేద్కర్ విగ్రహం వద్ద, జిల్లా, మండల, పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో నిరసనలు తెలపనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమాలను కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివబాబు, హెచ్ఎంఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అంజాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

జనగణన ఇంకెప్పుడు చేస్తారు?

- కేంద్రాన్ని నిలదీసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనగణనపై కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిలదీశారు. జనగణన ఇంకెప్పుడు చేస్తారంటూ ఆమె ఎక్స్‌లో ప్రశ్నించారు. "సమ్మిళిత అభివృద్ధికి జనగణన తప్పనిసరి. జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుంది? జనాభా లెక్కల లేమితో వృద్ధికి ఆటంకం కలుగుతోంది.

గణాంకాలు లేకుండా దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితి ఎలా తెలుస్తుంది"? అని విమర్శించారు. ప్రగతిశీల విధానాలకు జనాభా లెక్కలు తప్పనిసరి అని పేర్కొన్నారు. జనగణనపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని కవిత డిమాండ్ చేశారు.

విద్యా రంగాన్ని విస్మరించిన కేంద్రం: పీడీఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ విద్యా రంగాన్ని విస్మరించిందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. పాఠశాల విద్యకు రూ.78,572.10 కోట్లు, ఉన్నత విద్యకు రూ.50,077.95 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని వారు తప్పు పట్టారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన 2.54 శాతం నిధులు విద్య పరిమాణం, పిల్లలందరికీ సమాన విద్యావకాశాలు అందించడానికి ఏ మూలకు సరిపోవని గుర్తు చేశారు. కేంద్రం బడ్జెట్‌ను వెంటనే సవరించి 10 శాతం నిధులు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పునరాలోచించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్టు హెచ్చరించారు.

మైనార్టీలను మోసం చేస్తున్న రేవంత్

- మాజీ మంత్రి మహమూద్ అలీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైనార్టీలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మాజీ మంత్రి మహమూద్‌అలీ విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ పాలనలో

మైనారిటీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఒక్క హామీ అమలు కావడం లేదని గుర్తు చేశారు. సబ్ ప్లాన్, ఇమాం, మౌజంలకు గౌరవ వేతనాలు, నిధుల కెటాంపులు తదితర హామీలు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నటుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ మంత్రివర్గంలో ఎంతమంది మైనార్టీలకు స్థానం కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రారంభిస్తే రేవంత్ వాటిని కాలరాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం ప్రతీకార రాజకీయాలు మాని పాలనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

మధ్యతరగతి కుదేలు

మోడీ సర్కారు విధానాలతో ఆర్థికంగా చితికిపోతున్న మిడిల్‌క్లాస్



న్యూఢిల్లీ : మోడీ పాలనలో దేశంలోని కార్పొరేట్లు, బడా వ్యాపారవేత్తలు ఆకాశమే హద్దుగా ఎదిగిపోతున్నారు. ఇందుకు కేంద్రం తనవంతు సాయాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగానూ అందిస్తున్నది. అయితే, దేశ జనాభాలో గణనీయమైన సంఖ్యలో ఉన్న మధ్యతరగతి ప్రజల బతుకుల్లో మాత్రం వెలుగులు కనబడటం లేవు. మోడీ సర్కారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతో వారి ఆదాయాల కంటే ఖర్చులే ఎక్కువవుతన్నాయి. పన్ను పోట్లు వీరికి గుదిబండగా మారుతున్నాయి. దేశంలో పెట్రోల్, వంటగ్యాస్, నిత్యావసరాల ధరల పెరుగుదల మధ్యతరగతి పౌరుడి జేబుకు చిల్లు పెడుతున్నది. ఇంత జరుగుతున్నా.. కేంద్రంలోని మోడీ సర్కారు మాత్రం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. తాము ఏమి చేసినా.. దేశంలోని మధ్యతరగతి ప్రజలు నమ్ముతారనే అతి విశ్వాసం కేంద్రానికి ఉన్నదనీ, ప్రజలు ప్రశ్నించేతత్వాన్ని కోల్పోవటమూ ప్రభుత్వానికి కలిసొచ్చిందని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ గణాంక సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), ప్రపంచ సంస్థలు చేసిన అంచనాల ప్రకారం.. ఈ ఏడాది వృద్ధి రేటు దాదాపు 6.5 శాతంగా ఉంటుందని అంచనా. ఇక కేంద్రం ఆర్థిక విధానాలతో ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంటున్న భారత్‌లోని మిలియనీర్లు దేశాన్ని విడిచి వెళ్తున్నారని కొన్ని నివేదికలు చెప్తున్నాయి. హెన్లీ ప్రయివేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్ట్ ప్రకారం

ఆదాయం తక్కువ.. ఖర్చులెక్కువ

ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్న కేంద్రం

ఇది గత రెండేండ్లకు పైగా సగటున 5వేలుగా ఉన్నది. వారు భారత్‌లో పెట్టుబడులు పెట్టటానికి అయిష్టతతో ఉన్న కారణంగానే ఇతర దేశాలకు వెళ్తూ అక్కడ సెటిల్ అయ్యే ప్రయత్నాలను చేస్తున్నారని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఇందుకు విరుద్ధంగా బిలియనీర్లు మోడీ సర్కారును పొగిడే పనిలో ఉన్నారనీ, ఫలితంగా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మధ్యతరగతి ప్రజలకు దేశంలోనే ఉండి కష్టాలను ఎదుర్కోవటం తప్పితే మరొక అవకాశం కనిపించటంలేదని చెప్తున్నారు.

ఏమి చేసినా చెల్లుతుందనే రీతిలో మోడీ సర్కారు

మధ్యతరగతి ప్రజల నుంచి పన్నులు ఇతర మార్గాల ద్వారా వసూలు చేసిన మొత్తాన్ని ఇతర పథకాల రూపంలో కేంద్రం తన ఎన్నికల ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఇంత జరిగినా.. మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో తాము రాజకీయంగా బలంగా ఉన్నామనీ, అక్కడ ఎన్నికల్లోనూ వారి నుంచి ఓట్లను పెద్ద సంఖ్యలో రాబట్టుకుంటున్నామని కాషాయపార్టీ నాయకులు అంటున్నారు.

అయితే, ఈ ధైర్యమే మోడీ సర్కారుకు ఆయుధంగా మారిందనీ, తిరిగి మధ్యతరగతి ప్రజలే తిప్పలు పడుతున్నారని విశ్లేషకులు చెప్తున్నారు.

బీజేపీ భావోద్వేగ రాజకీయాలు.. ప్రశ్నించని మధ్యతరగతి పౌరుడు

హిందూత్వం, జాతీయవాదం అనే నినాదాలను వినిపిస్తూ మధ్యతరగతి ప్రజల ఆలోచనలను అటువైపు మళ్లించటంలో బీజేపీ సఫలమైంది. అలాగే, హిందూ-ముస్లిం అంటూ విభజన సిద్ధాంతాన్ని తీసకొచ్చి విజయవంతంగా ప్రయోగించింది. ఇలాంటి తరుణంలో ఆ వర్గం ప్రజలు బీజేపీ చెప్పే భావోద్వేగమైన నినాదాల, విషయాలను నమ్మి.. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్న ఆలోచనను చేయలేకపోతున్నారని విశ్లేషకులు అంటున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించనితత్వం అభివృద్ధికి ఆటంకమనీ, ప్రజలు దీనిని గుర్తెరగాలని మేధావులు చెప్తున్నారు.

కేంద్ర మంత్రి నిర్మలా పన్ను'పోటు'

కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల పైనా తీవ్ర చర్చ నడుస్తున్నది. జీఎస్టీతో పాటు ఇతర పన్ను పోటుతో మధ్యతరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. ఆదాయాలపై విధించి పన్ను విషయంలోనూ దేశంలోని ఒక వర్గం ప్రజలు కేంద్ర మంత్రిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో కేంద్ర ఆర్థిక మంత్రిపై నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. కొత్త వ్యాపారాలు ప్రారంభిద్దామనుకున్న యువతకు మోడీ సర్కారు విధానాలు గుదిబండగా మారాయని అంటున్నారు. దేశ జనాభాలో మధ్యతరగతి ప్రజలే అధికం. కాబట్టి, ఆర్థిక వ్యవస్థలో వీరిది కీలక పాత్ర. కానీ, ప్రభుత్వాలు మాత్రం వారి గురించి ఆలోచించటం లేవు. పైగా.. తిరోగమన చర్యలతో మిడిల్‌క్లాస్‌ను ఊపిరిసల్పనీయకుండా చేస్తున్నాయి.

వచ్చే అతికొద్ది ఆదాయంలో ఆహారం, పిల్లల చదువులు, ఇళ్లు, ఆరోగ్యం.. ఇలా కనీస అవసరాలను తీర్చుకొనే విషయంలోనే మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా కష్టపడాల్సిన పరిస్థితులు దేశంలో ఉన్నాయి.

కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి మొండి చేయి

రాష్ట్రాల హక్కులు లాక్కునే చర్యలు

- కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణకు బీజేపీ బాటలు
- ఆర్ఎస్ఎస్ వ్యూహ్యాలు విద్యలో అమలుకు చర్యలు
- బడ్జెట్‌లో నిధుల కోతకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్


కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశ విద్యారంగానికి మోడీ ప్రభుత్వం మొండి చేయి చూపించిందని ఎస్ఎఫ్ఐ విమర్శించింది. విద్యను కార్పొరేట్, ప్రయివేటు రంగానికి మరింతగా ధారాదత్తం చేయడానికి బడ్జెట్లో చర్యలు తీసుకుందని తెలిపింది. జీడీపీలో 0.5 శాతం, విద్యా రంగానికి ప్రతిపాదించిన బడ్జెట్ కంటే బడ్జెట్‌లో 2 శాతం తక్కువ కేటాయింపులతో, ప్రభుత్వం ఇచ్చిన "100 శాతం నాణ్యమైన పాఠశాల విద్య", "సమ్మిళిత వృద్ధి" అనే దాని వాగ్దానం విఫలమైందని విమర్శించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఎం పోషన్ పథకానికి (మధ్యాహ్న భోజన పథకం కూడా అత్యంత తక్కువ నిధులు కేటాయించిన దానిలో ఉంది.) గతం కంటే విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులో నామమాత్రంగా రూ.0.2 శాతం పెరిగిందని తెలిపారు. రూ.1,2467.39 కోట్ల నుంచి రూ. 12,500 కోట్ల నిధులు మాత్రమే విద్యారంగానికి పెరిగాయని చెప్పారు. 2024 జూన్‌లో వచ్చిన పోషన్ ట్రాకర్ డేటా ప్రకారం, భారతదేశంలో 17 శాతం (2.7 కోట్ల మంది పిల్లలు) మంది తక్కువ బరువుతో, 36 శాతం మంది మందగించి, 6 శాతం మంది ఎలాంటి అవకాశం అందకుండా వధాగా ఉన్నారని చెప్పారు. ఈ లెక్కన ప్రస్తుతం కేటాయించిన కేటాయింపులు ఒక పిల్లవాడికి 5 పైసల చొప్పున మాత్రమే పెరిగాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో తీవ్ర పోషకాహార లోపం సమస్యల పట్ల నిర్లక్ష్యానికి ఈ కేటాయింపులు అద్దం పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ఇప్పటికే పాఠశాల విద్యకు దేశంలో నిధుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యకు రూ.73,008 కోట్ల నుంచి రూ.78,572 కోట్లకు నిధుల కేటాయింపు చేశారు. నిధులు రూ.500 కోట్లు పెంచినా సవరించిన అంచనాల్లో తగ్గించకుండా చర్యలు తీసుకోవాలి. ప్రయివేటు రంగంలో పరిశోధకుల కోసం ఈ బడ్జెట్లో కేటాయింపులు పెరిగాయి. 2024లో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రకటించిన ప్రయివేటు రంగ ఆధారిత పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ చొరవ కోసం ప్రభుత్వం రూ. 20,000 కోట్లు కేటాయించింది. అదే సమయంలో ప్రభుత్వ పథకాలు రూ.355 కోట్ల నుంచి 7.89 శాతం పడిపోయాయి. కానీ రూ.327 కోట్లు ప్రయివేటు సంస్థలకు మూలధనం ఇస్తూ వారి మార్కెట్ అవసరాలకు కేటాయింపులు ఉన్నాయి. ఈ రంగంలో సామాజిక రంగం సమస్యలపై పరిశోధనలకు అవకాశం లేదు. ఇదొక ప్రమాదకర ధోరణి. సామాజిక రంగాన్ని విస్మరించి శాస్త్రీయ సాంకేతిక ఆవిష్కరణలు పెరుగుతున్న ధోరణి ఈ బడ్జెట్‌లో కనిపిస్తుంది" అని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

"ఉన్నత విద్య కోసం 2025-26 బడ్జెట్ కేటాయింపులు నామమాత్రంగా రూ. 47,619.77 కోట్ల నుండి రూ. 50,077.95 కోట్లకు కేవలం 5 శాతం పెరుగుదలను చూపింది. కానీ ఇది 5.22 శాతం ద్రవ్యోల్బణం రేటును లెక్కించినప్పుడు ఎటువంటి మార్పును చూపించదు. వాస్తవానికి, ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఉన్నత విద్య వాటా 1 శాతం కంటే తక్కువగా ఉంది. కానీ వ్యయాన్ని చూసినప్పుడు అంచనాలు మరింత మసకబారుతున్నాయి. బడ్జెట్‌లో రూ.10 కోట్ల నుంచి 50 కోట్లకు బడ్జెట్ కేటాయింపులు పెరిగాయి. కానీ పెరిగినవి(ఐకెఎస్) "ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్" పేరుతో జ్ఞాన వేద విద్య పేరుతో తెలియని వేద విజ్ఞాన ఆవిష్కరణ పేరుతో తీవ్రమైన విద్యా వ్యయాలను తగ్గించింది. ఐకెఎస్ పేరుతో దీనికి అధిక నిధులు కేటాయింపులు చేశారు. ఇలా ఆరెస్సెస్ భావజాలానికి అనుగుణంగా వేద విద్య పేరుతో తీసుకున్న ఈ చర్యలు చాలా కచ్చితంగా ఒక సైద్ధాంతిక ఎత్తుగడ, నకిలీ సైన్స్ , సంఘ్ సంస్కరణలు, వక్రీకరించిన చరిత్ర, సంస్కృతీ సంస్కరణల వైపు ప్రపంచ స్థాయి ఇన్‌స్టిట్యూషన్స్ స్కీమ్, "స్థూలమైన ప్రపంచ స్థాయి విద్యా, పరిశోధన సౌకర్యాలను" ప్రోత్సహించే లక్ష్యంతో రూ. 1,800 కోట్లు నుంచి రూ. 47,5.12 కోట్లు ఉన్నత విద్యలో చేరిన 43 మిలియన్లకుపైగా విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి ఒక దేశాన్ని వక్రీకరించిన పురాతన కాలం నాటి దక్పథంలో రూపొందించాలనే ప్రభుత్వ లక్ష్యం స్పష్టంగా లేదు. ఈ విషయంలో అభివద్ధి చెందిన దేశాలతో సమానంగా ఉండటం అసాధ్యమయ్యే స్థాయిలో భారతదేశం ఇప్పటివరకు సాధించిన విద్యావేత్తల, పరిశోధనలలో పురోగతిని బలహీనపరచడానికి ప్రయత్నిస్తుందని..." వారు విమర్శించారు.

"ఐఐటీలకు అదనపు మౌలిక సదుపాయాల కల్పన హామీ మూలధన వ్యయంలో 7 శాతం కోత విధించినది. ఇది బూటకానికి పరాకాష్ట. 2024-25లో రూ.11.06 కోట్లు నుంచి రూ.10.27 కోట్లు వరకు. 2025-26లో కేవలం ఐఐటీలు, ఐఐఎంలు మాత్రమే కాకుండా ఇతర కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు నాసిరకంగా ఉన్న నేపథ్యంలో వాటి అభివద్ధి కోసం చర్యలకు ఆర్థిక మంత్రి ప్రసంగంలో ఎలాంటి ప్రస్తావన కనిపించలేదు. 2023-24తో పోలిస్తే యూజీసీకి నిధుల కేటాయింపు 47 శాతం తక్కువగా ఉన్నందున, సెంట్రల్ యూనివర్సిటీలకు వచ్చే మొత్తం గ్రాంట్లలో 3 శాతం కంటే ఎక్కువ హెచ్ఈఎఫ్ఏ లోన్ల అసలు, వడ్డీ కింద చెల్లించబడుతుంది. ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, ఐఐఎంలకు గ్రాంట్ల విషయంలో కూడా ఈ పరిస్థితి భిన్నంగా లేదు. సెంట్రల్ యూనివర్సిటీలకు 2024-25లో రూ. 372 కోట్ల నుంచి 2025-26లో రూ.462 కోట్లకు పెరిగిన హెచ్ఇఎఫ్ఏ లోన్ల వాటా ప్రభుత్వ నిధులతో కూడిన విశ్వవిద్యాలయాలలోకి ప్రయివేటు మూలధనం పెరుగుతున్న ప్రవాహాన్ని గుర్తించింది. ఈ సంస్థల స్వయంప్రతిపత్తికి రాజీ పడే ప్రమాదం ఉంది. దేశంలో ఉన్నత విద్యను అభివద్ధి చేయకపోవడంతో విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలు పోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. దేశంలో ఎన్.ఈ.పి. అమలు చేయాలంటే (4,82,100 కోట్లు) నిధులు అవసరం అని అంచనా వేసిన బీజేపీ ఈ రకమైన నిధులు ఇవ్వలేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాల నుంచి కోరుతున్నట్టు జీడీపీలో 6 శాతం నిధుల కేటాయింపు కూడా లేదు..." అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ఎన్ ఇ.పి.తో, ప్రభుత్వం విద్యను సరుకుగా మార్చడానికి తన చర్యలతో వేగవంతం చేస్తోంది, ఇది సమాజంలోని సంపన్న వర్గాలకు మరింత అందుబాటులో ఉండేలా చేస్తుంది. అదే సమయంలో అట్టడుగు నేపథ్యాల నుంచి విద్యార్థులకు నిధులు సమకూర్చే విద్య నుంచి మినహాయించే వాతావరణాన్ని ప్రోత్సహిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఇచ్చిన హామీలైన జిల్లాకో నవోదయ విద్యాలయం, సైనిక పాఠశాలలు, ఏకలవ్య పాఠశాల, ములుగు ట్రైబల్ యూనివర్సిటీకి నిధుల కేటాయింపు లాంటి వాటికి చోటులేదని.."వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు లాక్కుని విద్య కేంద్రీకరణ, కార్పొరేటీకరణ కోసం పూనుకుంటుందని ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు విమర్శించారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.



నేడు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రితో సీతక్క భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) సోమవారం భేటీ కానున్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కేంద్ర మంత్రి వద్ద సీతక్క నివేదించనున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మరిన్ని పోషకాలతో కూడిన బల సంవర్ధకమైన ఆహారాన్ని అందించేందుకు కేంద్ర సహకారాన్ని కోరనున్నారు. మంత్రి సీతక్కతో పాటు టీజీ ఫుడ్స్ చైర్మెన్ ఎమ్ఏ. ఫహీం వెళ్లారు.

అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ ఇండియా అమ్మాయిల టీమ్‌కు మంత్రి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ ఇండియాలో విజేతలుగా నిలిచిన అమ్మాయిల టీమ్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో (3 వికెట్లు, 44 పరుగులు) జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించిన తెలంగాణకు చెందిన గొంగడి త్రిషను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. టోర్నీ ఆసాంతం త్రిష అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుందని తెలిపారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలనీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ ప్లేయర్‌గా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. క్రికెట్, ఇతర క్రీడల్లో రాణించాలనుకుంటున్న ఎంతోమంది ఆడబిడ్డలకు అమ్మాయిల గెలుపు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పిల్లల్లో ఉన్న క్రీడాసక్తిని, కల్చరల్ స్కిల్స్‌ను గుర్తించి వారు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, గురువులకు మంత్రి సూచించారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు అత్యాధునిక వసతులతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ ఇండియాలో విజేతలుగా నిలిచిన అమ్మాయిల టీమ్‌కు మంత్రులు కొండా సురేఖ, సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. గొంగడి త్రిషను ప్రత్యేకంగా అభినందించారు.

పరికరాలు పక్క రాష్ట్రం నుంచి.. మొక్కలు మరో రాష్ట్రం నుంచి

- నియామకాల్లో నిబంధనలకు నీళ్లు?
- టీశాక్స్‌లో అవకతవకలపై అనుమానాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఒక లక్ష్యం సాధించేందుకు ఏర్పాటు చేసిన సంస్థ తరచూ వివాదాస్పద నిర్ణయాలతో అనుమానాలను రేకెత్తిస్తోంది. రాష్ట్రంలో హెచ్ఐవీ ప్రబలకుండా, హెచ్ఐవీ రోగులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో పని చేయాల్సిన తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీశాక్స్)లో నియామకాలు జరిపినా, పరికరాలు కొన్నా, చివరకు మొక్కలను కొనుగోలు చేసినా కూడా ఆ కొనుగోలు జరిపిన తీరు అవకతవకలు జరిగాయనే అనుమానాలను రేకెత్తిస్తుంది.

హైదరాబాద్‌లో చౌకగా దొరికే టీవీలు, ప్రింటర్లు ఉండగా వాటిని కూడా గుంటూరు నుంచి కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది. అది కూడా గుంటూరుకు చెందిన స్వప్న గ్రాఫిక్స్ నుంచి తెప్పించడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు గ్రాఫిక్ సంస్థలో ఎలా ఉన్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో ఏదైనా కొనుగోలు జరపాలనుకుంటే గవర్నింగ్ బాడీ, ఈసీ మీటింగ్ ఏర్పాటు చేసేవారు. ఆ సమావేశాలకు హెల్త్ సెక్రెటరీ చైర్మెన్‌గా, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్య విధాన పరిషత్ కమిషన్ తదితరులు సమావేశమై నిర్ణయాలు తీసుకుని అమలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఏకపక్ష నిర్ణయాలతో హెచ్ఐవీ పేషెంట్ల కోసం ఉపయోగించాల్సిన ప్రోగ్రాం డబ్బులు వృధా అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో కొనుగోలు చేస్తే జీఎస్టీ కూడా తెలంగాణకే వచ్చేదంటున్నారు.

టీశాక్స్‌లో తీసుకున్న మరో నిర్ణయం పట్ల కూడా విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో అనేక నర్సరీలుండగా వాటిని కాదని కర్ణాటక రాష్ట్రంలో ఉన్న మొక్కలకు రూ.4 లక్షలకు పైగా ఖర్చు చేసి తెప్పించినట్టు తెలుస్తుంది. హెచ్ఐవీ వ్యాధి వ్యాప్తి నిరోధానికి, హెచ్ఐవీ రోగుల సేవలకు ఉపయో గించాల్సిన నిధులు ఇలాంటి నిర్ణయాలతో దుర్వినియోగమవుతున్నాయనే వాదన వినబడుతోంది. హెచ్ఐవీ రోగుల డబ్బుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

నియామకాల ప్రక్రియ కూడా పారదర్శకంగా జరపడం లేదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అడిషనల్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, క్లస్టర్ ప్రోగ్రాం ఆఫీసర్, డాటా మేనేజ్‌మెంట్ డాక్యుమెంటేషన్ ఆఫీసర్ పోస్టుల నియామకానికి జేఎన్టీయూ 2024 డిసెంబర్ 19న పరీక్ష నిర్వహించారు. రాసిన అభ్యర్థులు, వారికొచ్చిన మార్కులపై కనీస సమాచారం లేదని చెబుతున్నారు. నాలుగు పరీక్షలు రాసినా ఒక్క దానిలో కూడా ఉత్తీర్ణులు కాని వారికి టీశాక్స్ పోస్ట్ ఇచ్చారని ఉద్యోగవర్గాలు చర్చించు కుంటున్నాయి. సదరు వ్యక్తి కోసం ప్రత్యేక పోస్టును క్రియేట్ చేశారని ఆరోపిస్తున్నారు. ఇంటర్వ్యూ సమయంలో జేఎన్టీయూ నుంచి కమిటీలో సభ్యులు లేరనీ, అదే విధంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) నుంచి ఒక ప్రతినిధి ఉండాల్సి ఉండగా ఆ సభ్యులు కూడా లేకుండా టీశాక్స్ అధికారులే వారికి నచ్చిన వారితో పోస్టులు నింపారని సమాచారం. ఈ పోస్టులను నిలుపుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

కులగణన సర్వే దేశానికే ఆదర్శం

- కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం : టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



బీసీ కులగణన చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ...అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. కులగణన సర్వే దేశానికే ఆదర్శమని ఆయన ఒకప్రకటనలో గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీ కులాలకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. బీసీ కులగణన పారదర్శంగా జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు న్యాయం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు బీసీలకు తగిన అవకాశాలు ఇవ్వడం లేదని విమర్శించారు. అందువల్ల ఆ పార్టీలకు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. కులగణనపై విష ప్రచారాలు తిప్పి కొడుతామని ఆయన వెల్లడించారు.

ఏఐసీసీ ఈగల్ టీమ్ సభ్యుడిగా వంశీచంద్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ ఈగల్ టీమ్ (ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్) సభ్యులుగా రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి నియమితులయ్యారు. ఎనిమిది మంది సభ్యులతో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసింది. అందులో ఏఐసీసీ సీనియర్ నాయకులు అజయ్ మాకేన్, దిగ్విజయ్ సింగ్, అభిషేక్ సింఘ్వి, ప్రవీణ్ చక్రవర్తి, పవన్ ఖేరా, గుల్ దీప్ సింగ్ సప్పల్, నితిన్ రావత్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం | ఫిబ్రవరి 03, 2025 | www.navatelangana.com

ఘనంగా వేద స్కూల్ వార్షికోత్సం



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని కే.కే గార్డెన్స్‌లో వేద స్కూల్ వార్షికోత్సవ-2025 వేడుకలను ఆదివారం కరస్పాండెంట్ సంకల్ప్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో సరికొత్త విద్యా విధానాలతో విద్యార్థులకు తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తూ, చిన్నతనం నుండే మంచి నడవడికను అలవాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీప, అధ్యాపకులు సురేష్, కృష్ణ, ప్రియాంక, స్వప్న, జై సూర్య, సిబ్బంది బృందం తదితరులు పాల్గొన్నారు.

'యువ' కాలేజీలో ఘనంగా వసంత పంచమి



నవతెలంగాణ-సిటీబ్యూరో

వసంత పంచమిని పురస్కరించుకొని యువ జూనియర్ కళాశాలలో లక్ష్మీ గణపతి హెూమం, కుబేర హెూమం, సరస్వతి హెూమం, యాగాన్ని నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ నందిగంటి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులందరీపై సరస్వతి కటాక్షం ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శారద, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి ఓపెన్ జిమ్‌లు అవసరం



మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మానసిక ఉల్లాసానికి ఓపెన్ జిమ్‌లు ఎంతో అవసరమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ పరిధిలో ఉన్న 26వ డివిజన్‌లోని శ్రీశ్రీ హెూమ్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేరసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు మానసిక ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. శారీరక శ్రమ లేకపోవడం వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, డీఈఈ జ్యోతి, శ్రీశ్రీ హెూమ్స్ కాలనీ అధ్యక్షులు ఎం. రంజిత్ గౌడ్, జనరల్ సెక్రెటరీ లక్ష్మీ నరసింహా రెడ్డి, కోశాధికారి వెంకటకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ రావు, సీనయ్య, యాదయ్య, సూర్య వర్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సిద్ధి రాములు, గణపతి రెడ్డి, జయరాం రెడ్డి, నితిన్, శ్రీకాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్
అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారంలో ఉప్పల



నవతెలంగాణ-నాగోల్

వాకర్స్ ఇంటర్నేషనల్ సొసైటీ సుల్తాన్ బజార్ కోటిలో జరిగిన డిస్టిక్ గవర్నర్, డిస్ట్రిక్స్ క్యాబినెట్ సెక్రటరీల ప్రమాణ స్వీకారానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త హాజరయ్యారు. అంతకుముందు ఎన్నికైన డిస్టిక్ గవర్నర్ లింగ ప్రకాష్, డిస్టిక్ క్యాబినెట్ సెక్రెటరీ కే. శైలజా మోహన్‌ల ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమాన్ని ఉప్పల శ్రీనివాస్ గుప్త జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారిని ఉప్పల శ్రీనివాస్ గుప్త సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి, ఎమ్మెల్సీ బుగ్గ రపూ దయానంద్, రామనందం, నాగభూషణం, శ్రీనివాస చారి, ప్రసాద రావు, సత్యనారాయణ, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణను వినియోగించుకోవాలి

కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్



నవతెలంగాణ-నాగోల్

హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ వారు అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణను వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ సూచించారు. ఆదివారం నాగోల్ డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్త కాలనీలో హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ప్రెసిడెంట్ కాలం శెట్టి లయ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఫర్ ఉమెన్ ఎంపవర్మెంట్ టైలరింగ్ క్లాస్ సెర్మని కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డితో కలిసి కార్పొరేటర్ హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ లందరూ ఈ హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ వారి ఉచిత కుట్టు శిక్షణను వినియోగించుకోవాలన్నారు. మహిళల జీవన ఉపాధి కోసం ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో మా నుండి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అనంతరం లక్కీ డ్రాలో విజేతలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వరకుమార్, జనరల్ సెక్రటరీ నీరజ, కోశాధికారి కాశీనాథం, కాలనీ జనరల్ సెక్రటరీ కాలంశెట్టి హరి బాబు, గోపాల్, ప్రేమ్ బాబు, మహిళలు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా : కార్పొరేటర్



నవతెలంగాణ-హయత్‌నగర్

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని పవనగిరి కాలనీ ఫేస్-2, ఎల్లారెడ్డి కాలనీలో రూ.47లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ఆదివారం కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బొమ్మలగుడి రోడ్డు నుండి ఎల్లారెడ్డి కాలనీ, పవనగిరి కాలనీ ఫేస్ -2, ఎల్లారెడ్డి కాలనీ ఫేస్ -2, కేవీఎస్ రెడ్డి నగర్ కాలనీకి సులభంగా వెళ్లే మార్గంగా ఎన్నో సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డును పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.

రోడ్ నెంబర్ 11, మిగిలి ఉన్న రోడ్లను రెండు నెలల్లో పూర్తి చేస్తానని, పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్‌ను కూడా శాంక్షన్ చేయిస్తానని, మిగిలి ఉన్న సమస్యలను దశల వారీగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ గౌడ్, నరసింహ, వేణు గోపాల్ రెడ్డి, రామ్ గోపాల్, సత్యనారాయణ, వెంకటేష్, పవన్, సందీప్ రెడ్డి, బీజేపీ నాయకులు మోహన్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, కోటయ్య, సాయిరామ్ గౌడ్, రమేష్ చారి, గుండు యాదగిరి గౌడ్, పారంద సాయి తదితరాలు పాల్గొన్నారు.

'సుప్రజ ఆస్పత్రి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్'

నవతెలంగాణ-సిటీ బ్యూరో

సుప్రజ హాస్పిటల్ యూనిట్ ఆఫ్ దంతూరి వారి ఆధ్వర్యంలో నాగోల్ భవాని నగర్‌లో మెగా హెల్త్ క్యాంప్ ను ఆదివారం నిర్వహించినట్టు హాస్పిటల్ డైరెక్టర్ సిగ విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్కరిని ఆరోగ్యవంతంగా ఉంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. హెల్త్ క్యాంపులో వివిధ రకాల పరీక్షలు చేసి, ఉచిత మందులు, సలహాలు, సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ క్యాంపును కాలనీ అధ్యక్షుడు జి. లక్ష్మీనారాయణ ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, జనరల్ సెక్రెటరీ గిరిధర్, సుప్రజ హాస్పిటల్ డీజీఎం ఏవి రావు, మార్కెటింగ్ క్యాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, కార్తికేయన్, దివ్య, అనూష, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



'కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలం..'



నవతెలంగాణ -ఎల్బీనగర్

కేంద్ర బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్ అని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తర్వాత దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా ఉందన్నారు. ఈ బడ్జెట్లో ముఖ్యంగా తెలంగాణ ప్రజలను విస్మరించిందన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా, ధరలు నియంత్రించే విధంగా ఈ బడ్జెట్ లేదన్నారు. ఉపాధి హామీకి నిధులు పెద్దగా పెంచలేదన్నారు. రైతులకు ఉపయోగపడే కనీస మద్దతు ఊసే లేదన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసులకు రక్షణ లేని బడ్జెట్‌గా ఉందన్నారు. ఈ నిరసనలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జగదీష్, జగన్, నరసింహ, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కేసరి నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, ఐద్వా నాయకురాలు సంధ్య, కమర్, జి రవీందర్, మంతెన యాదయ్య, బి దుర్గారావు, ఎం. వీరయ్య, శ్రీనివాస్ చైతన్య, డి రాధ, కాశయ్య, మూర్తి, నరసింహారావు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్

బడ్జెట్ పూర్తిగా సంపన్న వర్గాలు, కార్పొరేట్లు, పెట్టుబడుదారులు, బీజేపీ పాలిత రాష్ట్రాలకు మినహా ఇతర అన్ని వర్గాల ప్రజలకు, కార్మికులకు, బీజేపీ యేతర రాష్ట్రాలకు ఏ మాత్రం కూడా ఉపయోగపడని పద్ధతుల్లో ఉందని సీపీఐ(ఎం) నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి.కిషన్‌లు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో పూర్తిగా ప్రైవేటీకరణకు అనుకూలంగా ఉండటమే గాక, కార్పొరేట్లు సంపన్న వర్గాలు పెట్టుబడిదారీ వర్గాలకు మేలు చేసే రకంగా ఉందన్నారు. దేశ అభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషిస్తున్న కార్మిక వర్గానికి, వ్యవసాయ కూలీలు, రైతులకు తీవ్రమైన నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే గాక నిరుద్యోగ యువత పట్ల మొండి చేయి చూపిందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న పొడిచారని, కార్మికుల సంక్షేమానికి మొండి చెయ్యి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో అభివృద్ధి రావాలంటే కార్మికులు, కష్టజీవుల వేతనాలు పెరగాలని అప్పుడు మాత్రమే ప్రజల దగ్గర కొనుగోలు శక్తి పెరిగి దేశ జీడీపీలో మార్పు వస్తుందని అన్నారు. తెలంగాణ, కేరళ లాంటి రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ నిరసనలో సీపీఐ(ఎం) పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, జె ఆశీర్వాదం, కె శారద, పార్టీ నాయకులు బి. శంకరయ్య, కుంచెం కృష్ణ, పి శ్రీనివాసులు, ఐ. కృష్ణ, మద్దెల యాదయ్య, ఏ మాధవరెడ్డి, టి.కృష్ణ కుమార్, పగిళ్ల మధు, ఎండి. జాఫర్, సీఐటీయూ నాయకులు శేఖర్ రెడ్డి, గుండా బాలరాజ్ బీరప్ప, మధుకర్ రెడ్డి, యాదగిరి యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 జాతీయ గ్రామీణ ఉపాధి హామీకి తూట్లు

నవతెలంగాణ - చంపాపేట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ పూర్తిగా తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా ఉందని మాజీ మంత్రి, మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత రవీంద్రనాయక్ ఆరోపించారు. ఆదివారం యాకుత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ వినయ్ నగర్ పరిధిలోని భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు నమ్మి 8 మంది ఎంపీలను గెలిపిస్తే..తెలంగాణకు నిధులు తీసుకురావడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణలో గత పదేండ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో చేసిన ఆర్థిక విధ్వంసం, చేసిన అడ్డగోలు అప్పులు, భూములతో సహా అనేక కుంభ కోణాలు చేస్తుంటే కళ్ళు చెవులు మూసుకుని ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేంద్ర బీజేపీ ప్రభుత్వం తాత్సారం చేసింది నిజంకాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్, తమిళనాడు బంజారా సంఘం అధ్యక్షులు రామావత్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -ఎల్బీనగర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్షత కనిపించిందని అన్నారు. బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నారని, అయినా నిధులు తేవడంలో పూర్తిగా విఫలం అయ్యారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హెూదా ఇవ్వలేదు అని అన్నారు. గత నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 3లక్షల కోట్లకు సంబంధించిన పథకాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణకు మాత్రం కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నరసింహ, వెంకటేష్ గౌడ్, రాజు నాయక్, మస్న రవి, లాజర్, యూసఫ్ ఖాద్రి ఢిల్లీ, శ్రీధర్, వంశీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వనస్థలిపురం వాసవీ టెంపుల్‌లో ఎంతో మందికి జేసీఐ జూనియర్ చాంబర్స్ ఇంటర్నేషనల్ వారు హైదరబాద్ ఫోనిక్స్ అనే చాప్టర్‌ని మొదలుపెట్టారు. ఒక అద్భుతమైన ప్రోగ్రాంగా మొదలుపెట్టి సైబర్ క్రైమ్‌పై అవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ చేశారు. ప్రస్తుత ప్రపంచంలో అతిపెద్ద సమస్య సైబర్ నేరాలు అవి జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో, నేరాలు జరిగిన తర్వాత ఏం చేయాలో అనే అంశాల మీద చాలా వివరంగా తెలియజేశారు. నేరం జరిగిన తరువాత కంగారు పడకుండా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. అంతేకాదు జేసీఐ స్టూడెంట్స్‌కు సంబంధించి ఎన్నో రకాల ఫ్రీ ట్రైనింగ్‌ని ఆర్గనైజ్ చేస్తూ దీంట్లో సెల్ఫ్ డెవలప్మెంట్, డిస్ప్లే కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్గనైజింగ్ స్కిల్స్, మేనేజ్మెంట్ స్కిల్స్, బిజినెస్ స్కిల్స్ ఎన్నో రకాలుగా ట్రైనింగ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ ఏడుకొండలు, జేసీఐ ప్రెసిడెంట్ వివి, నీరజ్, యువ కళాశాల డైరెక్టర్ నందిగంటి భాస్కర్, నందకిషోర్, భవన శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-హయత్‌నగర్

రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్‌లో నివాసం ఉంటున్న పోతుల గుడి నాగమ్మ, ధనరాజ్ దంపతులు ఆదివారం సాయంత్రం 5.30గంటల సమయంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ హయత్ నగర్ నుండి ఎల్బీనగర్ వైపు ద్వీ చక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో నవత ట్రాన్స్ పోర్ట్ వాహనం ఆ ద్వీ చక్ర వాహనాన్ని వెనుక నుండి ఢీ కొంది. ఈ ప్రమాదంలో నాగమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందింది. ద్వీ చక్ర వాహనంపై 4గురు ప్రయాణం చేయడం కొస మెరుపు.. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆయుర్వేద వైద్యుడికి సత్కారం

నవతెలంగాణ - చంపాపేట్

న్యూయార్క్ యునిటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి అత్యున్నతమైన గౌరవ డాక్టరేట్ పొందిన సైదాబాద్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు పొదిలి చిన్నరాజును ఆదివారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డి దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. చిన్నరాజు పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, వృద్ధులకు అన్ని విధాలుగా ఆసరా నిలుస్తుండటాన్ని గుర్తించిన యునివర్సిటీ.. గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాయలం ప్రతినిధులు చిన్నరాజుకు పట్టాను అందజేశారు.

విశ్వబ్రాహ్మణ 6వ వార్షికోత్సవంలో సబితమ్మ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వర నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్ గ్రామంలోని విశ్వ బ్రాహ్మణ వ్యవస్థాపక అధ్యక్షులు వేములకొండ జంగాచారి, గన్నోజు రాజుచారి, అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ చారి, ఉపాధ్యక్షులు నరేష్ చారి, కోశాధికారి వెంకటాచారీల ఆధ్వర్యంలో తోట జంగారెడ్డి గార్డెన్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ 6వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విశ్వ బ్రాహ్మనులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విశ్వ బ్రాహ్మనుల కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించడం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు 500 కోట్లతో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని నియమించాలన్నారు. విశ్వబ్రాహ్మణుల షాపులకు ఫ్రీ కరెంటు ఇవ్వాలని, అర్హులైన విశ్వకర్మలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు అందజేయాలన్నారు. రూ.10 లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు అందచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మర్రి హన్మంత్ రెడ్డి, ఎల్బల మమత సుదర్శన్ రెడ్డి, నాదర్ గుల్ రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ మంజుల కుమార్ గౌడ్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు పసునూరి భిక్షపతి చారి, బీసీ సెల్ అధ్యక్షులు కోటగిరి జంగయ్య, అర్కల కామేష్ రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

న్యూ నందిహిల్స్ ఫేస్ 1
మిడిల్ కాలనీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - మీర్ పేట్

న్యూ నందిహిల్స్ ఫేస్ 1 మిడిల్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ కార్యవర్గం గౌరవ అధ్యక్షులుగా ఎం. సూర్య నారాయణ, అధ్యక్షులుగా చల్లా శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీఎచ్ రఘునాథ్ రెడ్డి, కోశాధికారి డి. అంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఎ. జానయ్య పటేల్, గిరిధర్, ఎం. రవీంద్ర ముదిరాజ్, సహాయ కార్యదర్శులుగా మోనాచారి, ఎల్. రవికిరణ్, పురుషోత్తం, గౌరవ సలహాదారులు సామా భాస్కర్ రెడ్డి, జె. బాలరాజు, రఘుమారెడ్డి, కుప్ సింగ్, కె. నరసింహారెడ్డి, కమిటీ సభ్యులుగా పి. గోవిందు, రాందేవ్, శివరాజ్, నరేష్, రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్షులు తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.



మార్కెట్ యార్డు చైర్మెన్‌కు శుభాకాంక్షలు

• గ్యార ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ చైర్మెన్‌గా ఆనంద్ బాబు గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం గౌతమ్ నగర్ డివిజన్ చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు గ్యార ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆనంద్ బాబు గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఆనంద్ బాబు జీవితంలో ఇంకా మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాగం రాజు యాదవ్, అఖిల్ యాదవ్, రంజిత్, పాల్గొన్నారు.

విష్ణుపురి కాలనీలో కార్పొరేటర్ శ్రవణ్ పర్యటన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురి కాలనీలో పలు సమస్యలపై స్థానికులతో కలిసి మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీవీఎల్ వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్యాచ్ వర్క్‌ను పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ప్రయివేట్ వివాదాల్లో ఉన్న ఇండ్ల వల్ల శానిటైజేషన్ సమస్యలు తలెత్తుతున్నాయని, ఇటువంటి వారు లేక చెత్త పేరుకుపోయి దోమలకు నిలయంగా మారుతున్నాయని, సంబంధిత ఇండ్ల యజమానులకు జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్ చేయించి సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు మూర్తి, పవన్, రవి, వర్షిని, రామ్ మోహనరావు, సోమయాజులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

• ప్రజాకవి, సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్
• శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సామ అశోక్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్
విద్యార్థులకు చిన్నప్పటి నుండే క్రమశిక్షణ అవసరం అని ప్రజాకవి గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ అన్నారు. ఉప్పల్ బస్‌డిపో బోడుప్పల్‌లోని హైస్కూల్ 20వ వార్షికోత్సవ వేడుకలను పీర్జాదిగూడ కార్పొరేషన్‌లోని శ్రీ పలని కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిట్టపల్లి సురేందర్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు తల్లిదండ్రుల మొదటి గురువులని అన్నారు. దేశ పురోగతిలో ఉత్తమ పౌరులుగా భాగస్వాములై దేశానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కలల ప్రపంచంలో మొబైల్ ఫోన్ యొక్క మంచి చెడులను పాట రూపంలో వివరించారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ అభినందించారు. అనంతరం శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ సామ అశోక్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాపించి 20 ఏండ్లు అయ్యిందన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంలో శ్రీ చైతన్య పాఠశాల ముందుంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు కాంతారా, చంద్రముఖి, శివతాండవం శ్రీ గణేష్ ప్రదర్శనలు చేశారు. బోనాలు, బతుకమ్మ సంక్రాంతి, దేశభక్తి నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సామ శోభారాణి, డైరెక్టర్ అభిషేక్ రెడ్డి, విద్యార్థులు, తదితరులున్నారు.

శ్రామిక నగర్ కాలనీ అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామిక నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామిక నగర్‌లో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన శ్రామిక నగర్ కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. శ్రామిక నగర్ కాలనీలో ఉన్న సుమారు 18 వందల గజాల స్థలంలో రాళ్ల గుట్టలు ఉన్నాయని, వాటిని తొలగించి కాలనీ అభివృద్ధికి పార్కుతో పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని శ్రామిక నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రణాళికబద్ధంగా పార్కు స్థలం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా సకాలంలో తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, భాగ్యానందరావు, సందీప్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మొహమ్మద్ గౌస్ భాయ్, అబ్దుల్ హమీద్, కొంతం శ్రీనివాసరావు, హేమంత్ కుమార్, అబ్దుల్ రెహమాన్, షేక్ కరీం, కొండయ్య, రామ్ రెడ్డి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన కూతురు వివాహానికి రావాలని మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 15వ తేదీన జరిగే వివాహ ఆహ్వాన పత్రికను కేసీఆర్‌కు అందజేశారు. -నవతెలంగాణ, కాప్రా

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా లతా వెల్మారెడ్డి



నవతెలంగాణ -శామీర్‌పేట
మూడు చింతలపల్లి మండలం కొల్తూరు గ్రామానికి చెందిన లతా వెల్మారెడ్డిని కాంగ్రెస్ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శిగా అధిష్టానం నియమించిందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు చేతులమీదుగా నియామకపత్రం అందజేశారని తెలిపారు. తనపై నమ్మకంతో మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ సెక్రటరీగా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర, రాష్ట్ర మహిళా అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ ఇంచార్జీ, మార్కెట్ కమిటీ చైర్మెన్, ఎంపీపీ మండల, కొల్తూరు గ్రామ కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - జవహర్ నగర్
రజక వృత్తిదారుల సంఘం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బాలాజీ నగర్‌లోని లక్ష్మీనరసింహ కాలనీలో మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, స్థానిక ఎస్సై రాము నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ రజకుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వాన్ని వీడి 6 గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో రజకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, వృత్తి చేసే ప్రతి కుటుంబానికి మోడ్రన్ డ్రై క్లీనింగ్ 30 నుండి 50 కేజీల మిషన్ సబ్సిడీ కింద ఇవ్వాలని, 50 ఏండ్లు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలన్నారు. రజకులకు రక్షణ చట్టం చేయాలని, కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వ రక్షణ కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కుల దురంకార హత్యలను ఖండిస్తూ, హత్యలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుమ్మడి రాజు నరేష్, జ్యోతి ఉపేందర్ కే కే చారి, సకినాల రవి, గుమ్మడి రాజు వెంకన్న శంకరయ్య, సుమన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మమ్మ స్మారక విద్యాలయ వార్షికోత్సవం





నవతెలంగాణ - మేడ్చల్
మేడ్చల్ పట్టణంలోని లక్ష్మమ్మ స్మారక విద్యాలయం లో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఉదండపురం సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులను స్కూల్ యాజమాన్యం శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్ష్మమ్మ స్మారక విద్యాలయం క్రమశిక్షణకు మారుపేరు అని, ఇక్కడ విద్యను అభ్యసించిన ఎంతోమంది విదేశాలలో సైతం స్థిరపడ్డారని అన్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు సృజనాత్మకత పద్ధతిలో విద్యాబోధన చేస్తారని చెప్పారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న ఎన్నో అరాచకాలు, వాటిని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని అన్నారు. అనంతరం పాఠాలను విద్యార్థినీ విద్యార్థులు, లక్ష్మమ్మ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, రాజేందర్, ప్రిన్సిపాల్ మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డింపుల్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

• పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి





నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వినాయక్ నగర్ డివిజన్ కాకతీయ నగర్‌లోని డింపుల్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి సామాజిక సేవ నాయకులు మందల్ రాధాకృష్ణ యాదవ్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిన్నరలోనే 100 మందికిపైగా విద్యార్థులతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రీస్కూల్‌గా తాము గర్వపడుతున్నామని తెలిపారు. అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బృందం ఉందని, ఇది మా చిన్నారులకు నాణ్యమైన విద్య, సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారిస్తుందన్నారు. బాల్య విద్యకు బలమైన పునాదిని అందిస్తుందని, ఈ విజయానికి తమ ప్రిన్సిపాల్ టి. దివ్య రాజ్ అంకితభావం చాలా ముఖ్యమైనదన్నారు. బాల్య విద్య పట్ల ఆమెకున్న నిబద్ధత, మనస్తత్వ శాస్త్రంలో ఆమెకున్న నైపుణ్యం పాఠశాల పోషణ వాతావరణాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రిన్సిపల్ నాయకత్వంలో డింపుల్స్ ప్లే స్కూల్‌లో ఆటిస్టిక్ పిల్లల చిన్న బ్యాచ్ కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది వారిని సాధారణ పాఠశాలకు వెళ్లడానికి సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్లే స్కూల్ టీచర్స్, విద్యార్థుల పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

• మరో ఇద్దరికి తీవ్ర గాయాలు





నవతెలంగాణ-శామీర్‌పేట
రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశవరం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామానికి చెందిన మధు, మణిదీప్, బన్నీలు పల్సర్ బైక్‌పై మూడు చింతలపల్లి నుంచి కేశవరం వస్తుండగా మార్గ మధ్యలో బంగారు గుట్ట వద్ద మూలమలుపు వద్దకు రాగానే బైక్ కిందపడింది. కాగా బైక్ నడిపిస్తున్న బన్నీ(19) అక్కడికక్కడే దుర్మరణం చెందగా వెనకాల కూర్చున్న మధు (22), మణిదీప్ (21) లకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా వంటిమామిడిలోని ఆర్‌వీఎం హాస్పిటల్‌కు తరలించారు. బన్నీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా మల్లన్న స్వామి కల్యాణం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ మల్లికార్జున నగర్‌లోని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మల్లికార్జున నగర్ మల్లన్న స్వామి ఆలయంలో మల్లన్న స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల రాము యాదవ్‌లు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి భక్తులు ప్రత్యేక పూజలు బోనాల సమర్పణ, గొలుసులు తెంపుట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, అనిల్ కుమార్, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన ఎస్సీ వర్గీకరణ పోరాటానికి అండగా ఉంటాం

• కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్
• డప్పు కళాకారులతో మినీ ర్యాలీ



నవతెలంగాణ - జవహర్ నగర్
మాదిగల న్యాయమైన ఎస్సీ వర్గీకరణ పోరాటానికి అండగా ఉంటామని జవహర్ నగర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేపాక శ్రీకాంత్ యాదవ్ అన్నారు. ఈ నెల 7న తలపెట్టిన వెయ్యి గొంతులు – లక్ష డప్పులు కార్యక్రమానికి మద్దతుగా ఆదివారం మాట్ల క్రాంతి కుమార్, శ్రీను ఆధ్వర్యంలో జవహర్ నగర్‌లోని బీజేఆర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు నిర్వహించిన అంబేద్కర్ డప్పు కళాబృందం, డప్పు దరువుల మినీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ..సుప్రీం కోర్టు తీర్పు వెలువడగానే అన్ని రాష్ట్రాల కంటే ముందు తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివ కుమార్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, చేరుకు రమేష్ ముదిరాజ్, జెర్రిపోతుల కుమార్ స్వామి, ఇల్లెందుల ప్రభాకర్, గొల్లూరు ఎల్లయ్య, బూర లక్ష్మణ్ గౌడ్, కొండయ్య, మాధ కోటి శ్రీనివాస్ కురుమ, కే .రాజు యాదవ్, అంధే శ్రీనివాస్, ఎండీ అహ్మద్ పాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘంసీబాయి చిత్రపటానికి నివాళి



నవతెలంగాణ-కాప్రా
కాప్రా మాజీ కౌన్సిలర్ రాములు నాయక్ మాతృమూర్తి ఘంసీబాయి దశదినకు మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ హాజరై ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘంసీబాయి కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని తెలిపారు. మాజీ సీఎం చెన్నారెడ్డి హయాం నుండి ప్రజాసేవలో పాల్గొనేవారని తెలిపారు. బంజారా సంస్కృతిని దేశవిదేశాలలో ప్రతిధ్వనించేలా బంజారా స్త్రీల దుస్తులు, ఆభరణాలను తానే స్వయంగా డిజైన్ చేసి అమెరికా, కెనడా, యూరప్ దేశాలకు ఎగుమతి చేసేవారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విఠల్ నాయక్, హన్మంత్ నాయక్ , చందర్ నాయక్, సింగర్ రాహుల్ నాయక్, ధోతి విద్య నాయక్, శ్రీనివాస్ నాయక్, బంజారా సేవాసంఘ్ మల్కాజిగిరి అధ్యక్షులు), బంజారా సేవాసంఘ్ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడు దశరథ్ నాయక్ , డివిజన్ 3 మారుతీకాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, తదితరులున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో సంపన్నులకు సంచులు, సామాన్యులకు గుండు సున్నాలు

• సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని, సంపన్నులకు కార్పొరేట్లకు మాత్రమే రెడ్ కార్పెట్ పరిచి, దారాదత్తం చేయడానికి అన్నట్టుగా బడ్జెట్ ఉన్నదని సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 50 లక్షల 65 వేల 345 కోట్ల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల అవసరాల రీత్యా ఏ ఒక్క కోసానా కేటాయించిన దాఖలాలు లేవన్నారు. ఇది బీహార్, ఢిల్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ రాష్ట్రాలకు భాయిలాలు ఇచ్చారని ఆరోపించారు. దేశ అభివృద్ధికి ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులు గుండు సున్నాగా ఉన్నాయన్నారు. తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ ప్రాధాన్యత రంగాలకు కేంద్రం నుంచి కేటాయింపులు తీసుకు రావడంలో విఫలమయ్యారన్నారు. ఇది తెలంగాణ ప్రజానీకాన్ని అవమానించడమేనన్నారు. గడిచిన 70 ఏండ్లుగా భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉందన్నారు. అభివృద్ధికి నామమాత్రంగా కేటాయించిన బడ్జెట్ కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. పేపర్ మీద రాసుకోవడం తప్పా.. గ్రామీణ అభివృద్ధికి కేటాయింపులో స్పష్టమైన తేడా కనబడుతుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ కోసం కేటాయింపులు సక్రమంగా లేవని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా ప్రచారం తప్పా.. దానికి ప్రత్యేక ప్రణాళిక గాని, బడ్జెట్ కేటాయింపులు జరిగేదేమీ లేదన్నారు. గడిచిన 8 ఏళ్లుగా సబ్‌ప్లాన్ నిధుల దారి మళ్లించి దళితుల సంక్షేమానికి కాకుండా రోడ్లు, భవనాలు, పార్కుల అభివృద్ధికి ఖర్చు పెట్టి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు, శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి ఆశించినంత స్థాయిలో బడ్జెట్ కేటాయించలేదన్నారు. మధ్యతరగతి ప్రజానీకానికి రూ.16 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇస్తామని చెప్పి చివరకు రూ.12 లక్షల వరకే ఆదాయపన్ను మినహాయింపు ఇచ్చిందని, గతంలో ఇచ్చిన వాగ్దానాన్ని బీజేపీ తుంగలో తొక్కిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో సవరణలు చేసి ప్రాధాన్యత రంగాలకు సరైన బడ్జెట్ కేటాయించాలన్నారు. లేనిపక్షంలో ప్రజా, కార్మిక, కర్షకులతో కలిసి ఆందోళన చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఘనంగా సింగర్ వీణ వివాహం

• వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ కవిత, వజ్రేష్ యాదవ్, వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ - మేడ్చల్
మేడ్చల్ మండల జర్నలిస్ట్ బద్ద నవీన్ సోదరి తెలంగాణ జానపద గాయని వీణ వివాహం భవానీశంకర్‌తో ఆదివారం మేడ్చల్ పట్టణంలోని శ్రీ గార్డెన్‌లో జరిగింది. ఈ వాహానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు జల్లి శైలజ హరినాథ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్,మండల అధ్యక్షుడు దయానంద యాదవ్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, వివిధ పార్టీల నేతలు తదితరులున్నారు.

140వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా
కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం చేపట్టే జ్ఞానమాల కార్యక్రమం140వ వారానికి చేరింది. జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు ఎస్.ఏ రహీం, నర్సింహ్మ చారి, రవి నాయక్, నరేందర్ రావు , దయానంద్, మోకానిక్ కొండల్, నగేష్, తదితరులు మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు.

అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్



నవతెలంగాణ - పోచారం
పోచారం పరిధిలోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సేవామ్ ఎస్. నీలిమ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ అర్చన మంత్రి, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కె. రవితేజ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సి. మల్లేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ విజయ్ కుమార్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యామండలి చైర్మెన్ డాక్టర్ వి. బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రపంచవ్యాప్తంగా పోటీని తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థులలో సేవ, క్రమశిక్షణ, నిబద్ధత విలువలను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమం అని తెలిపారు. అనంతరం డాక్టర్ వి.ఎస్.రావు మాట్లాడుతూ..సాంకేతికత అంటే కొత్త విషయాలను సృష్టించడానికి లేదా కొత్త మార్గాల్లో పనులను చేయడానికి ఉపయోగించే జ్ఞానం అన్నారు. 19వ శతాబ్దం ఐరోపాకు చెందినదిగా, 20వ శతాబ్దం అమెరికాకు చెందినదిగా, 21వ శతాబ్దం భారతీయ శతాబ్దిగా తాము పరిగణిస్తున్నామని చెప్పారు. అనేక దేశాల్లో సామాజిక, సాంస్కృతిక చరిత్రలో విద్యార్థులు ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అంతకుముందు ప్రపంచవ్యాప్తంగా పోటీ పడాలంటే మిమ్మల్ని మీరు బాగా అభివృద్ధి చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేష్ ప్రారంభోపన్యాసం చేశారు. ఉన్నత విద్యావ్యవస్థలో ఎన్ఎస్ఎస్ ఒక విస్తరణ కోణమని, విద్యాసంస్థలలో చదువుతున్న సమయంలోనే విద్యార్థి యువత సమాజ సేవ వైపు మళ్లుతుందన్నారు. సమాజ సేవను అందించడంలో యువ విద్యార్థులకు అనుభవాన్ని అందించడంలో ఎన్ఎస్ఎస్ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఫ్యాకల్టీ ట్రైనీలు మరియు ఔత్సాహిక వాలంటీర్లు పాల్గొన్నారు.





9

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

సోమవారం | ఫిబ్రవరి 03, 2025 | www.navatelangana.com

సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన తేజ్ స్వరూప్ రెడ్డి (32) తన భార్య నాగలక్ష్మి ఇద్దరు పిల్లలతో కలిసి సూరారంలోని కృష్ణమాలక్ష్మి నగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయిన తేజ్ స్వరూప్ రెడ్డి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా కృష్ణారెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హనుమంత్ రెడ్డిని ఆదివారం కలిశారు. అనంతరం హనుమంతు రెడ్డి కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-దుండిగల్



కార్మిక, కర్షక

వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి



- ఫిబ్రవరి 5న దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి
- ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్ టీయూసీ, టీఎన్‌టీయూసీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ రోజున కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆల్ ట్రేడ్ యూనియన్ సదస్సు సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ అధ్యక్షతన వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులపై దాడిను పెంచింది. పని గంటలు పెంచీ జీతాలు తగ్గించింది. లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను చేసియాజమాన్యానికి అనుకూలంగా లేబర్ చట్టాలను మార్చారు. సమ్మె హక్కును తొలగించడానికి కుట్ర చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కష్టజీవులు ఎన్నో ఏండ్ల క్రితం కష్టపడి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారు. అంతేకాదు రైతాంగాన్ని వారి సమ స్యలను పట్టించుకోకపోగా.. రైతు విద్యుత్ చట్టాలను దెబ్బతీసి నడ్డి విరిచింది. అందుకే ఈ దేశంలో ఉన్న రైతాంగ కిసాన్ సంయుక్త మోర్చ కూడా ఈ నిరసనలో భాగస్వామ్యం అవుతున్నా రు. ఏఐటీయూసీ రాష్ట్ర కాన్సిల్ సభ్యుడు కామ్రేడ్: ఎస్.శంకర్ రావు మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతనం ఇవ్వాలని అందరికీ పెన్షన్ కల్పించాలని 8 గంటల పని దినాలు కల్పించాలని డిమాం డ్ చేశారు. టీయూసీఐ జిల్లా నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధర పెంచి జనాల నడ్డి ఇరగోడు తున్నారని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు చాలా ఇబ్బంది అవుతున్నారని వెంటనే కార్మికుల సమస్యపై పార్లమెంట్లో చర్చించాలని డిమాండ్ చేశారు.

ఈ సదస్సులో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు యాదయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసులు, పి.గణేష్, బి లింగస్వామి, బచుపల్లి, మల్కాజిగిరి మండల నాయకులు చంద్రశేఖర్, బి.నర్సింగ్ రావు, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు సత్యనారాయణ, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కే.ఉన్నీకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్రీనివాస్ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అడ్డాస్థలం కేటాయించాలి



- సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొంపల్లి ప్రధాన మెయిన్ రోడ్‌లో భవన నిర్మాణ కార్మికులకు అడ్డాస్థలం కేటాయించాలని ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ .. నిత్యం అనేక మంది కార్మికులు ఎండనక, వాననక రోడ్డు వెంట షెడ్డు మంచినీటి సౌకర్యం మూత్రశాలలు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కొంపల్లి భవన నిర్మాణ కార్మికులు అడ్డాను నమ్ముకుని చాలా సంవత్సరాల నుంచి ఇక్కడ పనులకు వెళ్లుచు జీవనాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు వలన అడ్డ స్థలం లేకుండా పోయిందని తక్షణమే అడ్డా స్థలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ భవననిర్మాణ కార్మికుల అడ్డాలో సుమారు 800 మంది కార్మికులు ఉన్నారని వారికి ఎలాంటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ఇప్పటి వరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం చేయలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి భవన నిర్మాణ కార్మికులకు అడ్డా స్థలం కేటాయించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, శీను, రాజు, స్వామి, మల్లేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారిని కలిశారు. అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పలువురి ఆహ్వానాలను, వినతిపత్రలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు దాసరి రవీందర్, కార్యదర్శి కురుమూర్తి, నియోజకవర్గం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ లేఔట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా..

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామరం డివిజన్,బాలాజీ లేఅవుట్ కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం చిత్తరమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యేను కాలనీ వాసులు కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పార్టీలకతీతంగా పరిష్కరిస్తారన్నారు. అనుక్షణం ప్రజాశ్రేయస్సు కోసం సేవకుడిలాపనిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిహెచ్.బుచ్చిరెడ్డి, అంజన్న, వెంకట్, శ్రీనివాసులు, వేణు, రాజు, సుకుమార్, విజయరెడ్డి, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కస్టమర్లకు మెరుగైన సేవలు అందించినప్పుడే ఫంక్షన్ హాల్‌లు మునగడ సాధిస్తాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్, మహదేవ్ పురంలో నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్టుత కోటగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో.. నూతనంగా ఏర్పాటు చేసిన "శుభమస్తు" బ్యాంకెట్ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యేతోపాటు వివిధ పార్టీలకు చెందిన నేతలు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఇంట్లో శుభ కార్యాలు నిర్వహించుకోలేని వారికి బ్యాంకెట్ హాల్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మహదేవపురంలో ఇలాంటి బ్యాంకెట్ హాల్ సరసమైన ధరలకు అందిస్తున్న కొట్టగడ్డ శ్రీనివాస్‌ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ,హేమలత సురేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ కేతురి నరసింహ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టీయూడబ్ల్యూజే ఐజేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజ్, నాయకులు కొలుకుల జైహింద్, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రవర్తన పైనే పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది : ఎమ్మెల్యే ..

కుత్బుల్లాపూర్: 132 - జీడిమెట్ల డివిజన్ న్యూ వివేకానంద నగర్ లోని విజ్ఞాన్ సుధా టాలెంట్ హై స్కూల్ నందు 22వ వార్షికోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయు లతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, తెలి పారు. తల్లిదండ్రులతో పిల్లలకు ఉండే చనువు, పిల్లల పట్ల ఉండే పెద్ద, వ్యవహరించే తీరు పేరు పైనే పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, ఎల్లా గౌడ్, నరేందర్ రెడ్డి, కాలె నాగేష్, నదీమ్ రాయ్, బాల మల్లేష్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.



మూసాపేట డివిజన్‌లో పర్యటించిన 'బండి'



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, ఆదివారం నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్ డివిజన్‌లో విస్తృతస్థాయి పర్యటన చేశారు. అందులో భాగంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరింపజేస్తానని తెలియజేశారు. స్థానిక నాయకులతో కలిసి స్మశాన వాటికను పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్ అధికారులు ఈ స్థలం తమదంటూ ప్రహరీ గోడ నిర్మించారు. అయితే దీనిపై స్థానికులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని రమేష్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక రాజీవ్ గాంధీ నగర్‌లో, ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఓ చోట నాలా చాలా ఇరుకుగా ఉండి నీటి ప్రవాహానికి అడ్డంకి మారిందని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా నాలాని విస్తరించాల్సిందిగా సూచించారు. స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివి జన్ అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

యువతి అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం, సాయి బాబా నగర్‌కి చెందిన శంకర్ కూతురు బాలఅక్షయ, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. జనవరి 30.01.2025 గురు వారం నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవ డంతో.. బంధువులను, స్నేహితులను అడిగిన ఆమె ఆచూకీ లభించలేదని తెలిపారు. అక్షయ తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఎలాంటి ఆచూకీ తెలిసిన ఫోన్ నం:8712663296, 916037 4960లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

పేదలకు ప్రయోజనం లేని బడ్జెట్

- ఈ బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం
- సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కమిటీ తరపున వ్యతిరేకిస్తున్నామని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎం.శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ కేవలం పెద్దల, కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైందన్నారు.

హెూలిస్టిక్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య పరీక్షలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌లో, హెూలిస్టిక్ హాస్పిటల్స్ సౌజన్యంతో, కమల ప్రసన్న నగర్ కమ్యూనిటీ హాల్‌లో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్న హాలిస్టిక్ హాస్పిటల్ సంస్థలను ప్రశంసించారు. నిరుపేద ప్రజల ఆరోగ్యం మెరుగుపడే విధంగా, ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేయాలని కోరారు. ఈ మెడికల్ క్యాంప్‌లో కార్డియాలజీ 2డికో, ఈసీజీ, ఐ చెకప్,డెంటల్ చెక్ అప్, జనరల్ చెకప్ నిర్వహించారు. ప్రజలందరూ ఇలాంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కార్యాలయంలో ఆదివారం కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తనున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా పలు కార్యక్రమాలలో పాల్గొనాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.

మేడిపండు లాంటి బడ్జెట్ ప్రవేశపెట్టారు



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్.
- పేదలకు,కార్మికులకు,నిరుద్యోగులకు ఉపయోగం లేదు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కేంద్ర ప్రభుత్వం మేడిపండు లాంటి బడ్జెట్ ప్రవేశపెట్టారని, దీని వల్ల పేదలకు, కార్మికులకు, నిరుద్యోగులకు ఉపయోగం లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ అన్నారు. శనివారం పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ దేశ ప్రజలకు నిరాశ జనకంగా ఉందని అన్నారు. మేడిపండు లాగా పైకి మంచిగా ఉండి లోపల మొత్తం ఉత్తదేనని బడ్జెట్ ప్రవేశ పెట్టడాన్ని నిరసిస్తూ ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట శాఖ కార్యాలయం ఎదురుగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు పెరుగుతున్న ధరలతో ఇబ్బంది పడుతుంటే ఆ ధరలు తగ్గుదల గురించి మాట్లాడకుండా.. నిరుద్యోగం పెరుగుతుంటే, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని మాట్లాడకుండా.. పైపూతగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఢిల్లీ బీహార్ లాంటి రాష్ట్రాలలో ఉన్న ఉద్యోగుల ఓట్లను సాధించడం పైనే దృష్టి పెట్టుకున్నరని విమర్శించారు. 12 లక్షల లోపు వారికి ఆదాయపు పన్ను రద్దు అనే నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని దీనివల్ల కేవలం 7.5 కోట్ల మంది ప్రజలకు మాత్రమే ఉపయోగపడుతుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నటువంటి 60 శాతం జనాభా రైతులకు, రైతు కూలీలకు ఉపయోగపడేటువంటి ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదన్నారు. ఇది కేవలం ప్రచార ఆర్భాటానికి తప్ప ప్రజలకు మాత్రం ఎలాంటి ఉపయోగం లేదని వ్యాఖ్యానించారు. వెంటనే గత బడ్జెట్లో చెప్పినట్లు బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన విశ్వవిద్యాలయం, మూసి ప్రాజెక్టు సుందరీకరణ, మెట్రో కారిడార్, రీజినల్ రింగ్ రోడ్‌కి నిధులు తీసుకురావాలని అన్నారు. లేకపోతే రాజీనామా చేసిసన్యాసం పుచ్చుకోవాలని సీపీ ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.హరినాథ్ రావు, మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య, కోశాధికారి సదానంద్, శాఖ కార్యదర్శి సహదేవ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకులు అరవింద్, సీపీఐ నాయకులు ఇమామ్, కొండన్న ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్..గోడపత్రిక, కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎస్సీ వర్గీకరణ అమలుకై ఈనెల 7న చలో హైదరాబాద్ పేరిట మంద కృష్ణ మాదిగ తలపెట్టిన లక్షల డప్పులు... వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రాస మల్ల యాదగిరి మాదిగ, భూదాల విజయభాస్కర్ రావు పిలుపునిచ్చారు. సూరారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్ భవనంలో ఆదివారం చలో హైదరాబాద్ గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాస మల్ల యాదగిరి మాదిగ మాట్లాడుతూ మాదిగ - మాదిగ ఉపకులాలు ప్రతి ఇంటి నుంచి ఒక డప్పు వేసుకొని రావాల్సిందిగా తెలియజేశారు. అదేవిధంగా సంబంధ వర్గాలు ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణకు మద్దతు తెలుపుతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. దళిత నాయకులు భూదాల విజయభాస్కరరావు మాట్లాడుతూ..ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కలుమూరి కురుమయ్య, ఎం.రత్నసాగర్, బోర్ల గడ్డం కురుమయ్య, కంజర్ల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఐక్యతను చాటిన జీడిమెట్ల పోలీసులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లోని పోలీసులందరూ మేమంతా ఒక్కటేనని గుర్తుగా ఒకే రకం టీషర్టు ధరించి ఐక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా సీఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ.. శాంతి భద్రతలు కాపాడడం కేసుల విషయంలో చాకచక్యంగా వ్యవహరించి నేరస్తులను పట్టుకోవడం. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమాజ సేవ చేయడమే మార్గంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నేరాలు నమోదైన తర్వాత వాటిని సేదించుట కంటే నేరాలు జరగకుండా నియంత్రించేం దుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో జీడి మెట్ల పోలీస్ స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకునేలాగా చేస్తామన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం10:00 గం॥ల నుంచి మధ్యాహ్నం 1:00 గం॥ల వరకు లక్ష్మి నగర్, సూరారం విలేజ్, విశ్వకర్మ కాలనీ, అయ్యప్ప సొసైటీ, మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంత:రాయం ఉంటుందని ఈ అంత:రాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయికిరణ్ తెలిపారు.



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపిందని నిరసిస్తూ చేపట్టిన ధర్నాలో పీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, నాయకులు పోలినేని రామారావు, శ్రీమంత్ గిరి, తోలుపునూరి నరేష్ గౌడ్, సౌకత్ అలీ తదితరు నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



కేంద్ర బడ్జెట్‌కి వ్యతిరేకంగా ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సంపత్ కుమార్‌లతో గోషామహల్ సీనియర్ నాయకులు బి.వెంకటేష్, ముంద్రాయి శ్రీనివాస్, సత్యం గౌడ్, తదితరులు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

ఘనంగా సెయింట్ బాయ్స్ టౌన్ స్కూల్ వార్షికోత్సవ ప్లాటినం జూబ్లీ వేడుకలు..

- పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ జహనుమాలోని సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హైస్కూల్ వార్షికోత్సవ ప్లాటినం జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గతేడాది పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా నగదు పురస్కారం, మెమోంటోలను అందించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ విద్యారంగంలో బాయ్స్ టౌన్ హైస్కూల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో సాధారణ, సాంకేతిక విద్యలతో పాటు విద్యార్థులు క్రీడల్లో తీర్చిదిద్దుతుండడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ యేసుప్రభు హరస్, ప్రిన్సిపాల్ షోరెడ్డి, సీబీఎస్ఈ విభాగం ప్రిన్సిపాల్ ఎడ్వర్డ్ తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ బీసీ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ శేఖర్ చారి అన్నారు. ఆదివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీజేపీ మరిచిపోయిందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ తెలంగాణ ప్రజలను మాత్రం పట్టించుకోలేదన్నారు. కొన్ని రాష్ట్రాలే అన్నట్లుగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో ఎందుకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలు, పిల్లలు ఆత్మ రక్షణ కళలల్లో ప్రావీణ్యం పొందాలి

- బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళలు, పిల్లలు ఆత్మ రక్షణ కళలల్లో ప్రావీణ్యం పొందాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని కెనరా బ్యాంక్ పార్క్, జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్స్ లో హైదరాబాద్ టైక్వాండో మార్షల్ ఆర్ట్ నిర్వాహకుడు, మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్, కలర్స్, బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినయ్ కుమార్, మీర్ వహాజ్ అలీ ఖాన్ రాష్ట్ర జెన్ సెక్రటరీ, హాజరయ్యారు. శిక్షణ పొందుతున్న 80 మందికి పైగా, కలర్ బెల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. టైక్వాండో రాష్ట్ర కార్యదర్శి మీర్ వహాజ్ అలీ ఖాన్, సర్టిఫికెట్ పొందిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎ.వినయ్ కుమార్ మాట్లాడుతు. విద్యార్థులు చదువుతోపాటు ఈ మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందితే తమ స్వయం రక్షణ కొరకు ఉపయోగపడుతుందనీ తెలిపారు. మహిళలు కూడా దీంట్లో శిక్షణ నేర్చుకుంటే ఆత్మ రక్షణ,ఆరోగ్యం పెంపొందుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ సంజయ్ సింగ్, కోచ్ మనీష్, రఘు, ఎస్. స్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో పవిత్రమైనది



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అన్ని దానాల కెల్లా అన్నదానం ఎంతో పవిత్రమైన కార్యమని ఆకలితో అలమటించే ప్రతి ఒక్కరిని మానవత్వంతో అన్నం పెట్టి ఆదరించాలని, శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్య అన్న సత్రం ట్రస్టు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. వెంకటేశం పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కాశీలో కొనసాగుతున్న అన్నదానంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మాఘమాసంలో 140 సంవత్సరాలకు ఓసారి, వచ్చే పవిత్రమైన మహా కుంభమేళాను, దర్శించుకున్న భక్తులను యాత్రికులకు, కాశీ అయోధ్యలో 44 రోజులపాటు ఉదయం, మధ్యాహ్నం రాత్రి, అల్పాహారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా 13 పుణ్యక్షేత్రాల్లో అన్నదాన సత్రాలు నిర్మాణ దశలో కొనసాగుతున్నాయన్నారు. ప్రతి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు, ఈ అల్పాహారం అన్నదాన కార్యక్రమాలు చేస్తూ విజయవంతంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా, ఏ.నాగభూషణం, కె.పాండు గుప్తా, జై. శ్రీనివాస్, పి.మల్లికార్జున, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం వివక్ష'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఒరిగింది ఏమిలేదని, బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపుతూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ఇండియన్ నేషనల్ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పేద, మధ్య తరగతి ప్రజలు, నిరుద్యోగులకు, విద్యార్థులకు బడ్జెట్ లో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీహార్ రాష్ట్రానికి బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించిన కేంద్రం తెలంగాణపై వివక్ష చూపించిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

సార్.. మా డిమాండ్లు నెరవేర్చండి

- యూనియన్లకు గుర్తింపు ఎన్నికలు నిర్వహించండి
- కార్మికశాఖ ప్రతిపాదనకు అనుకూలంగా స్పందించండి
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి మున్సిపల్ సహకారం మజ్దూర్ యూనియన్ వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీహెచ్ఎంసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఐఎన్టీయూసీ గుర్తింపు పొందిన మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి శనివారం సాయంత్రం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జీహెచ్ఎంసీలోని యూనియన్లకు గుర్తింపు ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటికే కార్మిక శాఖ నుంచి అందిన ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించాలని కోరారు. దీంతో పాటు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ప్రమోషన్ల విషయంపై కూడా ప్రత్యేక చొరవ చూపి వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. దుమ్ము ధూళి, రసాయనాల స్ప్రే వంటి ప్రమాదకరమైన వాతావరణంలో విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ పర్మినెంట్ ఉద్యోగులకు ఆరోగ్య భీమాను రూ. 15 లక్షలకు పరిమితిగా పెంచాలని కోరారు. చాలా ఏండ్లుగా జీహెచ్ఎంసీనే నమ్ముకొని విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్స్ ఉద్యోగుల జీతాల పెంపును కూడా పరిశీలించాలని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జీహెచ్ఎంసీలోకి డిప్యూటేషన్‌పై వచ్చిన వివిధ విభాగాలు చెందిన అధికారుల్లో చాలామందికి మూడేళ్ల డిప్యూటేషన్ గడువు ముగిసిన ఇంకా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారని, వారిని గుర్తించి వెంటనే వారి మాతృ శాఖకు పంపించాలని ఆదిల్ షరీఫ్ కమిషనర్‌ని కోరగా ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్ యూనియన్ కార్మికులు ఉద్యోగుల డిమాండ్లు అన్నింటిని కూడా పరిశీలించి సాధ్యమైనంతవరకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ తెలిపారు. ఐఎన్టీయూసీ ఆల్ ఇండియా ప్రెసిడెంట్, రాజ్యసభ మాజీ సభ్యులు జి.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో స్టేట్ ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ ఆర్‌డి చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ విజయకుమార్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కే. శివకుమార్ తదితరులున్నారు.

రైతుల, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- (సీఏటీ) చైర్మెన్ చేగురి వెంకటరమణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మార్కెట్‌లో రైతులు, వ్యాపారులకు, అనునిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ (సీఏటీ) చైర్మెన్ చేగురి వెంకటరమణ అన్నారు. ఆదివారం సీఏటీ చైర్మెన్‌గా ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయనకు ప్రథమ వార్షికోత్సవ అభినందసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణను బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ, కొండల్ సాయి కృప, బాలాజీ క్యాతం, ఈశ్వరయ్య, ఖ్యాతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం చేకూరి వెంకటరమణ మాట్లాడుతూ.. అగ్రి వ్యాపార రంగం అభివృద్ధి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సాధించడమే తన ముఖ్య లక్షణం అన్నారు. బాస్ అధ్యక్షులు క్యాతం, రాధాకృష్ణ మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, సామాజిక సేవాలో భాగంగా బాస్ అనాధ చిన్నారులను, హక్కున చేర్చుకొని వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు వెళ్తున్నార న్నారని ఆయన చేసిన సేవలు మరువలేనివి ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెక్ర టరీ బట్కిరి రాజు, కోశాధికారి కే.వాసు, గౌరవ సలహాదారులు కట్ట మల్లేశం, దేవర రాజేశ్వర్, డి.రఘు, రాచూరి మల్లేశం ఉపాధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్‌లు వంజరి వినోద్, కృష్ణ, డి.జగదీష్, స్వామి, కొండల్ సాయి, కృప బాలాజీ, క్యాతంఈ శ్వరయ్య, క్యాతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతాం

సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్రమోని పురుషోత్తం



నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్రమోని పురుషోత్తం తెలిపారు. ఆదివారం చిక్కడపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సభ్యులు ఆర్.ఝాన్సీ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షులు పురుషోత్తం హాజరై మాట్లాడుతూ వివిధ పారిశ్రామిక వాడల్లో పని చేస్తున్నటువంటి కార్మికులందరికీ ఏకతాటి పైకి తేవాలని వారి సమస్యల పరిష్కారానికి ఏఐడబ్ల్యూటీయు ట్రేడ్ యూనియన్ నాయకులు ఎల్లప్పుడూ కార్మికుల వెంబడే నిలబడాలని ఈనెల 8,9 తేదీల్లో ఏఐడబ్ల్యూటీయు తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలు సుమారు 200 మందితో జరపాలని నిర్ణయించామన్నారు. ప్రతి కంపెనీలో ఎనిమిది గంటల డ్యూటీ అమలు చేయాలని కోరారు. అలాగే 247 రోజుల్లో ఒకే చోట పని చేస్తున్నటువంటి కార్మికునికి పర్మినెంట్ ఉద్యోగంతో పాటు ఈఎస్ఐ మౌలిక సదుపాయాలు కల్పించాలని పనిచేస్తున్నటువంటి కంపెనీలో యాజమాన్యం ఆ కార్ మీకు షో, డ్రెస్సు ఆ కంపెనీ యాజమాన్యం ఏర్పాటు చేయాలని ఆ కంపెనీలో పని చేస్తున్న కార్మికునికి ఐడెంటి కార్డు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఎక్కడపడితే అక్కడ వాళ్లకు పెట్రోలింగ్ బండ్లను పెట్టి ప్రజల వాహనాలను అందులో ఎక్కిస్తున్నారని దీని ద్వారా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ పైన ప్రభుత్వం దృష్టి సారించి వీళ్ళపై చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు ఆర్.ఝాన్సీ బి. సుజాత వి.నాగేంద్రమ్మ, సంధ్యారాణి, బి.భాను ప్రసాద్, సిహెచ్ రాజు, జి.కృష్ణ, పి.సురేష్, పి,జ్యోతి, ఆర్. రామచందర్ పి. ప్రశాంత్, ఎస్కే ఆదామ్ పాండు నాయక్, గోవిందు నాయక్, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరమాతలు చూపిన మార్గాన్ని బాలికలు అనుసరించాలి

తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-ముషీరాబాద్

వీరమాతలు చూపిన మార్గాన్ని బాలికలు అనుసరించాలని తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హీరోలే కాదు -షీరోలూగా నిలబడి పురుషులతో పాటు మహిళలు సమానమే అని చాటిచెప్పిన 256 మంది భారతీయ ధీర వనితలు -స్ఫూర్తి కాంతుల స్ఫూర్తి వారి పాత్రలను పోషించి ప్రజల మన్ననలు పొందిన విద్యార్థినిల అభినందన సభ జరిగింది. ఈ సభకు తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు హాజరై వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు సమానమేనని చాటి చెప్పడమే లక్ష్యంగా సాగింది లింగ సమానత్వం సంపాదించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీని వల్ల ధైర్యం ఆలోచించే శక్తి, కదిలించి పురోగమించే ఉత్తేజాన్ని కలిగించిందన్నారు. 256 మంది భారతీయ ధీర వనితలు -స్ఫూర్తి కాంతుల స్ఫూర్తి వారి పాత్రలను పోషించి ప్రజల మన్ననలు పొందిన విద్యార్థినిలను తెలంగాణ బాలోత్సవం పిల్లలను అభినందనలు తెలియజేస్తుందన్నారు. జాతి గౌరవాన్ని నిలిపిన మహనీయులనే మరవద్దు.. వీర మాతలు చూపిన మార్గంలో.. బాలికలు వారిని అనుసరించడం వారి స్ఫూర్తిని పొందినారన్నారు. ఆడ పిల్లలంటే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. మార్పుకు నాంది నీలోనే ఉందని ఆలోచించేలా చేసిందని ఈ కార్యక్రమం కర్తవ్యాన్ని బోధించిందన్నారు. అలరించే.. ఆలోచించే.. షీరోస్ తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తెచ్చి ఈ కార్యక్రమం స్ఫూర్తిగా నిలిచిన ప్రవాస భారతీయులు జాస్తి శివరామ కృష్ణ టీంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సాంస్కృతిక కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కే. సుజావతి ఇ.మమత కవయిత్రి రూప రుక్మిణీ, నవీన్, బ్రాహ్మణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం బాగుండాలి

- వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎం.ప్రభావతి



నవతెలంగాణ-ముషీరాబాద్

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలని అప్పుడే మనిషి అనుకున్నది సాధించగలుగుతాడని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎం. ప్రభావతి అన్నారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు పి.వి. నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎం. ప్రభావతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ.. నడవండి నడిపించండి అనే లక్ష్యంతో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా క్లబ్బు నిర్వహించాలని సూచించారు. పచ్చదనానికి మారుపేరుగా ఉన్న సుందరయ్య పార్కులో వాకర్స్ శ్రేయస్సుకోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషన్ మాజీ అధ్యక్షులు వి.నాగభూషణం, 301 డిస్ట్రిక్ గవర్నర్ లింగప్రకాష్ గుప్తా, గవర్నర్ చీఫ్ కోఆర్డినేటర్ సంపత్ రెడ్డి, రీజనల్ గవర్నర్ ఎస్ మురళీకృష్ణ, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కె.వి.నిరంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ మనోహర్రెడ్డి, ఉపాధ్యక్షులు కళ్యాణి నాయక్, డాక్టర్ సునీల్, మాజీ అధ్యక్షులు ఎస్ రమేష్ రెడ్డి, శైలజా మోహన్, అంబటి శ్రీనివాస్ రెడ్డి, నిమ్మ ల రాజశేఖర్, సునీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'వెనకబడ్డ 57 కులాలకు 7 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'



- ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బైరి వెంకటేష్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో అన్ని రంగాల్లో వెనుకబడ్డ 57 కులాలకు 7 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బైరి వెంకటేష్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను దశాబ్దాల తరబడి మాల, మాదిగలే అనుభవిస్తున్నారని, అత్యంత వెనుకబడ్డ మిగిలిన 57 కులాలు దుర్భర దారిద్య జీవితాన్ని గడుపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఇటీవల ఒక సమావేశంలో 57 ఎంబీఎస్సీ కులాలు ఆశ పడాలేగానీ అత్యంతగా ఆశ పడరాదని తమ కులాలను కించపరిచే విధంగా మాట్లాడారని ఆయన తప్పుబట్టారు. 57 కులాలకు 7 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర నాయకులు బత్తుల పాండు, పోతుల మల్లేష్, నాగయ్య చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణను కిరాతకంగా చంపిన వారికి ఉరిశిక్ష విధించాలి'

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



కులాంతర వివాహం చేసుకున్న మాల సామాజిక వర్గానికి చెందిన దళిత యువకుడు వడ్లకొండ కృష్ణను సూర్యాపేట శివారులో కిరాతకంగా చంపిన హంతకులకు ఉరిశిక్ష విధించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి ప్రాం తానికి చెందిన గౌడ, శెట్టిబలిజ కులానికి చెందిన భార్గవి అనే యువతిని ప్రేమించి ప్రేమ వివాహం చేసుకున్న వడ్లకొండ కృష్ణను కుల వివక్షతతోనే భార్గవి బంధువులు, కొంత మంది హం తక ముఠా కలిసి రిపబ్లిక్ డే నాడు కలిసి హత్య చేశారని ఆయన ఆరోపించారు. హంతకులంతా కాంగ్రెస్ కార్యకర్తలే నన్నారు. కేసు వాపస్ తీసుకొని రాజీకి రాకపోతే హతుడి తండ్రి, చెల్లెలిని సైతం చంపేస్తామని హంతకులు బెది రిస్తున్నారని ఆరోపించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు వెంటనే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహం చేసుకున్న దంపతుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్ట ప్రకారం ప్రస్తుతం హతుడు వడ్లకొండ కృష్ణ తల్లితండ్రులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశా రు. హంతకులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుం బాన్ని రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెం కట్ రెడ్డిలు పరామర్శించాలని డిమాండ్ చేశారు. ఈ సమా వేశంలో ఐహెచ్ఆర్సీ అధ్యక్షులు, ప్రొఫెసర్ డా.వి.ఎల్. రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.రఘునందన్, మహిళా, శిశు విభాగం రాష్ట్ర చైర్ పర్సన్ శోభారాణి, డీబీఎస్ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి చూపిందని కాంగ్రెస్ బహదూర్‌పుర, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకూత్‌పుర నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పులిపాటి రాజేశ్ కుమార్, ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్, బోయ నగేష్, రవి రాజ్‌లు అన్నారు. పాతబస్తీ బహదూర్‌పుర, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకత్‌పుర నియోజకవర్గాల నుండి బషీర్‌బాగ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వలి ఉల్లాహ్ సమీర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై బడ్జెట్‌లో వివక్ష చుపిందన్నారు. దీంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పులిపాటి రాజేశ్ కుమార్, ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్, బోయ నగేష్, రవి రాజ్ తో పాటు పాత బస్తీ నాయకులూ భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ ఉద్యమం న్యాయమైంది'

- తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ ఉద్యమం ఎంతైతే న్యాయమైందో ఎస్సీ వర్గీకరణ ఉద్యమం అంతే న్యాయమైందని తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 'లక్ష డప్పులు-వేల గొంతుకలు' కార్యక్రమానికి తెలంగాణ ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. 7న జరిగే ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున మాదిగ సోదరులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పు విషయంలో సుప్రీంకోర్టుకు మాత్రమే ఆ క్రెడిట్ దక్కుతుందని, ఏ రాజకీయ పార్టీలకు ఆ క్రెడిట్ దక్కదన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లక్ష్యం ఏబీసీడీ వర్గీకరణ ఒక్కటే లక్ష్యమన్నారు. వర్గీకరణపై సీఎం ఎ.రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మాదిగలకు 10 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. దారులు వేరైనా తమ లక్ష్యం మాత్రం ఒకటేనని, ఈ నినాదం మేరకు విభేదాలను సైతం పక్కన పెట్టి వర్గీకరణ కోసం అందరం కలిసి పని చేస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో బీఆర్ఎస్ స్పష్టంగా ఉందన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆర్డినెన్స్ ద్వారా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీ ఎస్ నాయకులు పి.రమేష్ మాదిగ, ఈ.యాకయ్య మాదిగ, లక్ష్మి, చావ కృష్ణ మాదిగ, యాదన్న మాదిగ, అంజన్న మాదిగ, శాంతి కిరణ్, వెంకట్, సురేష్, చందు, సాయిలు, బాబు రావు, తిరుమలేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌బాగ్‌లో భారీ అగ్నిప్రమాదం

నవతెలంగాణ-ధూల్‌పేట్



గత అర్ధరాత్రి కిషన్ బాగ్‌లోని నాలుగంతస్తుల అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అందరూ గాఢనిద్రలో ఉండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ సంఘటన బహదూర్‌పుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్ బాగ్ చౌరస్తాలోని ఇండియాన్ పెట్రోల్ బంక్ పక్కన జావిద్ అహ్మద్ అనే వ్యక్తికి నాలుగంతస్తుల భవనం ఉంది. జావిద్, అతని సోదరుడు, తల్లిదండ్రులు ఒక్కో అంతస్తుల్లో నివాసముంటున్నారు. సెల్లార్‌లో యూసుఫైన్ హోల్సేల్ కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. కిరాణ షాపుకు సంబంధించిన సామాన్లు సెల్లార్‌లో పెద్దమొత్తంలో నిల్వ ఉంచారు. శనివారం అర్ధరాత్రి సెల్లార్‌లో మంటలు రేగాయి. పొగలు వ్యాపించడంతో గమనించిన కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. స్థానికులు కూడా స్పందించి పై అంతస్తుల్లో ఉన్న అందరినీ కిందికి దింపారు. చూస్తుండగానే పెద్దగా మంటలు వ్యాపించి అన్ని ఫ్లోర్లకు అంటుకున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న బహదూర్‌పుర పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. ఐదు ఫైరింజన్లతో ఆరుగంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, కార్పొరేటర్ హుసేనిపాషా, స్థానిక మజ్లిస్ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
సోమవారం | ఫిబ్రవరి 03, 2025 | www.navatelangana.com

ఏకే బేకర్స్ కేక్ ఫ్యాక్టరీ ప్రారంభించిన తూము



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద, ఏకే బేకర్స్ కేక్ ఫ్యాక్టరీని మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బేకరి యాజమాన్యాన్ని అభినందించారు. వినియోగదారులకు మంచి రుచితో కూడిన, నాణ్యమైన తాజా బేకరి పదార్థాలను అందిస్తూ.. ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు తూము నర్సింగ్ రావు, శ్రీనివాస్,చున్నూ పాషా, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జీహెచ్ఎంసీ వార్డ్ సభ్యులు రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా.. ఆదివారం పార్టీ కార్యాలయంలో బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవీందర్ రెడ్డి శ్రీనివాసులును శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-బాలానగర్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



- మొత్తం 454 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 42వేలకుపైగా విద్యార్థులు
- అవసరమైన ఏర్పాట్లు పూర్తి : డీఐఈవో ఒడ్డెన్న

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 22వ వరకు జరగనున్న పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు, ఈ సారి ప్రత్యేకంగా ఒక్కో కాలేజీకి రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు జిల్లా ఇంటర్ అధికారులు ప్రయివేట్ కాలేజీల యాజమాన్యాలకు ఆదేశించినప్పటికీ.. పెద్దగా పట్టించుకోలేదని సమాచారం. చాలా కాలేజీల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, ఇతర సమస్యలతో పాటు కొందరు ల్యాబ్స్‌లో ఏర్పాటు చేయలేదని తెలిసింది.

నాలుగు విడుతల్లో పరీక్షలు..

హైదరాబాద్ జిల్లాలో జనరల్ విభాగంలో 197, వొకేషనల్ విభాగంలో 57, మొత్తం 454 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇందులో జనరల్ 34,549, వొకేషనల్ 7952, మొత్తం 42,501 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. ఇప్పటికే పరీక్ష సామాగ్రిని ఆయా కేంద్రాలకు అందించారు. మొత్తం నాలుగు విడుతలుగా పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి విడుతలో జనరల్ 98, వొకేషనల్ 20 మొత్తం 118 పరీక్ష కేంద్రాలలో సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల పర్యవేక్షణకు అయిదు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పాటు అదనంగా 5గురు డీఈసీ సభ్యులు, కన్వీనర్ ఈ పరీక్షలను పర్యవేక్షిస్తారు. కాగా ఇప్పటికే అధ్యాపకులకు, విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పించారు. ప్రశ్నపత్రాలను అరగంట ముందుగా ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో ఉంచనుంది. అనంతరం సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జిల ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తారు. ఇదిలావుంటే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశామనీ, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతమైన వాతావరణంలో రాయడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశామని జిల్లా డీఈసీ కన్వీనర్, డీఐఈవో డి.ఒడ్డెన్న తెలియజేశారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతను మోసం చేసిన కేంద్ర సర్కారు : డీవైఎఫ్ఐ



- సిటీ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాల దహనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు నిధులు కేటాయించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ విమర్శించారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లిలో కేంద్ర ప్రభుత్వ ప్రజా, యువజన వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ.. బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ యువజన, విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ అని మండిపడ్డారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఈ బడ్జెట్‌ను పెట్టారనీ.. వారికి రాయితీలిస్తూ పేదప్రజలపై భారాలు మోపేవిధంగా తీర్చిదిద్దారన్నారు. ఉపాధి కల్పన కోసం నిర్దిష్టమైన చర్యలు ప్రతిపాదించలేదని, విద్య, వైద్యం, ఉద్యోగకల్పన రంగంలో ప్రతిపాదనలు లేవన్నారు. మోడీ సర్కారు హయంలో గడిచిన పదేండ్లుగా ఉద్యోగాల కల్పనే లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రొత్సహిస్తామని చెబుతున్నా.. కేంద్రం ఎలాంటి రాయితీలను ప్రకటించలేదన్నారు. మొత్తం బడ్జెట్‌లో నిరుద్యోగబమనే పదాన్నే ప్రస్తావించకపోవడం దురదృష్టకరమనీ, ఇది దేశ యువతను విస్మరించినట్టేనన్నారు. దేశంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి మిగతా రాష్ట్రాలకు మొండి చేయి చూపిందన్నారు. రాష్ట్ర విభజనలో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చకుండా నిధులివ్వకుండా రాష్ట్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్రానికి నిధులు రాబట్టంలో పూర్తిగా విఫలం చెందారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దామెర్ల హాష్మీబాబు, ఎండీ జావిద్, జిల్లా నాయకులు క్రాంతి, రాజయ్య, దేవేందర్, జావిద్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష

- టీపీసీసీ అధికార ప్రతినిధి

డా. సత్యం శ్రీరంగం



నవతెలంగాణ-బాలానగర్

కేంద్ర బడ్జెట్లో తెలంగాణ పట్ల వివక్ష మరోసారి స్పష్టంగా కనిపిస్తున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగాల కల్పన విషయంలో బడ్జెట్లో ప్రతిపాదనలు ఏవీ కనిపించలేదన్నారు. ఉపాధి కల్పన పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించలేదని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల మాట మూలన పడ్డట్టే అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా రైతన్నలు కనీస మద్దతు ధర కోసం కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ.. రైతులకు కనీస మద్దతు ధరపై ఊసే లేదని అన్నారు. బడ్జెట్ అంతా కార్పోరేట్ల అనుకూలం గానే ఉందని, ముఖ్యంగా తెలంగాణకు ప్రత్యేకంగా ఎక్కడా బడ్జెట్ కేటాయింపులు లేవని, 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ..తెలంగాణ అభివృద్ధిపై పైసా అదనంగా తీసుకురాకపోవడం దురదృష్టకరం అన్నారు. ప్రకటించిన 50,65,345 కోట్ల బడ్జెట్లో తెలంగాణ వాటా ఎంత? రాష్ట్ర బీజేపీ ఎంపీలు ప్రజలకు ఏం సమా ధానం చెబుతారు?..ప్రజల్లో ఎలా తిరుగుతారు? తన ప్రభుత్వం కూలిపోకుండా కాపాడుకునేందుకు మిత్రులని మచ్చిక చేసుకునేందుకే బీహార్, ఏపీ లాంటి రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తున్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడే.. దేశం అభివృద్ధి చెందినట్లు అనేది మోడీ ప్రభుత్వం గుర్తు ఎరుగకపోవడం బాధాకరం. గత పదేళ్ల మోడీ సర్కార్ పని తీరును చూసినట్లైతే ఇది కార్మిక, కర్షక, ప్రజా జాతి వ్యతిరేక ప్రభుత్వమని స్పష్టమవుతోందన్నారు.

బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి ఒక్క పైసా కూడా కేటాయించక పోవడం శోచనీయం :

ఎన్ఎస్‌యూఐ రాష్ట నాయకుడు గొల్ల జాన్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి పైసా కూడా కేటాయించలేదని ఆయన ఎన్ఎస్ యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని, ఇది బీహార్ బడ్జెట్‌లా ఉందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల ఇది సామాన్యులకు ఏమాత్రం లబ్దిలేదని ఆయన ఆరోపించా రు. తెలంగాణ రాష్ట్రం అడిగిన వాటికి సంబంధించి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయిం పులు జరగలేదని గొల్ల జాన్ మండిపడ్డారు. రాష్ట్రం నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణకు కేంద్రం నుంచి తెచ్చింది ఏమీ లేదన్నారు.



బస్తీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



- కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పాదయాత్ర నిర్వహిం చారు. ఈ నేపథ్యంలో బస్తీలలో స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ శ్రేణులు బండి రమేష్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భం గా బండి రమేష్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రధానంగా అనేక ఏండ్లుగా కూలీ పనులు చేసుకుం టూ అడ్డాలపై వివిధ పనులు చేసుకుంటూ భార్యా పిల్లల్ని పోషించుకుంటూ జీవనోపాధి పొందుతున్నా రన్నారు. స్థానికంగా అనేక ఏండ్లుగా శాశ్వత నివాసా లు లేకపోవడంతో అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని తెలిపారు. అదేవిధంగా ఎన్టీ ఆర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ బస్తీలలో తాగునీరు ప్రెషర్‌లో వస్తున్నందున నీటి సామర్థ్యాన్ని పెంచిలో ప్రెషర్ ను నివారించాలని కోరారు. ప్రధానంగా నేటి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని శ్రీశ్రీ నగర్ నుండి ప్రశాంతి నగర్ సోనీ కాంప్లెక్స్ వరకు కల్వర్టు , రాజీవ్ గాంధీ నగర్‌లో కమిటీ హాల్ పై నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ పాదయాత్రలో ఏ, బి బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు కూకట్ పల్లి మండల సీపీఐ కార్యదర్శి జి. కృష్ణ, శాఖ కార్యదర్శి కె. మనోచారి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



- చిన్నారులను ఆశీర్వదించిన దైవజ్ఞ శర్మ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలుగు వారి సంస్కృతిలో కూచిపూడి నృత్యానికి అత్యంత ప్రజాదరణ కలిగి ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. అంతరించిపోతున్న ఈ నృత్యకళను కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి తెలుగువారిపై ఉందని తెలిపారు. నగరంలోని బిర్లా భాస్కర్ ఆడిటోరియంలో, మేరా భారత్ మహాన్, నాలుగవ సీజన్‌లో భాగంగా, హైద ర్ నగర్, ఆదిత్య నగర్‌లోని రుహాని కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో... నిర్వహించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రుహాని కూచిపూడి నృత్య అకాడమీలోని చిన్నారులందరూ, తమ తమ అద్భుతమైన నృత్య ప్రదర్శన ప్రదర్శించారని కొనియా డారు. చిన్నారులు చేసిన నాట్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిందనడంలో సందేహం లేదన్నారు. చిన్న వయసులోనే ఆ చిన్నారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకోవడంతో పాటు, కూచిపూడి నృత్యాన్ని భావితరాలకు అందించడానికి తమ వంతు కృషి చేయాలనే సంకల్పం కలుగుతుందనడంలో సందేహమే లేదన్నారు. చిన్న తెలు గు కళలను భావితరాలకు అందించడానికి కృషి చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనలో బిందు మాధవి భావన, నీలా, లిఖిత, రిధి అనే చిన్నారులు తమ కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నిర్వాకులు సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి నరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆదివారం యాదగిరి గుట్ట, లక్ష్మి నరసింహ స్వామి వారిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యేకి వేద ఆశీర్వచనాలు అందించారు. ఆయనతో పాటు ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

మహా కుంభమేళాకు వెళ్లిన జగద్గిరిగుట్ట సగరులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం ప్రతినిధుల బృందం అయోధ్యలోని భవ్య శ్రీ రామ మందిర దర్శనంతో పాటు,మహా కుంభమేళా కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట సగర సంఘ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. మహా కుంభమేళతో పాటు అయోధ్యలోని భవ్య శ్రీ రామ మందిర దర్శనం, ప్రయా గ్రాజ్, గయా, బుద్ధగయ, వారణాసి, కాశీ నైమిశరణ్యం, చిత్రకూట్ తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకుని ఈనెల10వ తేదీన హైదరాబాద్‌కు చేరుకోనున్నట్టు సగర సంగం ప్రతినిధులు తెలియజేశారు. మహా కుంభమేళాకు బయలు దేరిన వారిలో జగద్గిరిగుట్ట సాగర సంగం స్టీరింగ్ కమిటీ చైర్మెన్ కె.పి.రాంసాగర్, వైస్ చైర్మెన్ మోడల రాములు సాగర్, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆస్కానీ శ్రీనివాస్ సాగర్, (కన్మనూరు)దేశెట్టి గోపాల్ సాగర్, గౌరవ సలహాదారులు ఆస్కానీ కొండయ్య సాగర్, సగర సంగం నాయకులు గౌని అంజనేయులు సాగర్, మోడల బాలరాజు సాగర్, ఎం.వెంకటరమణాసాగర్, తదితరులు తరలి వెళ్లినవారిలో ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దామోదర సంజీవయ్య కాలనీలోని ఆదివారం తెల్లవారుజామున జలగం సాయి సత్య శ్రీనివాస్(32) ఇంటిలో మంటలు చెలరేగాయి. దీంతో కాలిన గాయాలతో అక్కడిక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి ప్రాంతానికి చెందిన సత్య శ్రీనివాస్, భార్య, కుటుంబ సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌లో ఉంటున్నారని తెలుస్తోంది. కాగా మృతుడు బాలానగర్‌లోని దామోదర సంజీవయ్య కాలనీలో వంటరిగా ఉంటూ పటాన్ చేరు రుద్రారంలోని ఓ కెమికల్ పరిశ్రమలో పని చేస్తున్నట్టు సమాచారం. మృతుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేదా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం వల్ల చెలరేగి.. మంటలకు అగ్నికి ఆహుతయ్యాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-ఓయూ

ఇటీవల గుండె పోటుకు గురై కోలుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆదివారం మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ నెల 7వ తేదిన తన ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం నుంచి నిర్వహించే వేల గొంతుకలు, లక్ష డప్పులు కార్యక్రమానికి మద్దతు తెలపాలని మంద కృష్ణ మాదిగ ఈ సందర్భంగా పద్మారావు గౌడ్‌ను కోరారు. అందుకు పద్మారావు గౌడ్ సానుకూలంగా స్పందించి మద్దతును తెలిపారు. కార్యక్రమంలో అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి, యువ నేతలు కిషోర్ కుమార్, రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్దిదారులకు పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్‌నగర్ డివిజన్ ప్రతిభానగర్‌కు చెందిన తమ్మినేని శ్రీదేవికి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం లబ్దిదారులు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారిందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ ప్రజలను కోరారు.

రాజీనామా చేయండి లేదా.. హైదరాబాద్‌కు రాకండి



- డాక్టర్ కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట

సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.కోటా నీలిమ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి సచివాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణకు రావాలనుకుంటే కేంద్ర మంత్రులు ముందుగా తమ పదవులకు రాజీనామా చేయాలి, లేకపోతే తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు తెలంగాణ ప్రజలను తక్కువ అంచనా వేయడం కాంగ్రెస్ సహించదన్నారు. ఆదివారం కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షకు నిరసనగా టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని ఖండిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా టాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, టీపీసీసీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

బస్తీలో ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు

- ప్రభుత్వ భూములు కాపాడి ప్రహరీ ఏర్పాటు చేయాలి
- బస్తీ అధ్యక్షుడు ఆనంద్ కుమార్





ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్లు



ఆనంద్ కుమార్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ మహాత్మానగర్ బస్తీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి ఇండ్లు నిర్మిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములకు రక్షణగా ప్రహరీలు ఏర్పాటు చేయాలని మహాత్మా నగర్ బస్తీ అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ప్రజాపాలనలో ఫిర్యాదు చేశారు. ఆనంద్ కుమార్ బస్తీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు జోనల్ కమిషనర్‌కు ఇంతకు ముందు ఇచ్చిన అర్జీ కాపీని, కార్పొరేటర్ సిఎన్ రెడ్డి ఇచ్చిన లెటర్ కాపీని, రెవెన్యూ అధికారులు కూల్చివేసిన ఫోటోలతో పత్రికల్లో వచ్చిన కథనాల కాపీలను, తిరిగి నిర్మాణం చేస్తున్న ఫోటోలను అర్జీతో జతపరిచి ప్రజాపాలనలో ఫిర్యాదు చేశారు. స్పందించిన ప్రజా పాలన ఇన్‌చార్జి అధికారి డా.జి.చిన్నారెడ్డి (తెలంగాణ ప్లానింగ్ బోర్డ్ క్యాబినెట్ ర్యాంక్ అధికారి) వారు ఇచ్చిన అర్జీపై వెంటనే మహాత్మానగర్ బస్తీలో స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని, మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకొని ప్రహరీ ఏర్పాటు చేయాలని, అక్రమంగా ప్రభుత్వ భూములలో నిర్మించిన భవన యజమానులపై పోలీస్ కేసులు నమోదు చేయాలని, వెంటనే అన్ని విషయాలతో పరిశీలించి సర్వే చేసి పూర్తి నివేదిక ఆఫీసుకు పంపాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు.

ఫిర్యాదులో పొందుపరిచిన విషయాలు..

1996లో జనార్ధన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ బస్తీలో గుడిసెలు వేసుకొని ఉన్నవారిని, ఎకనామికల్ సర్వే జరిపి అర్హులైన పేదవారికి సర్వేనెంబర్ 127లో పట్టాలు ఇచ్చామని, అయితే కొంతమంది పట్టాలు నోటరీ చేసి అమ్మి వేసుకున్నారని, గతంలో ఉన్న నాయకులు మధ్యవర్తులుగా ఉండి స్థలం ఎక్కడ ఉన్నది కూడా తెలుసుకోకుండా కొంతమంది పేదవారి వద్ద తక్కువ రేటుకు పట్టాలు కొనుగోలు చేసి తిరిగి వేరే వారికి అమ్మారని పేర్కొన్నారు. పట్టాలు కొనుగోలు చేసిన వారు ఖాళీగా స్థలం ఎక్కడ ఉంటే అక్కడ ఇండ్లు నిర్మాణం చేపడుతున్నారు. అనేకసార్లు స్థానికులు, బస్తీ అధ్యక్షులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేయటం, వారు వచ్చి కూల్చివేయటం జరుగుతుందని, నాయకుల మాటలు నమ్మి పట్టాలు కొనుగోలు చేయవద్దని, ఇండ్ల నిర్మాణాలు చేపట్టవద్దని రెవిన్యూ అధికారులు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ తిరిగి ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. ఇప్పటికైనా ప్రజా పాలన ఇన్‌చార్జి అధికారి డా.జి.చిన్నారెడ్డి చొరవతో హైదరాబాద్ కలెక్టర్, సికింద్రాబాద్ ఆర్డీవో ఖైరతాబాద్ ఎమ్మార్వో చర్యలు తీసుకొని, బస్తీలో పర్యటించి, ప్రభుత్వ స్థలాలు గుర్తించి ప్రహరీ ఏర్పాటు చేస్తారని, నిజమైన పట్టాలు ఉన్న ఇండ్లు నిర్మించుకొనని పేదలను గుర్తించి వారికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని ఫిర్యాదు చేసిన అర్జీలో పేర్కొన్నారు.

గచ్చిబౌలిలో 'రన్ ఫర్ గర్ల్ చైల్డ్'





- హాజరైన మంత్రి శ్రీధర్ బాబు, బాలలత

నవతెలంగాణ-బంజారాహిల్స్

సేవా భారతి తెలంగాణ ఆధ్వర్యంలో బాలికల సాధికారత "కిషోరి వికాస్" కార్యక్రమం గురించి అవగాహన కల్పించడానికి రన్ ఫర్ గర్ల్ చైల్డ్ 9వ ఎడిషన్‌ను గచ్చిబౌలిలో ఆదివారం నిర్వహించారు. స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ రన్‌లో కార్పొరేటర్‌లు వారి కుటుంబాలు, సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, విద్యార్థులు ఇలా 11 వేలకు పైగా ఈ రన్‌లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, బాలలత హాజరైయ్యారు. ఈ సందర్భం గా ఆయన విజేతలకు మోమెంటోలను అందజేశారు. శాసనసభ్యులు ఆరికేపూడి గాంధీ, ఫ్రీడమ్ ఆయిల్ జి.యం చేతన్, గ్లోబల్ డెటా డైరెక్టర్ రాజీవ్ గుప్తా, పాల్టెక్ శ్యాంపాల్ రెడ్డిలు కూడా మంత్రితో కలిసి విజేతలను అభినందించారు. సమాజంలోని అభాగ్యుల వర్గాల అభ్యున్నతి కోసం సేవా భారతి తెలంగాణ చేస్తున్న కృషిని శ్రీధర్ బాబు ప్రశంసించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలలో ఆడపిల్లల సాధికారత కోసం ఉద్దేశించిన కార్యక్రమాల ప్రాముఖ్యతక గురించి కొనియాడారు. ఇప్పటికే సేవా భారతి 10,500 మంది బాలికల జీవితాలను ప్రభావితం చేసిందని, 2030 నాటికి లక్ష మంది లక్ష్యంతో ముందుకు సాగాలని శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. జాతీయ ప్రధాన కార్యదర్శి పరాగ్ అభయాంకర్, సేవాభారతి తెలంగాణ అధ్యక్షుడు దుర్గారెడ్డిలు మాట్లాడుతూ.. రన్ ఫర్ గర్ల్ చైల్డ్ వార్షిక కార్యక్రమం బాలికల అభ్యున్నతికి ఎంతో తోడ్పడుతుందన్నారు. ఫ్రీడమ్ ఆయిల్, గ్లోబల్డేటా, ఇన్ఫోసిస్, జీఈపీ, పాల్టెక్, బీడీఎల్, ఇన్నోవా సొల్యూషన్స్, ఫిల్టరేషన్ గ్రూప్, చబ్, యూఎస్టీ గ్లోబల్, డిష్ టీవీ, ఈసీఐఎల్, ఎస్పీఎంసీఐఎల్, పెర్స్పెక్టివ్, కోటివిటి, పెగా సిస్టమ్స్, చబ్, టెక్వేవ్, సైలోటెక్, గ్లోబల్లాజిక్, టెక్వేదిక, సత్యనారాయణ జ్యువెలర్స్, స్పాష్టిఐ, హ్యాపీ హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, హెచ్సీయూ, రన్నిట్ ప్రో, ఐబ్రిడ్జ్, ఆదాన్ టీవీ, టాల్ రేడియో, ఐబ్రిడ్జ్ సంస్థలు తమ వంతు కృషిగా సేవా భారతికి మద్దతునిచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సీఎస్ఆర్ హెడ్ వంశీపరం జ్యోతి, ఫిల్టరేషన్ గ్రూప్ సీఎఫ్ఓ వినోద్, యూఎస్టీ గ్లోబల్ సీఎస్ఆర్ హెడ్ తిరుమల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఓపెన్ జీమ్ ఏర్పాటు



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని విజయపురి కాలనీ వెల్ఫేర్‌లో ఫిజియోథెరపీ సెంటర్‌ను ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, విజయపురి కాలనీలోని మీ సేవా బిల్డింగ్ కమ్యూనిటీ హాల్-1లో ఉచిత ఆర్థోపెడిక్ కన్సల్టేషన్‌ల ప్రారంభోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. కాలనీ వాసులు డిప్యూటీ మేయర్ దృష్టికి రోడ్లు, వీధిలైట్లు, మొత్తం మౌలిక సదుపాయాలు వంటి కీలక సమస్యలు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉన్న మీ సేవా ప్రాంగణంలో బస్తీ దవాఖాన, సీనియర్ సిటిజన్ సెంటర్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదిస్తానని ఆమె సంఘానికి హామీ ఇచ్చారు. ఉచిత కన్సల్టేషన్ చొరవకు ఎంబీబీఎస్, ఆర్థో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎ. కృష్ణ మోహన్‌రావుకి ధన్యవదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానికులు హాజరై, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు కోరారు. హాజరైన ఫిజియోథెరపీ సెంటర్ కమిటీ సభ్యులు అధ్యక్షుడు వి.నాగేశ్వర్ రావు, వైస్ ప్రెసిడెంట కావూరి నరసింహారావు, కార్యదర్శి ఎస్.కె. జై సుందర్, కార్యనిర్వాహక సభ్యులు వామన్ రావు, డాక్టర్ ఇందిర, అర్జునరావు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచి తక్షణమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలుపాలని బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్ రావు ప్రశ్నించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కాటం నరసింహ యాదవ్ సభాధ్యక్షత బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్, మల్ల ఆనంద గౌడ్, సురేందర్ ముదిరాజ్, బీసీ దళ్ నాయకులు కుమారస్వామి తదితరులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వకుళాభరణం మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 ఏండ్లు పూర్తి అయిన ఇప్పటికీ బీసీలు ఓటర్లుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు హామీలు గుప్పించి, తర్వాత విస్మరిస్తున్నాయని అన్నారు. కరీంనగర్‌లో చేసిన డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ఇచ్చిన హామీలు అన్నిటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ కులగల సక్రమంగా సాగలేదని విమర్శించారు. బీసీ జనాభా ఆధారంగా 42 శాతానికి రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో బీసీల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్, వేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడు పీన్ చారి, ప్రొఫెసర్ బాల ప్రకాష్, విశ్వనాథ్ ముదిరాజ్,ఏ వెంకటేష్ వేదిక నగర అధ్యక్షుడు ఉపాధ్యక్షులు, బి.రాజేష్ యాదవ్ సంఘం నగరం అధ్యక్షుడు, టి.శ్రీరాములు సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శులు రేణుక, బి.వేణుమాధవ్ దావా శ్రీనివాస్ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జికల్ సిస్టం వినియోగంపై వర్క్ షాప్



నవతెలంగాణ-బంజారాహిల్స్

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో శని, ఆదివారం జరిగిన రెండు రోజుల రొబోటిక్ సర్జికల్ సిస్టం వినియోగంపై ప్రత్యేక వర్క్ షాపు బంజారాహిల్స్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహించారు. రెండు రోజుల పాటూ నిర్వహించిని ఈ వర్క్ షాపుకి ముఖ్య అతిథులుగా సంస్థ చైర్మెన్ నందమూరి బాలకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు, రాఘవరావు హాజరైయ్యారు. వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రొబోటిక్ సర్జరీ సిస్టంను హాస్పిటల్‌లో 2017లోనే అందుబాటులోనికి తీసుకొని వచ్చామని వివరించారు. ఈ వ్యవస్థను ఉపయోగించి సుమారు 800కి పైగా శస్త్ర చికిత్సలను చేయడం ఒక రికార్డని తెలిపారు. 31 జనవరి నాడు అత్యాధునిక 4వ జనరేషన్ డావిన్సి రాబొటిక్ వ్యవస్థను హాస్పిటల్ అందుబాటులోనికి తీసుకొని వచ్చామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజీ విభాగపు అధిపతి డా.టియస్ రావ్, మార్గదర్శకత్వలో యూరో ఆంకాలజీ విభాగపు అధిపతి డా.రాకేష్ శర్మ నేతృత్వంలోని నిష్ణాతులైన శస్త్ర చికిత్స నిపుణులు అత్యాధునిక రోబోటిక్ సర్జకిల్ సిస్టంను ఉపయోగించి ఎలాంటి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయవచ్చో ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ శిక్షణ ఇవ్వడంతో పాటు యూరో ఆంకాలజీపై అవగాహన తప్పనిసరి అన్నారు. రొబోటిక్ సర్జికల్ వ్యవస్థను ఉపయోగించి ప్రొస్టటెక్టమీల నుంచి లాప్రొస్కోపిక్ సిస్టెటమీస్‌లతో పాటూ ఖచ్చితత్వంతో కూడిన నెఫ్రెక్టమీస్ వరకూ పలు రకములైన శస్త్ర చికిత్సలను డా.రాకేష్ శర్మ సీనియర్ యూరో ఆంకాలజిస్టు యూరో ఆంకాలజీ విభాగాధిపతి నేతృత్వంలో డా.శ్రీవత్స నరసింహ, డా.అశ్విన్ గిరిధర్, డా.అమిరేష్ మోహన్‌లతో కూడి శస్త్ర చికిత్స నిపుణుల బృందం వివరించాయి. ఈ కార్యక్రమంలో సీఈవో డా.కె కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ డా.టియస్ రావు, అసోసియేట్ డైరెక్టర్, అకడమిక్స్, డా కల్పనా రఘునాథ్, మెడికల్ సూపర్నింటెండెంట్, డా ఫణి కోటేశ్వరరావు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్యులు, హాస్పిటల్ వైద్యులు, వైద్యేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దమ్మగుడి టెంపుల్ వెనకాల, శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎక్సైజ్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ టీం కలిసి ప్రత్యేక వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఇద్దరు నిందితులు జూపిటర్ మోటార్ సైకిల్‌పై వెళ్తాండగా వారిని ఆపి చెక్ చేశారు. వాహనంలో ఒక కేజీ 700 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్టు గుర్తించి వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో ఏ వన్ నిందితుడు అజేంద్ర చౌదరి బాచుపల్లి నివాసి, ఏ టు నిందితుడు ఫిరోజ్ హుస్సేన్ ఇస్నాపూర్ సంగారెడ్డి ప్రస్తుత నివాసం (ఇతని స్వస్థలం అస్సాం రాష్ట్రంగా గుర్తించారు). ఏ త్రీ నిందితురాలు రేణు దేవి పటాన్‌చెరు నివాసి పరారీలో ఉన్నట్టు గుర్తించారు. త్వరలో ఆమెను కూడా అరెస్టు చేస్తామని, వీరు గంజాయిని ఎక్కడినుండి తెచ్చారు, ఎప్పటినుండి వ్యాపారం చేస్తున్నారు, హైదరాబాద్ సిటీలో ఎంతమందికి సప్లై చేశారు అనే కోణంలో విచారిస్తున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు మీడియాకు వెల్లడించారు.

గిరిజన విద్యార్థులకు ఆంగ్ల భాష శిక్షణ ముగింపు

- గిరిజన ప్రాంతాల్లో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి
- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం



నవతెలంగాణ-ఓయూ

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ (ELTC) తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున 66 మంది గిరిజన విద్యార్థులకు ఇంగ్లీష్ లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పైన ట్రైనింగ్ ఇస్తుంది. ఆ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమం ఆదివారం ఓయూలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఆర్ఎస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సింగరేణి కాలరీస్ లిమిటెడ్ ఎన్.బలరాం హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గురువులను గుర్తు చేసుకుని స్కూల్ నుండి యూనివర్సిటీ అధ్యాపకుల వరకు వారి వలన నేను నేడు ఈ స్థాయికి రావడానికి అందరూ ఎంతో సహకరించారని, గురువులను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. ఇంగ్లీష్ భాషను అందరూ కష్టపడి నేర్చుకుంటేనే తద్వారా భవిష్యత్తులో అనేక అవకాశాలను అందుపుచ్చుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యాభివృద్ధికి లైబ్రరీల ఏర్పాటుకు తన సింగరేణి సంస్థ తరపున ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధమని తెలిపారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఏర్పాటుకు కూడా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓయూతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలకు కూడా విద్యాభివృద్ధిని విద్యార్థికి తన వంతు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొ. కాసిం, డైరెక్టర్ ప్రొ.సవిన్ సౌదా, ప్రో.విజయ, ప్రొ. పరిమళా కులకర్ని ప్రొ. సవీన్ సౌడ, డాక్టర్ క్రిస్టోఫర్, డాక్టర్ మాధవి డాక్టర్ రాజు నాయక్, (ELTC) స్టాఫ్, గిరిజన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నిజాం కాలేజ్‌లో మందకృష్ణ మాదిగకు సన్మానం



నవతెలంగాణ-ఓయూ

ఇటీవల భారత కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పద్మశ్రీ అవార్డు జాబితాలోకి మందకృష్ణకి చోటు దక్కడం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ నేడు నిజాం కాలేజ్‌లో ఆత్మీయ సన్మానాన్ని ఓయూ మాదిగ అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత పోస్టర్స్‌ను ఆదివారం వారు ఓయూ 100 ఏండ్ల పైలాన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకులు డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ.. ఓయూలో అత్యున్నత పదవులు పొందిన మాదిగ ఆచార్యులకు సన్మానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఎస్వీ రత్నం, డాక్టర్ దుబ్బ రంజిత్, డాక్టర్ బిక్షపతి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ కే వెంకటేశ్వర్లు, డాక్టర్ తాళ్ల అజయ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలి

- ఉప్పరి నారాయణ ముదిరాజ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఎ మార్చుతమన్నా హామీని నెరవేర్చుకోవాలని చిన్న రాములు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చైతన్యయాత్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఎ లోకి మార్చాలని అది జరగందుకు ప్రస్తుతం తమ జాతికి ఆర్థిక, సామాజిక రాజకీయ వెనకబాట జరుగుతుందని తెలిపారు. తమ జాతిని మేల్కొపుతూ అన్ని ముదిరాజ్ సంఘాలనూ ఏకతాటిపైకి తీసుకొని యాత్ర చేస్తున్నామని దానికి యువ ముదిరాజుల తోడ్పాటు ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో బోయిని చంద్రశేఖర్, కోట్ల పుష్పలత, లావణ్య, పండుగ రేణుక, కృష్ణ, తాయప్ప, అశోక్ సంఘీభావం తెలుపుతూ వచ్చిన కుల పెద్దలు కుమార్, శ్రీనివాస్, లింగం, రాజేందర్, శ్రీహరి, నరసింహ, రాకేష్ శివ కుమార్, శివ,జగదీష్, గణేష్, కృష్ణ, జగన్, రమేష్, మహేష్ ముదిరాజు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం



- ప్రధానిగా బీసీ ఉన్న బీసీలకు ఒరిగిందేమీ లేదు
- జాజుల లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశ జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి బీసీలకు మొండి చేయి చూపడాన్ని బీసీ విద్యార్థి సంఘం నిరసిస్తూ బడ్జెట్ ప్రతులను చించి ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ.. మొత్తం దేశ బడ్జెట్ 50,65,345 రూ.లక్షల కోట్ల బడ్జెట్లో బీసీలకు కేవలం 2,500 కోట్లు కేటాయించడం సిగ్గుచేటని, బీజేపీ ప్రభుత్వం బీసీలను అవమానపరిచిందని, ఈ సందర్భంగా ఆయన కేంద్రప్రభుత్వ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 శాతం ఉన్న బీసీలకు ఈ బడ్జెట్‌తో ఒక్కో మనిషికి ఒక బిస్కెట్ ప్యాకెట్ కూడా రాదన్నారు. బీసీ ప్రధానిగా ఉన్న బీసీలకు ఒరిగిందేమి లేదన్నారు. బడ్జెట్‌ను సవరించైనా సరే బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షులు నామ సైదులు, టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్, ఓయూ జేఏసీ నాయకులు సురేష్‌నాయక్, యాకునాయక్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

దేశ సామాజిక పురోగతి, అభివృద్ధికి యూసీసీ నైతిక ఆవశ్యకత



- మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు

నవతెలంగాణ-ఓయూ

ఉజ్వల భవిష్యత్తు వైపు పయనిస్తున్న భారత దేశ సామాజిక పురోగతి, అభివృద్ధికి ఉమ్మడి పౌర స్మృతి నైతిక ఆవశ్యకత ఉన్నదని, ఉత్తరాఖండ్ రాష్ట్రం దేశంలో మొదటి రాష్ట్రంగా అమలు చేస్తుందని, తెలంగాణ రాష్ట్రం కూడా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసి దేశంలో రెండవ రాష్ట్రంగా నిలువాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్ రావు ఆకాంక్షించారు. హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, పీజీఆర్ఆర్సిఈడీ, సెనెటరీ సెమినార్ హాల్‌లో ఆదివారం జరిగిన "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" ప్రారంభసభలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్ రావు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ ముఖ్యతిథులుగా, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. బట్టు సత్యనారాయణ గౌరవ అతిథిగా, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు, ప్రముఖ విద్యావేత్తలు ప్రొ. సి. విష్ణు వర్ధన్ రెడ్డి, కటకం మధుకర్, సామాజికవేత్త కొండా లక్ష్మీకాంత్ రెడ్డి హాజరైయ్యారు. విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డా.పుట్ట పాండురంగయ్య స్వాగతం పలుకగా, అధ్యక్షులు డా. జి. హరిచరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిహెచ్. విద్యాసాగర్ రావు విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. అన్ని మత సమాజాలకు వర్తించే విధంగా మొత్తం దేశానికి ఒకే చట్టంగా యూనిఫామ్ సివిల్ కోడ్ రూపొందించబడిందని, ఇది జాతీయ సమైక్యత, లౌకికవాదాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత దేశం దూసుకపోతుందని, అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్నిరంగాల్లో ప్రపంచ అగ్ర దేశాలతో పోటీపడుతుందని ఇది ప్రధాని మోదీ విజయం అని తెలిపారు. డా. కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉన్నత విద్యావంతులు విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ స్వచ్చంద సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. విక్షిత్ భారత్ 2047 పేరుతో దేశంలో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, సాంకేతికత, స్థిరమైన అభివృద్ధిపై దృష్టి సారించి సమగ్ర విధానం ద్వారా వివిధ సామాజిక-ఆర్థిక సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా 100వ స్వాతంత్ర్య సంవత్సరం, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడం ప్రధాని మోదీ దార్శనికతని తెలిపారు. డా. జి.హరిచరణ్ మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలన, నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణను బలిపీఠం చేయడానికి, సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్‌ను వైద్యులు, ప్రొఫెసర్‌లు, మేధావులతో ఏర్పాటు చేశామని, దీని ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస్ రెడ్డి, డా. బండి సాయన్న, కార్యనిర్వాహక కార్యదర్శులు డా. ఉమా శంకర్, ఎన్. విజేందర్ రెడ్డి, డా.వీణ దిగ్గీకర్, ప్రొ. జి. విజయ చరణ్, ఔటా అధ్యక్షుడు ప్రొ. మనోహర్ పాల్గొన్నారు.

చియా సీడ్స్‌తో ఆరోగ్య ప్రయోజనాలు...

నలుపు, తెలుపు రంగుల్లో మార్కెట్లో లభించే చియా సీడ్స్ వల్ల అధిక బరువు తగ్గే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అధిక బరువుతో బాధపడేవారు చియా సీడ్స్‌ని ఆహారంలో భాగం చేసుకుంటే బరువు తగ్గుతారని పలు పరిశోధనలు వెల్లడించాయి.

- చియా సీడ్స్‌ని నేరుగా తీసుకోకూడదు. వాటిని నీటిలో నానబెట్టాలి. అలా నానబెట్టిన వాటిని పెరుగులోనూ, సలాడ్స్‌లోనూ వేసుకుని తీసుకోవచ్చు.
- నానబెట్టిన వాటిని ఒక గ్లాసు నీటిలో వేసుకుని అందులో కొద్దిగా నిమ్మరసం, ఉప్పు లేదా పంచదార, గ్యాస్ వాటర్‌ని పోసుకుని తీసుకోవచ్చు.
- చియా సీడ్స్ వల్ల బరువు మాత్రమే కాదు. వేసవి తాపం నుంచి కూడా ఉపశమనం పొందచ్చు.
- చియా సీడ్స్‌లో ప్రొటీన్లు, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల ఇవి జీర్ణక్రియకు ఎంతో దోహదపడతాయి. మీ ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎంతో సహాయపడతాయి.







మరి కొద్ది రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కొంతమంది పిల్లలు పాఠాలను గంటల తరబడి చదువుతారు. కష్టపడతారు. కానీ కొద్ది రోజులకే వాటిని మర్చిపోతుంటారు. దీంతో విలువైన సమయమెంతో వృథా అవుతుంది. అంతేకాదు పరీక్షలు దగ్గర పడుతుంటే విపరీతమైన ఒత్తిడికీ గురవుతుంటారు. మరీ ముఖ్యంగా అమ్మాయిల్లో ఈ ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. అందుకే నిపుణుల సూచనలు పాటిస్తే ఇలాంటి ఇబ్బందుల నుంచి బయటపడొచ్చు. అంతేకాదు జ్ఞాపకశక్తినీ చక్కగా మెరుగుపరుచుకోవచ్చు!

పరీక్షల ఒత్తిడికి దూరంగా..

విషయం అర్థం చేసుకోకుండా బట్టీ పట్టే విషయాలు తాత్కాలికంగా మాత్రమే గుర్తుంటాయి. అలా కాకుండా పాఠ్యాంశాలపై ఆసక్తి పెంచుకుని, అవగాహన చేసుకుని చదివితే మర్చిపోయే ప్రమాదం ఉండదు. విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంచుకోవాలంటే ఏకాగ్రత ఎంతో అవసరం. చదివే విషయాలు అర్థమవ్వాలన్నా, ఎక్కువ కాలంపాటు గుర్తుండాలన్నా దీన్ని మించిన సాధనం లేదు. కాబట్టి పాఠ్య పుస్తకాలు చదివేటప్పుడు ఎలాంటి అవాంతరాలూ, అవరోధాలూ లేకుండా చూసుకోవాలి. టీవీ, సెల్‌ఫోన్, శబ్దాలు, కుటుంబ సభ్యుల సంభాషణలు.. ఇలాంటివేమీ మీ దృష్టిని చెదిరేలా చేయకుండా చూసుకోవాలి. నిర్ణీత సమయంపాటు ఏకాగ్రతతో చదివిన పాఠ్యాంశాలు ఎక్కువకాలం గుర్తుంటాయి.

చక్కని ప్రణాళికతో...

ఏరోజు ఏయే సబ్జెక్టులను చదవాలనేది స్పష్టంగా టైమ్ టేబుల్ వేసుకోవాలి. దాన్ని కంటికి ఎదురుగా కనిపించేలా గోడకు అంటించుకోవాలి. ఇలా చక్కని ప్రణాళిక ప్రకారం చేయడం వల్ల ఇప్పటివరకూ ఏం చదివాం, ఇకపై ఏం చదవాలి.. అన్న విషయాలపై స్పష్టత ఏర్పడుతుంది. ఎలాంటి గందరగోళానికీ ఆస్కారం ఉండదు. ఫలితంగా ఒత్తిడికి గురికాకుండా ఉంటారు. నిదానంగా, అర్థం చేసుకుంటూ చదివిన విషయాలు ఎక్కువకాలం గుర్తుంటాయి.

మననం చేసుకోవాలి

సాధారణంగా ఒకే ప్రదేశంలో కూర్చుని చదివే అలవాటు చాలామందికి ఉంటుంది. అప్పుడప్పుడూ ఆ చోటును మారిస్తే బాగా సన్నద్ధత సాధ్యమవుతుంది. సాయంత్రం చదవడానికి కూర్చున్నప్పుడు ఉదయం చదివిన పాఠ్యాంశాలను ఒకసారి మననం చేసుకోవాలి. అలాగే ఉదయం చదవడానికి సిద్ధమైనప్పుడు రాత్రి చదివిన అంశాలను ఒకసారి గుర్తుచేసుకోవాలి. ఇలా పునశ్చరణ చేసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగవుతుంది.

దృశ్యరూపం

చదివిన అంశాన్ని ఎక్కువ కాలంపాటు గుర్తుపెట్టుకోవాలంటే దృశ్యరూపంలో ఊహించుకోవటం అవసరం. పాఠ్యపుస్తకాల్లోని ఫొటోగ్రాఫ్‌లు, చార్టులు, గ్రాఫ్‌లను శ్రద్ధగా పరిశీలిస్తే వాటిల్లోని అంశాలు ఎక్కువకాలంపాటు గుర్తుంటాయి. చదివిన సమాచారాన్ని నోట్ పుస్తకంలో చార్ట్‌లా వేసుకున్నా త్వరగా మర్చిపోలేరు. అలాగే ఒక్కోరకమైన సమాచారాన్ని రాయడానికి ఒక్కోరంగు పెన్ను వాడటం వల్ల ఆయా విషయాలు ఎక్కువ కాలం గుర్తుండిపోతాయి.

విశ్లేషించాలి

తెలియని విషయాన్ని గురించి చదువుతున్నప్పుడు ఉన్నది ఉన్నట్టుగా చదివేయకుండా కాస్త సమయం తీసుకోవాలి. దాన్ని అప్పటివరకు తెలిసిన సమాచారంతో అనుసంధానం చేసి విశ్లేషించాలి. కొత్తగా చదివిన అంశాలను పాత జ్ఞాపకాలతో కలిపి వాటి మధ్య ఉన్న సంబంధాన్ని గురించి తెలుసుకోవాలి. ఇలా చేయడం వల్ల కొత్తగా చదివిన విషయాన్ని త్వరగా మర్చిపోలేరు.

తగినంత నిద్ర

ఉత్సాహంగా నేర్చుకోవడానికీ, జ్ఞాపకశక్తికీ తగినంత నిద్ర, విశ్రాంతి తోడ్పడతాయని పరిశోధనలు చెబుతున్నాయి. కొత్త విషయాన్ని నేర్చుకున్న తర్వాత కాసేపు కునుకు తీస్తే వేగంగా నేర్చుకోడంతో పాటు బాగా జ్ఞాపకం ఉండే అవకాశం ఉందంటున్నాయి పరిశోధనలు. కాబట్టి పాఠ్యాంశాలు నేర్చుకున్న తర్వాత ఆ రాత్రి బాగా నిద్రపోతే అవి చక్కగా గుర్తుండిపోతాయి!

నిర్ణీత సమయం

ఎక్కువ సమాచారాన్ని తక్కువ సమయంలో చదివేయాలని తొందరపడకూడదు. కొంతమంది విద్యార్థులు పరీక్షల ముందు హడావిడిగా ఎక్కువ పాఠాలను చదివేయాలనుకుంటారు. ఇలా చేయడం వల్ల చదివింది ఎక్కువకాలం గుర్తుండదు. ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని కేటాయించుకుని పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలి.



నోట్స్ రాసుకోండి

పాఠంలోని ముఖ్యాంశాలతో సొంతంగా నోట్సు రాసుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. పరీక్షల ముందు వీటిని ఒకసారి చదువుకుంటే పునశ్చరణ సులువుగా, వేగంగా పూర్తవుతుంది. సమయం వృథా కాదు. అలాగే పాఠాలను వాటికి ఉండే సామీప్యత ఆధారంగా విభజించుకుని చదివితే సులువుగా అర్థమవుతాయి. అంతేకాదు ఎక్కువకాలం పాటు గుర్తుంటాయి!

కీలక పదం

నిర్ణీత కీలక పదాన్ని గుర్తుపెట్టుకోవడం ద్వారా దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్నీ స్ఫురణలోకి తెచ్చుకోవచ్చు. ఉదాహరణకు 'ఆసియా, ఆఫ్రికాల్లో నివసించే అతి పెద్ద జంతువు ఏనుగు' అనే వాక్యం ఉందనుకోండి. ఇక్కడ ఏనుగు అనే పదాన్ని గుర్తుపెట్టుకుంటే చాలు. ఆ తర్వాత ఈ మాటకు అనుబంధంగా ఉన్న వాక్యం కూడా మీకు వెంటనే గుర్తుకొస్తుంది.

పైకి చదవాలి

చాలామంది విద్యార్థులు నిశ్శబ్దంగానే చదువుతుంటారు. ఇలా చేయడం వల్ల ఒకోసారి ఇతర ఆలోచనలూ మనసులోకి వస్తుంటాయి. పైకి చదవడం వల్ల అనవసరమైన ఆలోచనలు ఆగిపోయి, చదివిన అంశం ఎక్కువకాలం పాటు గుర్తుంటుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.



వివరించి చెప్పాలి

ఏ విషయమైనా అర్థమైనట్టు ఉన్నా అది ఇతరులకు వివరించి చెప్పగలిగినప్పుడే దానిపై పట్టు వస్తుంది. కొత్తగా నేర్చుకున్న అంశాన్ని స్నేహితులు లేదా సందేహాలున్న తోటి విద్యార్థులకు వివరించి చెప్పాలి. అప్పుడది బాగా అవగాహన అవుతుంది. ఆ అంశంపై మరింత స్పష్టత ఏర్పడుతుంది. ఫలితంగా గుర్తుండిపోతుంది. ఏ రోజు పాఠాలు ఆరోజు కాకుండా అన్నీ ఒకేరోజు హడావిడిగా చదివేస్తుంటారా? ఇలా చేస్తే చదివిన పాఠాలు ఎక్కువకాలం గుర్తుండవు! ■

నాలుగు కోట్ల మందికే బడ్జెట్ ప్రయోజనాలు

(మొదటిపేజీ తరువాయి)

లేదు. పేదలు, మధ్య తరగతి ప్రజలతో పాటు అధిక జీతాలు తెచ్చుకుంటున్న భారతీయుల రక్తాన్ని విపరీతమైన, తిరోగమన పన్ను వ్యవస్థ పీల్చి పిప్పి చేస్తోందని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ ఏం కావాలి?

అరకొర మినహాయింపులతో ఏం లాభం?

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. పేద, మధ్య తరగతి కుటుంబం వినియోగ వస్తువులపై పెట్టే ప్రతి రూ.10,000 ఖర్చుకు ప్రభుత్వానికి రూ.1,800 చెల్లించాల్సి ఉంటుంది. అయితే పన్ను రేటు తగ్గించామని చెప్పి ఇందులో రూ.300 రూపాయలు వాపసు చేస్తే దానితో ఏం కొనగలం? బహుశా చిన్నారుల కోసం కొన్ని గుడ్లు కొనుగోలు చేయగలమేమో. అధిక జీతం పొందుతున్న వ్యక్తి రూ.10 లక్షలు పెట్టి కారు కొన్నాడని అనుకుందాం. జీఎస్టీ రేటును 28 శాతం నుండి 22 శాతానికి తగ్గిస్తే ఓ రూ.60,000 ఆదా అవుతాయి. కానీ దానితో అతను తన కుమార్తెకు ఓ ఐప్యాడ్ మాత్రమే కొనగలడు.

లెక్క తేలింది..

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 3.1 శాతం మంది అంటే 16 లక్షల మంది వివిధ కారణాల వల్ల తమ వివరాలను చెప్పలేదని వివరించారు. రాష్ట్ర మొత్తం జనాభా 3.70 కోట్లని చెప్పారు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందనీ, సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా అధికారులు విజయవంతంగా పూర్తి చేశారని అభినందించారు. ఈ నెల 4న కులగణన నివేదికను రాష్ట్ర క్యాబినెట్ ముందు పెడతామనీ, అందులో చర్చించిన అనంతరం అదేరోజు అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు. సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సర్వే ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని 3,54,77,554 మంది వివరాలను ఈ సర్వే ద్వారా నమోదు చేశారు. మొత్తంగా 1,12,15,131 కుటుంబాల వివరాలు సర్వేలో ఉన్నాయి.
- కులగణన సర్వేలో పాల్గొన్న మొత్తం జనాభా 96.90 శాతం, సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం.
- సర్వే ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 17.43 శాతం, ఎస్టీ జనాభా 10.45 శాతం, బీసీ జనాభా 46.25 శాతం.
- ముస్లిం మైనారిటీల్లో బీసీ జనాభా 10.08 శాతం. ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా 56.33 శాతం.
- రాష్ట్రంలో ఓసీ జనాభా 15.79 శాతం. ముస్లిం మైనారిటీల్లో ఓసీ జనాభా 2.48 శాతం.
- రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీ జనాభా 12.56 శాతం.

4న ప్రత్యేక అసెంబ్లీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరచనుంది. ఈ నెల 4న ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు ఆదేశాలిచ్చింది. అదే రోజు అసెంబ్లీకి ముందుగా ప్రత్యేక మంత్రివర్గ సమావేశం జరగనుంది. అందులో కులగణన నివేదికపై చర్చించి ఆమోదం పొందిన తర్వాత అసెంబ్లీలో కులగణన నివేదికను ప్రవేశపెడతారు. సమగ్ర ఇంటింటి కులగణన సర్వే నివేదికను ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోని క్యాబినెట్ సబ్‌కమిటీకి ప్రణాళిక శాఖ సమర్పించిన సంగతి తెలిసిందే. సోమవారం ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య న్యాయ కమిషన్ తమ నివేదికను క్యాబినెట్ సబ్‌కమిటీకి అందజేస్తారు. ఈ మేరకు అధికారికంగా సన్నాహాలు జరుగుతున్నాయి.

ట్రేడ్ వార్ ?

వాషింగ్టన్ : టారీఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై కెనడా, మెక్సికో దేశాలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. అమెరికాకు తగిన గుణపాఠం చెప్తామంటున్నాయి. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని తెగేసి చెప్తున్నాయి. అందుకు అనుగుణంగా ప్రతీకార చర్యలకు సిద్ధమయ్యాయి. అమెరికాకు పొరుగు దేశాలైన కెనడా, మెక్సికో దిగుమతుల మీద 25 శాతం సుంకం విధించే ఆర్డర్లపై ట్రంప్ సంతకం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ నిర్ణయంపై ఈ రెండు దేశాలూ ఆగ్రహంతో ఉన్నాయి.

అమెరికా దిగుమతులపై సుంకం విధించేందుకు కెనడా సిద్ధం

ఇందులో భాగంగా అమెరికా దితుమతులపై సుంకం విధించేందుకు కెనడా సిద్ధమైంది. 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తునట్టు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. "155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతు లపై 25 శాతం టారీఫ్‌లు విధిస్తున్నాం. వాషింగ్టన్ చర్యలకు ఇది కెనడా ప్రతిస్పందన. ఇందులో 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై విధించే సుంకం మంగళవారం నుంచి అమల్లోకి వస్తుంది. మిగిలినవి 21 రోజుల తర్వాత అమలవుతాయి. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని అధ్యక్షుడు ట్రంప్ అనుకుంటే.. మాతో భాగస్వామ్యాన్ని కోరుకో వాలి. అదే వారికి మంచిది" అని ట్రూడో వివరించారు.

మేమూ టారీఫ్‌లు విధిస్తాం : మెక్సికో

మెక్సికో సైతం కెనడా బాటలోనే నడిచింది. తాము కూడా అమెరికా దిగుమతులపై టారీఫ్‌లు విధిస్తామని ఆ దేశ అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ హెచ్చరించారు. "డ్రగ్స్ అక్రమ రవాణా గ్రూపులతో తమ ప్రభుత్వానికి సంబంధాలున్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఖండిస్తున్నాం. మా ప్రభుత్వం నాలుగు నెలల్లో 20 మిలియన్ డోస్ ఫెంటనిల్ సహా 40 టన్నులకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. పదివేల మందిని అరెస్టు చేసింది. మెక్సికో పొరుగు దేశాలతో సహకారం కోరుకుంటుంది తప్ప.. ఘర్షణ కాదు. డ్రగ్స్‌ను అరికట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించుకుంటే.. అందుకు కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. టారిఫ్‌లు విధిస్తే సమస్యలు పరిష్కారం కావు. మెక్సికన్ల ప్రయోజనాలకు అనుగుణంగా మేము చర్యలు తీసుకుంటాం. ప్లాన్ బీని అమలు చేయాలని ఆర్థిక కార్యదర్శిని ఆదేశిస్తున్నా" అని షేన్‌బామ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

'ట్రంప్ తీరుతో అమెరికాకే నష్టం'

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ట్రంప్ సర్కారు అనేక వివాదాస్పద నిర్ణయాలను తీసుకుంటున్న విషయం తెలిసిందే. తమ దేశంలో ఉన్న అక్రమవలసదారులను బయటకు పంపేస్తామని ఇతర ప్రపంచ దేశాల ప్రజలలో భయాందోళనలు కలిగించిన ఆయన.. ఇప్పుడు టారీఫ్‌ల విషయంలో పొరుగు దేశాలతో కయ్యానికి కాలు దువ్వుతున్నారని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అంటూ అధికారంలోకి వచ్చిన ఆయన.. దూకుడు స్వభావంతో వెళ్తూ పొరుగుదేశాలతో శత్రుత్వాన్ని పెంచుకుంటున్నారనీ, ఈ విధానం అమెరికాకే చేటు తెస్తుందని వివరిస్తున్నారు.

రాందేవ్ బాబాకు కేరళ హైకోర్టు షాక్

న్యూఢిల్లీ : పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకులు, యోగా గురువు రాందేవ్ బాబాకు కేరళ హైకోర్టు షాకిచ్చింది. ఆయనతో పాటు, ఆ సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణలకు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. పతంజలికి చెందిన దివ్య ఫార్మసీ వైద్యవిధానాలపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు, తప్పుడు ప్రచారాల నేపథ్యంలో కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. దీనిపై పాలక్కాడ్ జిల్లా కోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో విచారణకు ఫిబ్రవరి 1న హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించగా వారిద్దరూ హాజరు కాలేదు. దీంతో బాబా రాందేవ్, బాలకృష్ణలపై కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఫిబ్రవరి 15న తిరిగి విచారణ చేపట్టనున్నట్టు వివరించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వాణిజ్య ప్రకటనల నేపథ్యంలో ఇప్పటికే పతంజలికి చెందిన 10 దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దయిన విషయం తెలిసిందే. ఆయుర్వేద ఉత్పత్తులతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ రాందేవ్ బాబాపై దేశంలోని పలు వైద్య సంఘాలు ఇప్పటికే ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన విషయం విదితమే. తాజాగా కోర్టు తీర్పుతో మార్కెట్‌లోనూ పతంజలి విశ్వసనీయత దెబ్బతిని నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రపతి ప్రసంగంపై వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగంపై పార్లమెంటు వెలుపల మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ "రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉంది. చివరి వరకు ఆమె మాట్లాడలేక అలసిపోయింది" అని అన్నారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ.. తన తల్లి మాటలకు మద్దతిస్తూ.. 'రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉంది. చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పారు" అని అన్నారు. ఈ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కేసు నమోదైంది.

తిరోగమన బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వేలో చాలా స్పష్టంగా బట్టబయలైందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానికి ఎకనామిక్ అడ్వైజర్‌గా ఉండే వ్యక్తి పర్యవేక్షణలో రూపొందిన రిపోర్టును సైతం పరిగణనలోకి తీసుకోకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. జాతీయ అభివృద్ధి వెనుకపట్టుపట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థూల జాతీయోత్పత్తి అంచనాలు భిన్నంగా పడిపోయాయని చెప్పారు. దీనికి కారణం ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడమే నన్నారు. ఈ కాలంలో నిత్యజీవితావసరాల సరుకులను సాధారణ ప్రజలు పెద్దగా కొనుగోలు చేయలేదన్నారు. ఉద్యోగుల, కార్మికుల వేతనాలు పెరగకపోవటమే ఇందుకు కారణమని తెలిపారు. కాని ధరలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో ఆహార సరుకుల ధరలు మరింత గా పెరిగాయని గుర్తు చేశారు. ఇది కష్టజీవుల జీవితాలను అతలాకుతలం చేసిన చర్య తప్ప మరేమిటని ప్రశ్నించారు. ఉపాధి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ... సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయమన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ పదేండ్ల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం మోసం కాక మరేమిటని ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసగించిందని విమర్శించారు. ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీ రామ్‌నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్, పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నరసింహారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ, డిజిటల్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుందర్ మాట్లాడుతూ...బీమా రంగంలో ఎఫ్‌డీఐలను 74 శాతం నుంచి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమేనని చెప్పారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై యుద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

కాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలకే కేటాయించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణతోసహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై బీజేపీ చూపిస్తున్న వివక్ష, రాజకీయ కక్షకు బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఉంటే కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చింది గాడిద గుడ్డేనని ఎద్దేవా చేశారు. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' తెలుగు గేయం వినిపించి తెలుగువారి ఆకాంక్షలకు, తెలుగునేల అభివృద్ధికి మొండిచేయి చూపించారని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు ఢిల్లీ, బీహార్ ఎన్నికల కోసమే అన్నట్టుగా ఉన్నాయన్నారు.

రాజకీయ అవసరాల కోసమే బడ్జెటా?

రాజకీయ అవసరాల కోసం బీజేపీ కేంద్ర బడ్జెట్‌ను ఉపయోగించుకుంటూ రాష్ట్రాలను విడదీస్తూ జాతి సమగ్రతను పక్కన పెట్టిందని మహేష్‌కుమార్ విమర్శించారు.

బడ్జెట్‌లో దేశ సమ్మిళిత వృద్ధిని కేంద్రం కొంచెం కూడా పట్టించుకోలేదన్నారు. బడ్జెట్ కేటాయింపులు తెలంగాణ పట్ల బీజేపీ కపట ప్రేమను చూపిస్తున్నాయన్నారు. అరకొర కేటాయింపులతో వికసిత్ భారత్ ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు. దేశ జీడీపీలో 5.1 శాతం వాటా ఉన్న తెలంగాణకు 2.10 శాతమే తిరిగి వస్తున్నదని గుర్తు చేశారు. తెలంగాణ నుంచి జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో సుమారు రూ.లక్ష వేల కోట్లు వసూలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కనీసం రూ. 40 వేల కోట్లు తిరిగి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బడ్జెట్‌లో విభజన చట్టం హామీలకు, మెట్రో రెండో దశకు ఇతర అభివృద్ధి పనులకు కేటాయింపులు శూన్యమన్నారు.

సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని గొప్పలకు పోయే బీజేపీకి దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజలు, వారి సమస్యలు కనపడకపోవడం విడ్డూరమన్నారు. 2025-26 బడ్జెట్ కేటాయింపులు చూసి తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించబోరని చెప్పారు.


కలిసికట్టుగా పోరాడుతాం

తెలంగాణ అభ్యున్నతికి రాజకీయాలకతీతంగా ప్రతి తెలంగాణ పౌరుడు ఏకతాటిపైకి రావాల్సిన అవసరముందని మహేష్‌కుమార్ నొక్కి చెప్పారు. కేంద్రం కక్ష పూరిత వైఖరికి నిరసనగా బీఆర్ఎస్, తెలంగాణవాదులు ముందుకు రావాలని కోరారు. తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గల్లీ నుంచి పట్టణం వరకు జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రధాన మంత్రి, ఆర్థికమంత్రి, తెలంగాణ కేంద్ర మంత్రుల దిష్టి బొమ్మలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు.

ధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, ఈర్లపల్లి శంకర్, నాగరాజు, డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్లు మెట్టు సాయికుమార్, మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, రియాజ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు, మీడియా కమిటీ చైర్మెన్ సామ రాంమోహన్‌రెడ్డి తదితరులున్నారు.

డబ్ల్యూటీఓలో తేల్చుకుంటాం !

(మొదటిపేజీ తరువాయి)



అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని స్పష్టం చేసింది. ట్రంప్ చర్యలను చైనా విదేశాంగ, వాణిజ్య శాఖలు తీవ్రంగా వ్యతిరేకించాయి. "చైనా వైఖరి చాలా ధృఢంగా, స్థిరంగా ఉన్నది. వాణిజ్యం, టారీఫ్‌ల యుద్ధంలో విజేత అంటూ ఎవరూ ఉండరు" అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. అమెరికా ఏకపక్షంగా తీసుకున్న ఈ టారీఫ్‌ల చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయన్నారు. ఈ చర్యలతో దేశీయంగా అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. పైగా, ఈ చర్యల వల్ల ఉభయ పక్షాలకూ ఎలాంటి ప్రయోజనమూ ఒనగూడదని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రయోజనాలు అసలే నెరవేరవన్నారు. ఫెంటనిల్ అనేది అమెరికా సమస్య అని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల నిరోధానికి అమెరికాతో సహకరిస్తున్నామనీ, గణనీయమైన ఫలితాలు కూడా వచ్చాయని చెప్పారు. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు.తమపై అమెరికా తీసుకున్న చర్యలతో తాము తీవ్ర అసంతృప్తికి గురయ్యామని చైనా వాణిజ్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈ చర్యలను ఖండిస్తున్నామని వివరించింది. అమెరికా తీసుకున్న తప్పుడు చర్యలకు ప్రతిస్పందనగా డబ్ల్యూటీఓలో చైనా ఫిర్యాదు చేస్తుందనీ, చైనా ప్రయోజనాలు, హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇతర దేశాలపై టారీఫ్‌లను విధిస్తామని తరచూ బెదిరించడం కన్నా ఫెంటనిల్, అందుకు సంబంధించిన అంశాలను హేతుబద్ధంగా, నిష్పక్షపాతంగా చూసి, పరిష్కరించాల్సి ఉన్నదని అమెరికాను చైనా కోరింది. ఘర్షణలను మరింత పెంచకుండా నివారించడానికి అమెరికాతో చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని పేర్కొన్నది. ఎలాంటి అరమరికలు లేని రీతిలో చర్చలు జరిపి, సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని వివరించింది.

ఐసీసీ ఈవెంట్లలో టీమ్ ఇండియా యువ జోరు కొనసాగుతుంది. 2023లో తొలిసారి చాంపియన్స్‌గా నిలిచిన మన అమ్మాయిలు.. 2025 ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌ను సైతం అలవోకగా అందుకున్నారు. టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన భారత్ 9 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిష (44, 3/15) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌ను భారత్ వరుసగా రెండోసారి సొంతం చేసుకుంది.



యువ విజేతలు

- అండర్-19 ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ భారత్ సొంతం
- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 9 వికెట్లతో ఘన విజయం
- తెలుగమ్మాయి గొంగడి త్రిష ఆల్‌రౌండ్ షో

నవతెలంగాణ-కౌలాలంపూర్

జూనియర్ క్రికెట్‌లో టీమ్ ఇండియాకు ఎదురులేదు. టోర్నమెంట్‌లో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించిన భారత మహిళల అండర్-19 జట్టు.. ఆదివారం కౌలాలంపూర్‌లో జరిగిన టైటిల్ పోరులోనూ దక్షిణాఫ్రికా అమ్మాయిలను చిత్తు చేశారు. సఫారీలపై స్పిన్ మాయజాలం ప్రయోగించిన టీమ్ ఇండియా అమ్మాయిలు.. వరుసగా రెండోసారి అండర్-19 టీ20 ప్రపంచకప్‌ను స్వదేశానికి తీసుకొచ్చారు. తెలంగాణ తేజం, భద్రచలం అమ్మాయి గొంగడి త్రిష ఫైనల్లో ఆల్‌రౌండ్ షోతో మెరిసింది. తొలుత బంతితో మూడు వికెట్లు పడగొట్టిన త్రిష.. ఛేదనలో అజేయంగా 44 పరుగులు సాధించింది. మ్యాచ్ విన్నింగ్స్ ప్రదర్శనతో ఫైనల్లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా అమ్మాయిలు 20 ఓవర్లలో 82 పరుగులకు కుప్పకూలింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 11.2 ఓవర్లలోనే ఊదేసింది. మరో 52 బంతులు మిగిలి ఉండగానే లాంఛనం ముగించింది. 2023 ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌కు టైటిల్ కోల్పోయిన దక్షిణాఫ్రికా.. తాజాగా జూనియర్ క్రికెట్ టీ20 ప్రపంచకప్ ఫైనల్లోనూ టీమ్ ఇండియా చేతిలో చిత్తుగా ఓడింది. అండర్-19 టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను భారత కెప్టెన్ నిక్కి ప్రసాద్‌కు ఐసీసీ ఛైర్మెన్ జై షా అందజేశారు.

మాయకు విలవిల

ఒత్తిడితో కూడిన టైటిల్ పోరులో టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా అమ్మాయిలు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. భారత అమ్మాయిలు స్పిన్ అస్త్రం సంధించటంతో సఫారీ బ్యాటర్లు విలవిల్లాడారు. ఏ దశలోనూ దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ సాఫీగా సాగలేదు. ఓపెనర్ జెమ్మా బొథా (16, 14 బంతుల్లో 3 ఫోర్లు) మినహా టాప్ ఆర్డర్‌లో అందరూ తేలిపోయారు. సిమోనె లారెన్స్ (0), డయరా (3), రెనెక (7) సహా మెసో (10) స్పిన్ ఉచ్చులో చిక్కుకున్నారు. మిడిల్ ఆర్డర్‌లో వాన్ (23, 18 బంతుల్లో 3 ఫోర్లు), ఫే కౌల్లింగ్ (15) మెరవటంతో దక్షిణాఫ్రికా 20 ఓవర్ల పాటు క్రీజులో నిలిచింది. తెలుగు తేజం గొంగడి త్రిష (3/15) స్పిన్ మంత్రతో మూడు వికెట్లు పడగొట్టింది. ఆయుశి శుక్లా (2/9), వైష్ణవి శర్మ (2/23), పారునిక సిసోడియ (2/6) సైతం నిప్పులు చెరిగారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో నలుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే వికెట్ కోల్పోగా.. నలుగురు మాత్రమే రెండెంకల స్కోరు సాధించారు.

ఆడుతూ పాడుతూ

83 పరుగుల లక్ష్యాన్ని టీమ్ ఇండియా అలవోకగా ఛేదించింది. ఓపెనర్ కమలిని (8) పవర్‌ప్లేలోనే నిష్క్రమించినా.. తెలుగు తేజం, మరో ఓపెనర్ గొంగడి త్రిష (44 నాటౌట్) ధనాధన్ దంచికొట్టింది. 8 ఫోర్లతో రెచ్చిపోయిన త్రిష.. సానిక చాల్కె (26 నాటౌట్)తో కలిసి భారత్‌ను గెలుపు తీరాలకు చేర్చింది. సానిక నాలుగు ఫోర్లతో మెరువగా.. 11.2 ఓవర్లలోనే భారత్ 84 పరుగులు చేసింది. మరో 52 బంతులు మిగిలి ఉండగానే భారత్ ఘన విజయం సాధించింది.

స్కోరు వివరాలు :

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : జెమ్మా బొథా (సి) కమలిని (బి) షబ్నమ్ 16, సిమెనె (బి) సిసోడియ 0, డయార (బి) ఆయుశి శుక్లా 3, రేనెక (సి) సిసోడియ (బి) త్రిష 7, మెసో (బి) ఆయుశి శుక్లా 10, మీకె (స్టంప్డ్) కమలిని (బి) త్రిష 23, ఫే కౌల్లింగ్ (బి) వైష్ణవి శర్మ 15, నాయుడు (బి) త్రిష 0, వాన్ (సి) వైష్ణవి శర్మ (బి) సిసోడియ 0, మోనాలిస (బి) వైష్ణవి శర్మ 0, నైని నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (20 ఓవర్లలో ఆలౌట్) 82.**

వికెట్ల పతనం : 1-11, 2-20, 3-20, 4-40, 5-44, 6-74, 7-74, 8-80, 9-80, 10-82.

బౌలింగ్ : జోషిత 2-0-17-0, సిసోడి 4-0-6-2, షబ్నమ్ శకిల్ 2-0-7-1, ఆయుశి శుక్లా 4-2-9-2, వైష్ణవి శర్మ 4-0-23-2, గొంగడి త్రిష 4-0-15-3.

భారత్ ఇన్నింగ్స్ : కమలిని (సి) లారెస్ (బి) రేనెక 8, గొంగడి త్రిష నాటౌట్ 44, సానిక చాల్కె నాటౌట్ 26, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (11.2 ఓవర్లలో 1 వికెట్) 84.**

వికెట్ల పతనం : 1-36.

బౌలింగ్ : నైని 1-0-7-0, ఫే కౌల్లింగ్ 2-0-19-0, రేనెక 4-1-14-1, నాయుడు 1-0-12-0, ఆష్లె వాన్ 1-0-12-0, మోనాలిస 1.2-0-10-0, జెమ్మా 1-0-9-0.

నజరానా రూ. 5 కోట్లు

ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన యువ భారత్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ నజరానా ప్రకటించింది. వరుసగా రెండోసారి జూనియర్ క్రికెట్‌లో టీ20 ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచిన అమ్మాయిలకు బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి దేవజిత్ సైకియలు అభినందనలు తెలిపారు. ప్రపంచకప్ జట్టుతో పాటు సహాయక సిబ్బందికి రూ.5 కోట్లు నగదు బహుమతి ఇస్తున్నామని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. అమ్మాయిలు స్వదేశం చేరుకోగానే విజయోత్సవ కార్యక్రమంలో సన్మానంతో పాటు నగదు బహుమతి అందించనున్నారు.

అదిరె అదిరె..



తెలంగాణ తేజం, భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిష ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి చాంపియన్ ప్రదర్శన చేసింది. 2023 అరంగేట్ర అండర్-19 టీ20 ప్రపంచకప్ విజయంలోనూ కీలక పాత్ర పోషించిన గొంగడి త్రిష తాజాగా కౌలాలంపూర్‌లోనూ కేక పెట్టించింది. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలువటంతో పాటు పార్ట్ టైమ్ స్పిన్ బౌలింగ్‌తో వికెట్లు పడగొట్టింది. 309 పరుగులు, ఏడు వికెట్లతో ఆల్‌రౌండర్‌గా రాణించిన త్రిష ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచింది. స్కాట్లాండ్‌తో సూపర్ సిక్స్ మ్యాచ్‌లో శతకంతో చెలరేగిన త్రిష.. బ్యాటింగ్ లైనప్‌ను ముందుండి నడిపించింది. ఫైనల్లోనూ బంతితో, బ్యాట్‌తో అదరగొట్టింది. అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో త్రిష అద్భుత ఆటతీరుతో భారత్‌ను విజేతగా నిలబెట్టగా.. హైదరాబాద్‌లోని ఆమె శిక్షణ పొందుతున్న అకాడమీ సహా భద్రాచలంలో పండుగ వాతావరణం నెలకొంది.

అభిషేక్ అదరహో

- 54 బంతుల్లో 135 బాదిన శర్మ
- ఐదో టీ20లో భారత్ ఘన విజయం
- 4-1తో టీ20 సిరీస్ ఆతిథ్య జట్టు సొంతం



నవతెలంగాణ-ముంబయి : యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (135, 54 బంతుల్లో 7 ఫోర్లు, 13 సిక్స్‌లు) ధనాధన్ దంచికొట్టాడు. 37 బంతుల్లోనే సెంచరీ బాదిన అభిషేక్ శర్మ వాంఖడెలో ఇంగ్లాండ్ బౌలర్లను ఉతికారేశాడు. స్వల్ప స్కోర్లతో సాగిన సిరీస్‌కు ముంబయిలో పరుగుల వరదతో అదిరే ముగింపు అందించాడు. అభిషేక్ శర్మ సూపర్ షోతో భారత్ తొలుత 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో ఇంగ్లాండ్ 10.3 ఓవర్లలోనే చేతులెత్తేసింది. ఫిల్ సాల్ట్ (55, 23 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరిసినా.. బెన్ డకెట్ (0), జోశ్ బట్లర్ (7), హ్యారీ బ్రూక్ (2), లియాం లివింగ్‌స్టోన్ (9), జాకబ్ బెతెల్ (10), బ్రైడన్ కార్సె (3), జెమీ ఓవర్టన్ (1) విఫలం అయ్యారు. 97 పరుగులకు ఆలౌట్ అయిన ఇంగ్లాండ్ 150 పరుగుల రికార్డు తేడాతో పరాజయం పాలైంది. 4-1తో ఐదు మ్యాచుల టీ20 సిరీస్ టీమ్ ఇండియా సొంతమైంది. అభిషేక్ శర్మ (135, 2/3) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. పరుగుల పరంగా ఇంగ్లాండ్‌కు ఇది టీ20ల్లో అత్యంత దారుణ పరాజయం.

అభిషేక్ షో : టాస్ నెగ్గి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్‌కు అభిషేక్ శర్మ (135) చుక్కలు చూపించాడు. 13 సిక్సర్లతో విరుచుకుపడిన అభిషేక్ శర్మ 37 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. మూడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 17 బంతుల్లో ఫిఫ్టీ సాధించిన అభిషేక్.. ఏ బౌలర్‌ను వదల్లేదు. సంజు శాంసన్ (16), సూర్యకుమార్ యాదవ్ (2), తిలక్ వర్మ (24) స్వల్ప స్కోరు వెనుదిరిగినా.. ఓ ఎండ్‌లో బౌలర్ల భరతం పట్టాడు. వాంఖడెలో సిక్సర్ల సునామీ సృష్టించిన అభిషేక్ ఓ టీ20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన రోహిత్ శర్మ (10) రికార్డును బద్దలుకొట్టాడు. టీ20ల్లో అత్యధిక స్కోరు సాధించిన శుభ్‌మన్ గిల్ (126)ను సైతం అభిషేక్ వాంఖడెలో దాటేశాడు. అభిషేక్ దూకుడు ముంగిట ఇంగ్లాండ్ తేలిపోయింది. బౌలింగ్ కాంబినేషన్లు మారినా మనోడి ఊచకోత మారలేదు. శివం దూబె (30), అక్షర్ పటేల్ (15) రాణించారు. హార్దిక్ పాండ్య (9), రింకు సింగ్ (9) నిరాశపరిచారు. 20 ఓవర్లలో 9 వికెట్లకు భారత్ 247 పరుగుల భారీ స్కోరు సాధించింది.

హైదరాబాద్ ఓటమి

నాగ్‌పూర్ : రంజీ ట్రోఫీని హైదరాబాద్ ఓటమితో ముగించింది. విదర్భ నిర్దేశించిన 220 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ ఛేదించలేకపోయింది. 161 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ బ్యాటర్లలో రాహుల్ (48) మినహా అందరూ విఫలం అయ్యారు. తన్మయ్ (6), అభిరాత్ (21), తనయ్ (18), హిమతేజ (0), వరుణ్ గౌడ్ (5), రాహుల్ బుద్ధి (9) నిరాశపరిచారు. ఆఖర్లో సిరాజ్ (26), మిలింద్ (20) మెరిసినా.. ఓటమి తప్పలేదు. 38.5 ఓవర్లలో హైదరాబాద్ 161 పరుగులకు ఆలౌటైంది. 58 పరుగులతో విదర్భ మెరుపు విజయం సాధించింది. గ్రూప్-బి నుంచి విదర్భతో పాటు గుజరాత్ నాకౌట్‌కు అర్హత సాధించింది. హైదరాబాద్ నాల్గో స్థానంతో సరిపెట్టుకుంది.



ఈసారీ కప్పు మాదే : అఖిల్

'సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సిసిఎల్) ఆడుతూ పెరిగాను. సిసిఎల్‌ది 14 ఏళ్ళ జర్నీ.ఇప్పటివరకు 4 సార్లు కప్పు గెలిచాం. ఈసారి కూడా కప్పు మనదే అనే నమ్మకంతో ఉన్నాం' అని హీరో అఖిల్ అన్నారు. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సిసిఎల్) విజయవంతంగా 10 సీజన్లను పూర్తి చేసుకుంది. ఈనెల 8న బెంగళూరులో ఈ సీజన్‌ను ప్రారంభం కానుంది. ఈ సీజన్స్‌లో నాలుగుసార్లు ఛాంపియన్‌లుగా నిలిచి, 5వ టైటిల్ గెలుపు కోసం సిద్ధమవుతున్న తెలుగు వారియర్స్ పై అందరి దృష్టి ఉంది. ఈ సందర్భంగా తెలుగు వారియర్స్ జెర్సీ లాంచ్ ప్రెస్ మీట్ నిర్వహించింది.

తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ, 'గ్లింప్స్‌లో చూస్తే ఓ చోట మరీ చిన్నపిల్లాడిలా కనిపించాను. సిసిఎల్ ఆడుతూ పెరిగాను. విష్ణు, సచిన్ ప్యాషన్‌తో ఇది సాధ్యపడిందని భావిస్తున్నాను. మేము నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈసారి కూడా టైటిల్ కొట్టి ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలుస్తామనే నమ్మకం ఉంది. అన్నింటికంటే అందరినీ ఎంటర్‌టైన్ చేయాలనే ప్యాషన్‌తో వస్తున్నాం. ఈనెల 14, 15 ఉప్పల్ స్టేడియంలో ఆడుతున్నాం. అందరూ వచ్చి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాం' అని అన్నారు

'క్రికెటర్ కావాలనేది నా చిన్నప్పటి డ్రీం. సిసిఎల్ ఫార్మెట్ నా డ్రీంని తీర్చింది. దేశంలోని ప్రముఖ మైదానాల్లో క్రికెట్ ఆడటం ఓ అదృష్టం. అఖిల్ అగ్రెసివ్ కెప్టెన్. తన ఎత్తుగడలు అద్భుతంగా ఉంటాయి. మూడు నెలలుగా చాలా ప్రాక్టీస్ చేశాం. ఈసారి తప్పకుండా కప్ కొడతాం. విష్ణు చాలా ప్యాషన్‌తో సీజన్స్‌ని ముందుకు తీసుకుతీసుకెళ్తున్నారు' అని ఎస్ఎస్ తమన్ చెప్పారు.

సచిన్ జోషి మాట్లాడుతూ,'ఇండియాలో అందరి డ్రీమ్ క్రికెట్. ఆ డ్రీమ్ మాకు సిసిఎల్ రూపంలో తీరింది. ఈ క్రెడిట్ విష్ణుకి ఇస్తాను. తన ఆలోచన గొప్ప విజయం సాధించింది' అని అన్నారు. హీరో ఆది మాట్లాడుతూ,'తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ మాకు విరాట్ కోహ్లి లాంటి ప్లేయర్. చాలా ప్యాషన్‌తో ఆడుతున్నాం. నాలుగు సార్లు కప్ కొట్టాం. ఈసారి మళ్ళీ ఛాంపియన్ అవుతాం' అని తెలిపారు.

నవచిత్రం

'ఆకాశంలో ఒక తార'..



దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాదినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్, గుణ్ణం గంగరాజు కలిసి ముందుకు వచ్చారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా వంటి నిర్మాణ సంస్థలు ఈ చిత్ర నిర్మాణంలో భాగమయ్యాయి.

ఆదివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి నిర్మాతలు అల్లు అరవింద్, అశ్విని దత్ తదితరులు హాజరయ్యారు. ముహూర్తం షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, అశ్విని దత్ కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి గుణ్ణం గంగరాజు దర్శకత్వం వహించారు. నటీనటులు, సాంకేతిక నిపుణలకు సంబంధించిన వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు. తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారు.

'భిన్న చిత్రాలకు, పాత్రలకు దుల్కర్ సల్మాన్ కేరాఫ్. ఇటీవల ఆయన 'లక్కీభాస్కర్'తో బ్లాక్‌బస్టర్‌ని సొంతం చేసుకున్నారు. దీంతో ఆయన సినిమా అంటే అందరిలోనూ ఆసక్తితోపాటు అంచనాలూ పెరుగుతున్నాయి' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు: సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం, సమర్పణ – గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, దర్శకుడు: పవన్ సాదినేని, రచయిత: గంగరాజు గుణ్ణం, డిఓపీ : సుజిత్ సారంగ్, ప్రొడక్షన్ డిజైనర్ : శ్వేత సాబు సిరిల్.

'ది ప్యారడైజ్'కు అనిరుధ్ సంగీతం



నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబోలో రూపొందిన చిత్రం 'దసరా'. ఈ సినిమా బ్లాక్ బస్టర్ సాధించింది. తాజాగా ఇదే కలయికలో 'ది ప్యారడైజ్' అనే సినిమా తెరకెక్కనుంది. ఇది త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. నాని కూడా తన పాత్ర కోసం సిద్ధం కావడానికి ఇంటెన్స్‌గా జిమ్ చేస్తున్నారు.

అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించడం ఖాయమైంది. 'జెర్సీ, గ్యాంగ్‌లీడర్' హిట్స్ తర్వాత నాని, అనిరుధ్ కలిసి పనిచేస్తున్న మూడవ చిత్రం ఇది. గత రెండు సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో హీరో నాని సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

'మేము మా హ్యాట్రిక్ పై నమ్మకంగా ఉన్నాం. ఇది ఒక అద్భుతం అవుతుంది' అని నాని పోస్ట్ చేశారు. మేకర్స్ మాట్లాడుతూ, 'శ్రీకాంత్ ఓదెల పవర్ ఫుల్, లార్జర్ దెన్ లైఫ్ కథను ఇంటెన్స్ స్క్రీన్‌ప్లేతో రూపొందించారు. ఇది నానిని పూర్తిగా కొత్త, మాస్-డ్రైవ్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. కథ డిమాండ్ మేరకు గ్రాండ్ స్కేల్‌లో నిర్మిస్తున్నాం. ఈ చిత్రం ఇప్పటివరకు నాని కెరీర్‌లో మోస్ట్ హై బడ్జెట్ వెంచర్. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తాం' అని తెలిపారు.

చైనా, కెనడా, మెక్సికోలపై అదనపు టారిఫ్‌లు !

- ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు
- తలెత్తిన వాణిజ్య యుద్ధం ?



వాషింగ్టన్ : అమెరికాకే తమ ప్రాధాన్యత, అమెరికన్ల ప్రయోజనాలే ముఖ్యమంటూ ఎన్నికల ప్రచార సమయం నుండి చెప్పుకుంటూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే వరుసగా తాననుకున్న చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే మెక్సికో, కెనడా, చైనాల నుండి వచ్చే దిగుమతులపై అదనపు టారిఫ్‌లు విధించారు. ఈ మేరకు శనివారం ఆయన ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఈ టారిఫ్‌లు మంగళవారం నుండి అమల్లోకి రానున్నాయి. అమెరికన్లను రక్షించేందుకు ఈ టారిఫ్‌లు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఫెంటనిల్ అక్రమ తయారీ, ఎగుమతులపై మరిన్ని చర్యలు తీసుకోవాలని చైనాను కోరారు. అలాగే అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించే వారి సంఖ్యను కెనడా, మెక్సికోలు తగ్గించాలని ట్రంప్ పేర్కొన్నారు. చైనా నుండి వచ్చే దిగుమతులన్నింటిపై 10శాతం, అలాగే చైనా మెక్సికో, కెనడాల నుండి వచ్చే దిగుమతులపై 25శాతం సుంకాలు విధించడానికి గానూ ఆర్థిక అత్యవసర పరిస్థితిని ట్రంప్ ప్రకటించారు. కెనడా నుండి చమురు, ఖనిజ వాయువు, విద్యుత్‌లను దిగుమతి చేసుకుంటారు. వాటిపై పది శాతం చొప్పున పన్ను విధించనున్నారు. ఇతర దేశాలు తీసుకునే ప్రతీకార చర్యలకు వ్యతిరేకంగా అమెరికా వసూలు చేసే రేట్లను పెంచే యంత్రాంగం కూడా ట్రంప్ ఉత్వర్వుల్లో వుంది. దీంతో మరింత తీవ్రమైన ఆర్థిక అంతరాయం తలెత్తే పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నారు.

ఈ చర్యలతో సుదీర్ఘంగా మిత్రపక్షాలుగా వున్న దేశాలతో వాణిజ్య యుద్ధానికి పురి గొల్పినట్లైంది. అలాగే ఎన్నికల సమయంలో ట్రంప్ హామీ ఇచ్చిన మేరకు నిత్యావసరాల ధరలు, గ్యాసోలిన్, ఇళ్ల నిర్మాణం, ఆటోలు, ఇతర వస్తువుల ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశపడ్డారు. కానీ ట్రంప్ తాజా చర్యలతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఈ టారిఫ్‌లు ఇలాగే కొనసాగితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వృద్ధికి అంతరాయం కలుగుతుందని, పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారే అవకాశముందని భయపడుతున్నారు.

కాగా ఈ చర్యల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు జరిగే నష్టంపై యేలే లోని బడ్జెట్ ల్యాబ్ విశ్లేషణ జరిపింది. సగటు అమెరికన్ కుటుంబం ఈ పన్నుల వల్ల తన ఆదాయంలో 1170డాలర్ల మేరకు నష్టపోతుందని పేర్కొంది. వృద్ధిరేటు మందగిస్తుందని, ద్రవ్యోల్బణ పరిస్థితులు మరింత పెచ్చరిల్లుతాయని, ఇతర దేశాలు తీసుకునే ప్రతీకార చర్యలతో పరిస్థితి మరింత దిగజారుతుందని పేర్కొంది. డెమోక్రాట్లు కూడా తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ తీసుకున్న చర్యల ఫలితమే రాబోయే పరిస్థితులని హెచ్చరించారు.

యుద్ధ నౌకల విధ్వంసక క్షిపణి ప్రయోగం

- పరీక్షించిన ఇరాన్

టెహరాన్ : వెయ్యి కిలోమీటర్ల దూరంలో గల ఓడలను చేరుకునే సామర్థ్యం గల యుద్ధ నౌకల విధ్వంసక క్షిపణిని ఇరాన్ శనివారం ప్రయోగించింది. ఈ మేరకు ప్రభుత్వ టీవీ నివేదిక తెలిపింది. అంటే ఒమన్ పర్షియన్ గల్ఫ్ తీరంలో అమెరికా నావికాదళానికి చెందిన నౌకలను ఈ క్షిపణి చేరుకోగలదు. "ఇది ఘదర్-380 మైల్ ట్రైప్ ఎల్. దీని రేంజ్ వెయ్యి కిలోమీటర్లు. దీనికి జామింగ్ నిరోధక సామర్థ్యం ఉంది" అని రివల్యూషనరీ గార్డ్ నావికాదళ అధిపతి జనరల్ అలీ రెజా చెప్పారు. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతంలో భూగర్భంలోని క్షిపణి కేంద్రాన్ని వార్తల్లో చూపించారు. అయితే ఈ పరీక్ష ఎప్పుడు జరిగిందనే వివరాలు గానీ, ఆ క్షిపణిక యుద్ధ శీర్షం వుందా లేదా అనే సమాచారం గానీ వెల్లడించలేదు. ఈ క్షిపణి కేంద్రమనేది రివల్యూషనరీ గార్డుకు గల క్షిపణి వ్యవస్థల్లో ఒకటని అలీ రెజా వెల్లడించారు. ఈ క్షిపణులు శత్రువు యుద్ధనౌకలకు నరకం సృష్టించగలవని హెచ్చరించారు. ఇది అత్యంత అధునాతనమైన కొత్త ఆయుధమని మాత్రమే ఆ నివేదిక పేర్కొన్నది. సెంట్రల్ ఇరాన్‌లోని భూగర్భ కేంద్రం నుంచి ఒమన్ సముద్రంలోకి ఈ క్షిపణిని ప్రయోగించారు. ఐదు నిముషాల్లోపే ఈ క్షిపణిని సిద్ధం చేసి, ప్రయోగించవచ్చన్నారు. 2011 నుంచి ఇరాన్.. ప్రతిసారీ క్షిపణి పరీక్షలతో పాటూ భూగర్భ క్షిపణి కేంద్రాలనూ ప్రారంభిస్తున్నట్టు ప్రకటిస్తూ వస్తోంది. దేశవ్యాప్తంగా ఈ భూగర్భ కేంద్రాలు ఉన్నాయనీ, అలాగే వ్యూహాత్మకమైన హోర్ముజ్ జలసంధి తీరం పొడవునా కూడా ఉన్నాయని తెలిపింది.

చంద్రచూడ్ ఇంటికి మోడీ వెళ్లకూడదు

- జస్టిస్ హృషికేశ్ రాయ్



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్ ఇంటికి ప్రధాని మోడీ వెళ్లకుండా ఉండాల్సిందని జస్టిస్ హృషికేశ్ రాయ్ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తాజాగా పదవీ విరమణ చేసిన జస్టిస్ హృషికేశ్ రాయ్.. తన పదవీ విరమణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ సంఘటన ప్రధాన న్యాయమూర్తి వ్యక్తిగత కార్యక్రమం. వాస్తవానికి ఈ దృశ్యాలు కొంత కలవరపెట్టేలా కనిపించాయి. కానీ, గతాన్ని పరిశీలిస్తే, దానిని నివారించవచ్చని నేను నమ్ముతున్నా" అని అన్నారు. ఒకవేళ మీడియా కవరేజ్ లేకుండా ఈ సమావేశం ప్రయివేట్‌గా జరిగి ఉంటే ఆందోళనలను రేకెత్తించకపోవచ్చని జస్టిస్ హృషికేశ్ రాయ్ అభిప్రాయపడ్డారు. "ఈ కార్యక్రమం పూజాగది నుంచి ప్రజల దృష్టికి వెళ్లి అనవసరమైన ఊహాగానాలను సృష్టించే సమస్యకు దారి తీసింది" అని అన్నారు. ఈ సమావేశంలో ఇద్దరూ కూడా కోర్టుకు సంబంధించిన ఎలాంటి విషయాలనూ చర్చించలేదనీ, న్యాయమూర్తి నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరుగలేదని తాను నమ్ముతున్నట్టు చెప్పారు. "జస్టిస్ చంద్రచూడ్ పూర్తిగా నిజాయితీపరుడు. దానిని చెప్పడానికి నాకు ఎలాంటి సంకోచమూ లేదు" అని జస్టిస్ రాయ్ అన్నారు. జస్టిస్ డివై చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి పూజా కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొనడంపై అప్పట్లో వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.